
సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+16 వెల: ₹ 5.00
సంపుటి: 12 సంచిక: 80
మంగళవారం 11-6-2019
SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'




**విండీస్, సౌతాఫ్రికా మ్యాచ్ రద్దు**
భారీ వర్షం కారణంగా ప్రపంచకప్‌లో మరో మ్యాచ్ రద్దు. – స్పోర్ట్స్‌లో



**కస్టమర్లకూ 'రెపో' లాభం!**
యాక్సిస్ బ్యాంక్ బ్రాంచ్ బ్యాంకింగ్ హెడ్ రవి నారాయణన్ – బిజినెస్‌లో

## 'కఠువా' చిన్నారిపై హత్యాచారం...
# ముగ్గురికి యావజ్జీవం



- ఏడాదిన్నర క్రితం తీవ్ర సంచలనం సృష్టించిన కఠువా సామూహిక అత్యాచారం, హత్య కేసులో ఏడుగురు నిందితుల్లో ఆరుగురిని కోర్టు సోమవారం దోషులుగా తేల్చింది. వారిలో ముగ్గురికి యావజ్జీవ శిక్ష, ముగ్గురికి ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రధాన నిందితుడు సంజీరామ్ కొడుకు అయిన విశాల్‌ను కోర్టు సరైన సాక్ష్యాలు లేని కారణంగా నిర్దోషిగా విడుదల చేసింది. -13లో



# గిరీశ్ కర్నాడ్ కన్నుమూత

- దీర్ఘకాలంగా అనారోగ్యం.. బెంగళూరులో తుదిశ్వాస విడిచిన నట దిగ్గజం
- బహుభాషా నటుడు, రచయిత, సాహితీవేత్తగా ప్రసిద్ధి
- నిరాడంబరంగా అంత్యక్రియలు పూర్తి
- రాష్ట్రపతి, ప్రధాని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సీఎంల సంతాపం
- మూడురోజులు సంతాప దినాలుగా ప్రకటించిన కర్ణాటక ప్రభుత్వం

-13లో

**ఆకాశానికి ఎదిగిన గిరి** - ఫ్యామిలీలో



## యువరాజ్ గుడ్‌బై

**స్టార్ క్రికెటర్ రిటైర్మెంట్**

భారత వన్డే క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న యువరాజ్ సింగ్ ఆటకు వీడ్కోలు పలికాడు. అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు ఐపీఎల్ నుంచి కూడా తప్పుకుంటున్నట్లు అతను వెల్లడించాడు. సోమవారం జరిగిన మీడియా సమావేశంలో తన రిటైర్మెంట్ గురించి ప్రకటన చేశాడు. – స్పోర్ట్స్‌లో

## కొత్త సచివాలయానికి
# 27న శంకుస్థాపన!

**భూమి పూజ చేయనున్న ముఖ్యమంత్రి కేసీఆర్**




- ప్రస్తుత సచివాలయం ఉన్న చోటే కొత్త భవనం
- ఏ, బీ, సీ, డీ బ్లాకులు కూల్చి అక్కడే నిర్మాణం
- ఏపీ భవనాల స్వాధీనానికి చర్యలు వేగవంతం
- ఇరు రాష్ట్రాల అధికారులతో సీఎస్ భేటీ
- భవనాలను వెంటనే అప్పగించాలని సూచన

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర కొత్త సచివాలయ భవన నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది! విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ నెల 27న కొత్త సచివాలయ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు భూమి పూజ చేయనున్నారు. ఈ నెల 27 తర్వాత నుంచి మూడు నెలల వరకు సుముహూర్తాలేవీ లేకపోవడంతో 27వ తేదీనే ముహూర్తం ఖరారు చేసినట్లు తెలిసింది. అయితే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఇంకా అధికారికంగా ఎటువంటి ప్రకటన జారీ చేయలేదు. ప్రస్తుతం తెలంగాణ సచివాలయ కార్యాలయాలు కలిగిన ఏ, బీ, సీ, డీ బ్లాకుల భవనాలను కూల్చి వాటి స్థానంలో కొత్త సచివాలయ భవనం నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కొత్త సచివాలయ భవన నిర్మాణ పనులను ప్రారంభించడానికి వీలుగా ఏపీ ప్రభుత్వ అధీనంలోని సచివాలయ భవనాలను వెంటనే స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీ అధీనంలో ఉన్న సచివాలయం, అసెంబ్లీ భవనాలతోపాటు ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను తమకు అప్పగించాలని ఇటీవల ఆ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. రాష్ట్ర విభజన అనంతరం సచివాలయంలోని ఏ, బీ, సీ, డీ బ్లాకులను తెలంగాణకు, మిగతా 5వ పేజీలో ▶

సోమవారం ఏపీలోని వెలగపూడి సచివాలయంలో జరిగిన తొలి కేబినెట్ భేటీలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు, సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం



# మాటే మంత్రంగా..

**హామీల అమలుకు ఆంధ్రప్రదేశ్ కేబినెట్ నిర్ణయం**

**తొలి భేటీలోనే ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ సంచలన నిర్ణయాలు**

ఉద్యోగులు, రైతులు, డ్వాక్రా యానిమేటర్స్, రిసోర్స్ పర్సన్లు, అంగన్‌వాడీ వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులపై వరాల జల్లు

- ➡ అగ్రిగోల్డ్ బాధితుల కోసం కేటాయించిన నిధి రూ.1150 కోట్లు
- ➡ అన్ని శాఖల్లోని పారిశుద్ధ్య కార్మికులకు పెంచిన వేతనం రూ.18,000
- ➡ డ్వాక్రా యానిమేటర్లు, రిసోర్స్ పర్సన్స్‌కు గౌరవ వేతనం 10,000
- ➡ జూలై నుంచి ఉద్యోగులకు అమలు కానున్న ఐఆర్ 27 శాతం - 2లో

# భట్టి ఆమరణ దీక్ష భగ్నం

**బలవంతంగా నిమ్స్‌కు తరలించిన పోలీసులు**

- మధ్యాహ్నం వరకు ఆస్పత్రిలోనే దీక్ష కొనసాగించిన సీఎల్పీ నేత
- వైద్యానికి నిరాకరణ... ఏఐసీసీ నేతల జోక్యంతో చికిత్సకు అంగీకారం
- నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేసిన ఉత్తమ్ తదితరులు
- నేడు కలెక్టరేట్ల ఎదుట ధర్నాలకు టీపీసీసీ పిలుపు

**సాక్షి, హైదరాబాద్:** కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని టీఆర్‌ఎస్‌లో విలీనం చేస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయానికి నిరసనగా గత మూడు రోజులుగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేస్తున్న ఆమరణ దీక్షను పోలీసులు భగ్నం చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోందన్న వైద్యుల సమాచారం మేరకు సోమవారం ఉదయం 7 గంటలకు చిక్కడపల్లి ఏసీపీ నర్సింహారెడ్డి నేతృత్వంలో పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకొని నిమ్స్‌కు తరలించారు. భట్టి దీక్షను భగ్నం చేస్తున్న సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు కొందరు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ పోలీసులు చాకచక్యంగా ఆయన్ను అక్కడి నుంచి తరలించారు. అయితే నిమ్స్‌కు తరలించిన తర్వాత కూడా భట్టి తన దీక్షను విరమించేది లేదని వైద్యానికి నిరాకరించారు. దీంతో టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఈ విషయాన్ని ఏఐసీసీ నేతల దృష్టికి తీసుకెళ్లారు. చివరకు ఏఐసీసీ నేతల సూచనతో భట్టి తన దీక్ష విరమించడానికి సిద్ధమయ్యారు. సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ములుగు ఎమ్మెల్యే సీతక్క, మిగతా 2వ పేజీలో ▶



నిమ్స్‌లో భట్టి విక్రమార్కకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేయిస్తున్న టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో కోమటిరెడ్డి, పొన్నాల, మల్లు రవి తదితరులు

# 12 మంది ఐటీ అధికారులపై వేటు

**కేంద్ర ప్రభుత్వ సంచలన నిర్ణయం**



- అవినీతి, విధుల్లో నిర్లక్ష్యం, మహిళా అధికారులపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న 12 మంది సీనియర్ ఆదాయపు పన్ను అధికారులపై ప్రభుత్వం వేటు వేసింది. ఉద్వాసనకు గురైన వారిలో చీఫ్ కమిషనర్, ప్రిన్సిపల్ కమిషనర్, కమిషనర్ స్థాయి అధికారులుండటం గమనార్హం. - 13లో









గెలిచినోళ్లు అలానే అంటార్సార్!
మనం ఓడినోళ్లం..
ఏ ముఖం పెట్టుకుని వెళ్తాం!!



## 42.40 లక్షల మందికి
# 'ఉపాధి హామీ'

- 2018–19లో రూ. 3 వేల కోట్లతో అమలు
- ప్రస్తుత ఏడాదిలోనూ వేగంగా పనుల కేటాయింపు
- గత నెలాఖరు వరకు 31.20 లక్షల మందికి ఉపాధి
- రాష్ట్ర ఉపాధి హామీ మండలి సమీక్ష నివేదికలో వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** ఉపాధి హామీ పథకం అమల్లో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచేలా గ్రామీణాభివృద్ధిశాఖ చర్యలు తీసుకుంటోంది. గడువులోగా లక్ష్యం చేరేలా కసరత్తు చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 12 కోట్ల పని దినాలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపగా ఇప్పటికే రూ. 947.2 కోట్లు ఖర్చు చేసి 5.70 కోట్ల పనిదినాలు కల్పించారు. గత నెలాఖరు వరకు రాష్ట్రంలోని 19.4 లక్షల కుటుంబాలకు చెందిన 31.20 లక్షల మంది కూలీలకు పనులు ఇచ్చారు. ఉపాధి హామీ పథకం ప్రారంభం నుంచి 2018–19 సంవత్సరంలోనే అత్యధికంగా 25.20 లక్షల కుటుంబాలకు చెందిన 42.40 లక్షల మంది కూలీలకు పనులు ఇవ్వగా వారిలో 2,24,366 కుటుంబాలకు వంద రోజుల పని దినాలు మిగతా 4వ పేజీలో ▶



# ఆపద్బంధు పొడిగింపు

- ఈ ఏడాది నవంబర్ వరకు స్కీం గడువు పెంచుతూ ఉత్తర్వులు
- ఆబ్కారీ బీమా కింద కవరైతే గీత కార్మికులకు వర్తించదు
- కుక్క కరిచిన 12 నెలల్లోపు చనిపోతే ఆపద్బంధు
- మొత్తం 17 కేటగిరీలకు పథకం వర్తింపు

**సాక్షి, హైదరాబాద్:** బాధిత కుటుంబాలకు ఆపన్నహస్తం అందించే 'ఆపద్బంధు'పథకాన్ని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలకు వర్తించే ఈ పథకం గతేడాది నవంబర్ ఒకటో తేదీతో ముగిసింది. అయితే, తాజాగా ఈ పథకాన్ని ఈ ఏడాది నవంబర్ ఒకటి వరకు పొడిగిస్తూ సోమవారం విపత్తుల నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శి రాజేశ్వర్ తివారీ ఉత్తర్వులు జారీ చేశారు. 17 కేటగిరీల కింద ప్రమాదవశాత్తు చనిపోయిన వారి కుటుంబీకులు ఈ పథకానికి అర్హులు. ఆపద్బంధు కింద రూ.50 వేల సాయాన్ని ప్రభుత్వం అందజేస్తుంది. అల్లర్లు, శాంతి భద్రతల విఘాతంలో ప్రాణాలొదిలినా, రోడ్డు ప్రమాదాల్లో చనిపోయినా, పడవ ప్రమాదంలో మిగతా 2వ పేజీలో ▶

## నేడు, రేపు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు

### కేరళ, తమిళనాడుల్లో విస్తరిస్తున్న రుతుపవనాలు



**సాక్షి, హైదరాబాద్:** దక్షిణ అరేబియా సముద్రం, లక్ష దీవుల ప్రాంతాలకు పూర్తి గా, కేరళలో చాలా ప్రాంతాలకు, తమిళనాడులో మరికొన్ని ప్రాంతాలకు నైరు తి రుతుపవనాలు విస్తరించాయి. దీంతో తెలంగాణలో మంగళవారం అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతోపాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే బుధవారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు వచ్చే మూడు రోజులు ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో కొన్నిచోట్ల వడగాడ్పులు వీచే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఇదిలా ఉండగా సోమవారం ఆదిలాబాద్‌లో అత్యధికంగా 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఖమ్మం, రామగుండంలో 43, హన్మకొండ, మెదక్, నిజామాబాద్‌ల్లో 42 డిగ్రీల చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా, భద్రాచలంలో 36, మహబూబ్‌నగర్‌లో 38, హైదరాబాద్‌లో 39 డిగ్రీల చొప్పున పగటి ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

## మార్కులు అప్‌లోడ్ చేస్తే ర్యాంకులిస్తాం

### ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎన్.యాదయ్య

**సాక్షి, హైదరాబాద్:** ఎంసెట్‌లో కొంతమంది విద్యార్థుల ఇంటర్మీడియట్ మార్కులకు సంబంధించిన సమాచారం ఇవ్వనందునే వారికి ర్యాంకులను కేటాయించలేదని ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎన్.యాదయ్య తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే తమ వెబ్‌సైట్‌లో **(https://eamcet.tsche.ac.in)** వెబ్ లింక్‌ను ఉంచామని తెలిపారు. విద్యార్థులు తమ మార్కులను అప్‌లోడ్ చేయడంతోపాటు ఒరిజినల్ మార్కుల మెమో/తాజా ఇంటర్మీడియట్ హాల్‌టికెట్ (ఏపీ, టీఎస్) స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలని, వాటి ఆధారంగా వారికి ర్యాంకులను కేటాయిస్తామని వివరించారు. సీబీఎస్‌ఈ బోర్డు 12వ తరగతి విద్యార్థుల మార్కులను ఇవ్వలేదని, రిజిస్ట్రేషన్ సమయంలో కొంత మంది విద్యార్థులు తమ ఇంటర్మీడియట్ హాల్‌టికెట్ నెంబర్లు తప్పుగా వేశారని, ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్మీడియట్ ఫలితాలు రాలేదని, ఇతర రాష్ట్ర బోర్డుకు సంబంధించిన వారు మార్కులకు వివరాలు, ఆధారాలు ఇవ్వలేదని, అందుకే వారికి ర్యాంకులను కేటాయించలేదని తెలిపారు. వారు తమ వివరాలను ఇస్తే ర్యాంకులను కేటాయిస్తామని వివరించారు.

## ఎస్‌ఎల్‌బీసీపై వివరణ కోరిన సీఎస్

### జరిగిన, పెండింగ్ పనుల వివరాలు ఇవ్వాలని ఆదేశం



ఎస్‌కే జోషి

**సాక్షి, హైదరాబాద్:** ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో అవాంతరాలు, ఆగిన పనులకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి నీటి పారుదల శాఖ నుంచి వివరణ అడిగారు. ప్రాజెక్టుల పరిధిలో ఇప్పటి వరకు జరిగిన పనులు, పెండింగ్ పనులపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని కోరారు. టన్నెల్ పనులు ఏడాదిగా ఆగాయని, దీనికి తోడు కరెంట్ బిల్లులు కూడా కట్టలేని పరిస్థితుల్లో ప్రాజెక్టు అనేక అవాంతరాలు ఎదుర్కొంటున్న వైనంపై 'సాక్షి'ప్రచురించిన కథనాలపై ఆయన స్పందించారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు ఇంకా అవసరమైన నిధులు, ఏజెన్సీ ఇదివరకు అడ్వాన్సులు కోరుతూ పెట్టిన అర్జీల అంశాలతో నీటి పారుదల శాఖ నోట్ సిద్ధం చేస్తోంది. పనుల పూర్తికి కనీసం రూ.80కోట్లు అడ్వాన్సుగా ఇవ్వాలని ఏజెన్సీ కోరుతోంది. దీనిపై త్వరలోనే జరిగే కేబినెట్ భేటీలో ఓ నిర్ణయం చేసే అవకాశం ఉందని నీటి పారుదల వర్గాలు చెబుతున్నాయి.

## నేటి తుంగభద్ర బోర్డు భేటీ వాయిదా

**సాక్షి,హైదరాబాద్:** తుంగభద్ర నదీ జలాల పంపిణీ, ఆర్డీఎస్ కాల్వల ఆధునీకరణపై చర్చించేందుకు మంగళవారం (నేడు) భేటీ కావాల్సిన తుంగభద్ర బోర్డు సమావేశం వాయిదా పడింది. వరదలకు ముందే నదీ జలాల పంపకంపై కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో కలిపి బోర్డు సమావేశం ఏర్పాటు చేసినా, అనివార్య కార్యణాల వల్ల వాయిదా పడ్డట్టు బోర్డు వర్గాలు వెల్లడించాయి. తర్వాతి సమావేశాన్ని ఎప్పుడు నిర్వహిస్తామో త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నాయి. ఈ భేటీలో ఆర్డీఎస్ కాల్వల ఆధునీకరణలో జాప్యం, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కొరవడిన సహకారం వంటి అంశాలపై రాష్ట్రం చర్చించాలని భావించింది. ఆర్డీఎస్ కాల్వల ఎత్తు పెంపు లేక రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటా 15.90 టీఎంసీల్లో 5 నుంచి 6 టీఎంసీలకు మించి రావట్లేదన్న అంశాన్ని దృష్టికి తీసుకెళ్లాలని భావించినా బోర్డు భేటీ వాయిదా కారణంగా పరిష్కారం కోసం మరికొన్నాళ్లు వేచి చూడాల్సి ఉంటుంది.

## కాళేశ్వరం అటవీ భూములకు కేంద్ర అనుమతి

**సాక్షి, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా మేడిగడ్డ బ్యారేజి వద్ద మహారాష్ట్ర వైపు బండ్, కరకట్టలు నిర్మించడానికి అవసరమైన 10 హెక్టార్ల అటవీ భూమికి కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ అనుమతి మంజూరు చేసింది. దీనికి సంబంధించిన మొదటి దశ అనుమతి నెల రోజుల కిందటే రాగా, సోమవారం రెండో దశ అనుమతినిచ్చింది. ఈ భూమికి ప్రత్యామ్నాయంగా మరో పది హెక్టార్లలో అటవీ అభివృద్ధికి అవసరమైన నిధులను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే మహారాష్ట్రకు కేటాయించింది.

## రూ.1,870 కోట్లు రైతుబంధు నిధులు విడుదల

**సాక్షి, హైదరాబాద్:** ఖరీఫ్ రైతుబంధు నిధులను ప్రభుత్వం విడతల వారీగా విడుదల చేస్తోంది. మంగళవారం నాటికి రాష్ట్రంలో 17.50 లక్షల మంది రైతులకు రూ.1,870 కోట్లు విడుదల చేసినట్లు వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన రైతులకు కూడా విడతల వారీగా విడుదల చేస్తామని చెప్పారు.

## సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లు

**సాక్షి, హైదరాబాద్:** రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్–కాకినాడ, సికింద్రాబాద్–శ్రీకాకుళం రోడ్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్–కాకినాడ (07053/07054) స్పెషల్ ట్రైన్ ఈ నెల 21వ తేదీ సాయంత్రం 7.30 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30కు కాకినాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 23వ తేదీ రాత్రి 8.45కు కాకినాడ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. సికింద్రాబాద్–శ్రీకాకుళం రోడ్ (07026/07025) స్పెషల్ ట్రైన్ ఈ నెల 17వ తేదీ రాత్రి 7.30కు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.15కు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 18వ తేదీ మధ్యాహ్నం 2.30కు శ్రీకాకుళం రోడ్ బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.30కు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

## ఆపద్బంధు పొడిగింపు

▶ మొదటి పేజీ తరువాయి

కొట్టుకుపోయినా, వరదలు, తుపాను, ఉప్పెన, నీట మునిగినా, వంతెన/భవనాలు కూలిన ఘటనలో ప్రాణాలు కోల్పోయినా.. వారికి ఆపద్బంధు వర్తించనుంది. అలాగే, అగ్ని ప్రమాదం, విద్యుదాఘాతం, భూ కంపాలు, తీవ్రవాదుల దాడుల్లో చనిపోయిన వారు కూడా అర్హులే. అత్యాచార వేధింపులకు గురైన ఎస్సీ, ఎస్టీ బాధిత కుటుంబాలను కూడా ఈ పథకం కింద పరిగణనలోకి తీసుకోనున్నారు. కల్లు గీత కార్మికులకు కూడా ఆపద్బంధు సాయం అందనుంది. అయితే, ఎక్సైజ్ శాఖ ఇన్సూరెన్స్ కవర్ కాకుంటేనే.. దీన్ని పరిగణనలోకి తీసుకుంటా రు. అలాగే, కుక్కకాటు/రేబీస్ బారిన పడి 12 నెలల్లోపు మృతి చెందినవారికీ ఆపద్బంధు వర్తించనుంది. పాము కాటు, వన్య మృగాల దాడిలో చనిపోయినట్లు పోస్టుమార్టం నివేదిక లో తేలితే ఈ పథకం కింద ఆర్థిక చేయూత లభించనుంది. వడదెబ్బ, ఇతర ప్రమాదాల్లో మృత్యువాత పడ్డవారికి కూడా ఆపద్బంధు రానుంది.

**ఈ తొమ్మిది కేటగిరీలకు వర్తించదు..**

ఆత్మహత్యకు పాల్పడినా, మద్యం సేవించి మరణించినా ఆపద్బంధు వర్తించదు. అలాగే, సుఖ వ్యాధులు, మానసిక రోగంతో మరణించినా, చట్టాన్ని ఉల్లంఘిస్తూ చనిపోయినవారు అనర్హులే. యుద్ధం, అణు విస్ఫోటనం, గర్భవతులు, ప్రసవ సమయంలో చనిపోయినవారి కుటుంబాలకు కూడా ప్రయోజనం లభించదు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సాయుధ బలగాలకు ఈ పథకం వర్తించదు.



# సుపరిపాలన కోసమే చట్ట సవరణలు

- చట్టాల పటిష్ట అమలుతోనే గుణాత్మక అభివృద్ధి
- పంచాయతీరాజ్ తరహాలో పటిష్టంగా కొత్త మున్సిపల్ చట్టం
- పంచాయతీరాజ్ చట్టం అమలుకు కొత్త కార్యాచరణ
- సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్

**సాక్షి, హైదరాబాద్:** గ్రామాలు, పట్టణాల గుణాత్మక అభివృద్ధిలో పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల పటిష్ట అమలు కీలకమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించడానికి ఉన్న చట్టాలను సవరించి పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరముందని, తద్వారా ప్రజలకు గ్రామాలు, మున్సిపాలిటీ స్థాయిల్లో సుపరిపాలన అందించగలుగుతామన్నారు. రాష్ట్రంలో పంచాయితీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పంచాయితీరాజ్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు కార్యాచరణ తయారీతోపాటు కొత్త మున్సిపల్ చట్టం రూపకల్పనపై సీఎం కేసీఆర్ సోమవారం ప్రగతి భవన్‌లో సమీక్ష నిర్వహించారు. ''పంచాయితీరాజ్ చట్టాన్ని పటిష్టంగా రూపొందించిన పద్ధతిలోనే అవినీతిరహితంగా పాలన అందే విధంగా, ప్రజలకు మేలు జరిగే విధంగా మున్సిపల్ చట్టం రూపకల్పన చేయాలె. నూతన పంచాయతీరాజ్ చట్టానికి పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలె. మనం మనసు పెట్టి పనిచేస్తే గ్రామాలు, మున్సిపాలిటీ స్థాయిల్లో కావాల్సినంత పని ఉన్నది. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రహించాలె. ఇక్కడ పని వదిలి ఇంకెక్కడనో ఉన్నట్టు నేల విడిచి సాము చేయొద్దు. విద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పన నుంచి గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రతతోపాటు ఇతర మౌలిక రంగాల అభివృద్ధి చేపట్టాల్సిన బాధ్యత మనమీదున్నది''అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మున్సిపాలిటీలు దినదినాభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజలకు సుపరిపాలన అందించాల్సి అవసరం ఉందన్నారు. ఈ దిశగా చట్టం అమలు చేసేందుకు ప్రభుత్వ అధికారులతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులను కూడా బాధ్యులను చేస్తూ పకడ్బందీగా మున్సిపల్ చట్టాన్ని రూపొందించాలని సూచించారు. మున్సిపల్ చట్టాన్ని ఎంత మెరుగ్గా రూపొందించగలిగితే ప్రజలకు అంత గొప్పగా సేవలందిచగలుగుతామని అధికారులకు సూచించారు. సమావేశంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



సోమవారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న గవర్నర్ నరసింహన్

# మాటే మంత్రంగా..

## హామీల అమలుకు ఏపీ కేబినెట్ నిర్ణయం

- తొలి మంత్రిమండలి సమావేశంలోనే ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఏపీ సీఎం వైఎస్ జగన్ సంచలన నిర్ణయాలు
- ఉద్యోగులు, రైతులు, డ్వాక్రా యానిమేటర్స్, రిసోర్స్ పర్సన్లు, అంగన్‌వాడీ వర్కర్లు, పారిశుధ్య కార్మికులపై వరాల జల్లు

**సాక్షి, అమరావతి**

ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు, అంగన్‌వాడీ వర్కర్లు, డ్వాక్రా యానిమేటర్లు, పారిశుధ్య కార్మికులపై ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు తొలి మంత్రిమండలి సమావేశంలోనే ఆమోదముద్ర వేశారు. తండ్రి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి బాటలోనే రైతుల సంక్షేమానికి పెద్దపీట వేయడానికి నిర్ణయించారు. ఇదే సమయంలో అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవడానికి ముందుకొచ్చారు. ఈ మేరకు ఎన్నికల హామీలు, వాటి అమలుపై సోమవారం మంత్రిమండలి సమావేశంలో పలు సంచలన నిర్ణయాలను తీసుకున్నారు. అత్యంత ముఖ్యమైన విద్య, వైద్య రంగాల్లో సాహసోపేత సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. తద్వారా తమ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని ప్రజలకు గట్టి సందేశం ఇచ్చారు. సోమవారం ఉదయం 10–30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సుదీర్ఘంగా కేబినెట్ సమావేశం జరిగింది. ఇందులో తీసుకున్న నిర్ణయాలను సమాచార శాఖ మంత్రి పేర్ని నాని, వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబు కలిసి విలేకరులు సమావేశంలో వెల్లడించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి..

**రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీకి నిర్ణయం**

అనంతపురం, కర్నూలు జిల్లాల్లో రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేయాలని మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. అనంతపురం జిల్లా మంత్రి శంకర్ నారాయణ రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ విషయం ప్రస్తావించగానే, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే రైతులకు వేరుశనగ విత్తనాలు ఆ రెండు జిల్లాల్లో మొదలుపెట్టాలని ఆదేశించడంతోపాటు 24 నుంచి 48 గంటల లోపు పని ప్రారంభించినట్టు తనకు సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సహకార రంగ వ్యవస్థలను బలోపేతం చేసే దిశగా వెంటనే చర్యలు చేపట్టనున్నారు. సహకార చక్కెర పరిశ్రమలతోపాటు సహకార పాల పరిశ్రమలను బలోపేతం చేయాలని నిర్ణయించారు. సహకార చట్టాల రక్షణకు తగు నిర్ణయాలు తీసుకోనున్నారు. ఒక్కో రైతుకు 5 పశువుల వరకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకూ బీమా సౌకర్యం కల్పించనున్నారు. గుజరాత్, హరియాణా రాష్ట్రాల్లో ఇలాంటి బీమా పథకం ఎలా అమలవుతోందో అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు.

**పారిశుధ్య కార్మికుల వేతనాల పెంపు**

అన్ని శాఖల్లో పనిచేసే పారిశుధ్య కార్మికుల వేతనాలను రూ.18 వేలకు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దీని అమలుకు సంబంధిత శాఖల కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేస్తారు. కాంట్రాక్టు ఉద్యోగుల అర్హత, అనుభవం ఆధారంగా క్రమబద్ధీకరించాలని నిర్ణయించారు. దీన్ని అమలు చేయడానికి ఆర్థిక, విద్యుత్, వైద్య, పంచాయతీరాజ్, విద్య, పురపాలక మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా పట్టణ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థల్లో పనిచేస్తున్న యానిమేటర్లు, రిసోర్స్ పర్సన్‌లకు గౌరవ వేతనం రూ.10 వేలు ఇవ్వాలని నిర్ణయించారు. అంగన్ వాడీ వర్కర్లకు రూ.10,500 నుంచి రూ.11,500, అంగన్‌వాడీ ఆయాలకు రూ.6 వేల నుంచి రూ.7 వేలకు, ఆశ వర్కర్లకు రూ.3 వేల నుంచి రూ.10 వేలకు, గిరిజన తండాల్లో పనిచేసే వర్కర్లకు రూ.400 నుంచి రూ.4 వేలకు వేతనాలను పెంచుతూ వారిపై ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది.

**విద్యా రంగంలో సమూల సంస్కరణలకు శ్రీకారం**

రాష్ట్రంలో 40 వేలకు పైగా ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలను మార్చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని స్కూళ్లలో అన్ని వసతులను కల్పించాక ఫొటోలు తీసి ప్రజలకు చూపించనున్నారు. 40 కిలోమీటర్ల పరిధిలో కేంద్రీకృత వంటశాలలను ఏర్పాటు చేసి పౌష్టికాహారాన్ని స్కూళ్లకు సరఫరా చేయనున్నారు. వంట మనుషులకు నెలకు రూ.3 వేలు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రైవేటు స్కూళ్ల విద్యా హక్కు చట్టంలోని అంశాలను పాటించేలా చర్యలు తీసుకోనున్నారు.

**రైతులందరికీ వడ్డీలేని రుణాలు**

రైతన్నల సంక్షేమానికి ఉద్దేశించిన రైతు భరోసా పథకాన్ని అక్టోబర్ 15 నుంచి ప్రారంభించాలని ముఖ్యమంత్రి అధ్యక్షతన మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. ఈ పథకం కింద రైతుకు 12,500 పెట్టుబడి సాయం అందిస్తారు. దీనివల్ల 56 లక్షల మంది రైతు కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ ఆర్థిక సాయాన్ని వాణిజ్య బ్యాంకులు రైతులకు చెల్లించకుండా బకాయిలకు జమ చేసుకునే పక్షంలో ప్రాథమిక సహకార బ్యాంకుల ద్వారా అందజేస్తారు. దీనికి సంబంధించి ఆర్థిక, వ్యవసాయ, పురపాలక శాఖ మంత్రులతో కమిటీ ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా ముఖ్యమంత్రి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు కమిషన్ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఆరు లేదా ఏడుగురు రైతు సంఘాలకు చెందినవారు, నిపుణులు సభ్యులుగా ఉంటారు. ఈ కమిషన్ వ్యవసాయంలో పురోగతి, రైతుల సంక్షేమం, ధరల స్థిరీకరణను పర్యవే క్షిస్తుంది. అదేవిధంగా రైతుల తరఫున వంద శాతం ఇన్సూరెన్స్ ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలని నిర్ణయించారు. క్లెయిమ్ బాధ్యత కూడా ప్రభుత్వమే తీసుకుంటుంది. రైతులందరికీ వడ్డీ లేని రుణాలు ఇవ్వడాన్ని జూలై 8న వైఎస్సార్ పుట్టినరోజు నాడు ప్రారంభిస్తారు. రైతులు చెల్లించాల్సిన వడ్డీని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది. దీనికోసం బ్యాంకులతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుంది. ప్రభుత్వం వడ్డీ చెల్లించిన రసీదును గ్రామ వాలంటీర్లు ద్వారా రైతులకు చేరవేస్తారు. చంద్రబాబు సర్కారు 2014 నుంచి 2019 వరకు రైతులకు చెల్లించకుండా ఎగనామం పెట్టిన రూ.2,000 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని కూడా రైతులకు చెల్లించాలని కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. అదేవిధంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులు నష్టపోకుండా రూ.2 వేల కోట్లతో సహాయ నిధి, రూ.3 వేల కోట్లతో మార్కెట్ స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తారు. బోర్లు మీద బోర్లు వేసి నీళ్లు పడక నష్టపోతున్న రైతుల కోసం అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు ఒకటి చొప్పున బోర్లు వేసే 200 రిగ్గులను కొనుగోలు చేయడానికి నిర్ణయం తీసుకున్నారు. బోర్ల కోసం నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత క్రమంగా ఉచితంగా బోర్లు వేస్తారు. ధాన్యానికి కనీస మద్దతు ధర రాని పక్షంలో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని నిర్ణయించారు. అదేవిధంగా రైతులకు పగటిపూట తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ అందించనున్నారు.

**ఐఆర్‌తో 4.24 లక్షల మంది ఉద్యోగులకు ప్రయోజనం**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త వినిపించింది. ప్రభుత్వ ఉద్యోగులకు జూలై నుంచి 27 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) మంజూరు చేస్తూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకుంది. దీనివల్ల 4.24 లక్షల మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూర నుంది. ఐఆర్‌తో రాష్ట్ర ప్రభుత్వంపై రూ.815 కోట్లు అదనపు భారం పడ నుంది. అదేవిధంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. దీన్ని ఎలా అమలు చేయా లనే దానిపై ఆర్థిక, రవాణా శాఖ మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసి రెండు నెలల్లో నివేదిక కోరనున్నారు. ఆర్టీసీ ప్రస్తుతం రూ.6,400 కోట్ల అప్పుల్లో ఉంది. చంద్రబాబు సర్కారు రూ.2900 కోట్ల ఉద్యోగుల పీఎఫ్‌ను కూడా వేరే వాటికి వాడేసింది. ఈ నేపథ్యంలో మానవతా దృక్పథంతో ఆర్టీసీ పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా సీఎం వైఎస్ జగన్ కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం డీజిల్ బస్సుల కారణంగా ఆర్టీసీలో కిలోమీటర్ రవాణాకు ఖర్చు రూ.38 అవుతోంది. వాటి స్థానంలో ఎలక్ట్రికల్ బస్సులను ప్రవేశపెట్టడం ద్వారా కిలోమీటర్ రవాణాకు ఖర్చు రూ.19కు తగ్గించవచ్చనేది సీఎం ఆలోచనగా ఉందని మంత్రులు తెలిపారు. ఆర్టీసీని లాభాల్లోకి తీసుకురావడానికి నిపుణులతో కమిటీ ఏర్పాటు చేస్తారు. ఉద్యోగులకు ఇబ్బందికరంగా మారిన కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఈ క్రమంలో సాంకేతిక, న్యాయ సమస్యలు తలెత్తకుండా అమలు కార్యాచరణ కోసం ఆర్థిక మంత్రి అధ్యక్షతన ఆర్థిక శాఖ అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తారు. రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవడం కోసం రూ.1150 కోట్లు హైకోర్టుకు జమ చేయాలని కేబినెట్ నిర్ణయించింది. దీనివల్ల అగ్రిగోల్డ్‌లో రూ.20 వేలు డిపాజిట్ చేసిన 9 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుంది.

**ప్రతి గడపకు ప్రభుత్వ పథకాలు చేరవేసేలా..**

అక్టోబర్ 2 నుంచి గ్రామ సచివాలయాలు పనిచేయనున్నాయి. వీటిలో ఉద్యోగాల నియామకం పూర్తి పారదర్శకంగా జిల్లా ఎంపిక కమిటీల ద్వారా చేయాలని నిర్ణయించారు. ప్రతి గడపకు ప్రభుత్వ పథకాలు అందేలా గ్రామ వాలంటీర్లు పనిచేస్తారు. ఆగస్టు 15 నుంచి వాలంటీర్ల వ్యవస్థ ప్రారంభమవుతుంది. పట్టణ వాలంటీర్లకు నియామకానికి డిగ్రీ, గ్రామ వాలంటీర్ల నియామకానికి ఇంటర్మీడియెట్, గిరిజన ప్రాంతాల్లో పదో తరగతి అర్హతగా నిర్ధారించారు. రేషన్ ద్వారా ప్రస్తుతం పంపిణీ చేస్తున్న బియ్యంలో నాణ్యత లేనందున రాష్ట్ర ప్రభుత్వమే నాణ్యమైన బియ్యాన్ని కొనుగోలు చేసి బియ్యంతోపాటు ఐదు రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని నిర్ణయించింది. సెప్టెంబర్ 1 నుంచి గ్రామ వలంటీర్ల ద్వారా ప్రతి గడపకు బియ్యం ఐదు కేజీలు, పది కేజీలు, 15 కేజీల బ్యాగ్‌ల ద్వారా అందించనున్నారు. గతంలో జరిగిన అక్రమాలకు చెక్ పెట్టనున్నారు.

**ప్రభుత్వ ఆస్పత్రుల పటిష్టానికి నిర్ణయం**

ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేయడంతోపాటు మెరుగైన వైద్యసేవలందించేందుకు ఎమ్మెల్యేల అధ్యక్షతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే 108, 104 వాహనాలను ఆధునికీకరించి, కొత్త వాహనాను కొనుగోలు చేయనున్నారు. డీజిల్ కొరత లేకుండా కండిషన్‌లో వాహనాలను ఉంచాలని, బాధితులు ఫోన్ చేసిన 20 నిముషాల్లో చేరేలాగ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ క్రమంలో 108, 104 సిబ్బంది సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని, వారు సంతృప్తిగా ఉంటేనే మెరుగైన సేవలు అందుతాయని సీఎం వైద్యశాఖాధికారులకు సూచించారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాల్లో వైద్యం చేయించుకున్నా ఆరోగ్యశ్రీని వర్తింపచేయాలని నిర్ణయించారు. ఇప్పుడున్న వ్యాధులతోపాటు మరిన్ని వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేరుస్తారు.

**పిల్లలను స్కూళ్లకు పంపే ప్రతి తల్లికి రూ.15 వేలు**

అమ్మఒడి పథకాన్ని జనవరి 26 నుంచి అమలు చేయనున్నారు. ఈ పథకం కింద తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి తల్లి తమ పిల్లలను స్కూళ్లకు పంపితే గ్రామ వాలంటీర్ల ద్వారా రూ.15 వేలు అందిస్తారు. తద్వారా బాలకార్మిక వ్యవస్థను నిరోధించవచ్చునని సీఎం నిర్ణయం తీసుకున్నారు. అలాగే రాష్ట్రం లో ఇళ్లులేని అర్హులైన నిరుపేద మహిళలను గుర్తించి, వారందరికీ తొలి ఏడాదిలోనే ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసి ఉగాది పండుగ రోజున వారి పేరిటే ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేయనున్నారు. ఆ స్థలాలపై బ్యాంకుల ద్వారా ఆర్థిక సాయం కూడా పొందే అవకాశం ఉంటుంది. ఇళ్లులేని వారందరికీ రెండో ఏడాది నుంచి నాలుగేళ్లలో 25 లక్షల ఇళ్లను వైఎస్సార్ పేరు మీద నిర్మించి ఇవ్వాలని నిర్ణయించారు. అదేవిధంగా పట్టణాల్లో ప్లాట్లను నిర్మించి పేదలకు వ్యక్తిగతంగా రిజిస్ట్రేషన్ చేయనున్నారు.

# భట్టి ఆమరణ దీక్ష భగ్నం

▶ మొదటి పేజీ తరువాయి

మాజీ ఎంపీలు మల్లు రవి, వి. హన్మంతరావు టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, ఏఐసీసీ కార్యదర్శి సలీం అహ్మద్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజారుద్దీన్, ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్‌ల సమక్షంలో ఉత్తమ్ ఆయనకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

**ఫ్లూయిడ్స్ ద్వారా చికిత్స...**

మూడు రోజుల దీక్షతో నీరసించిన భట్టికి నిమ్స్ వైద్యులు ఫ్లూయిడ్స్ ద్వారా చికిత్స అందిస్తున్నారు. సోమవారం సాయంత్రానికి ఆయన బీపీ అదుపులోకి వచ్చిందని, షుగర్ లెవల్స్ ఇంకా తక్కువగానే ఉన్నాయని, కీటోన్స్ పరిస్థితి కూడా మెరుగుపడలేదని, మరో రెండ్రోజులు ఆయన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతారని టీపీసీసీ వర్గాలు వెల్లడించాయి. కాగా, నిమ్స్‌లో చికిత్స పొందుతున్న భట్టిని పలువురు కాంగ్రెస్ నేతలు పరామర్శించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి బోసురాజు, రాజ్యసభ సభ్యుడు కె.వి.పి. రామచంద్రరావు, మాజీ మంత్రులు శ్రీధర్‌బాబు, షబ్బీర్ అలీ, మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె. నాగేశ్వర్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తదితరులు భట్టిని పరామర్శించిన వారిలో ఉన్నారు.

**నేడు కలెక్టరేట్ల ఎదుట ధర్నా...**

భట్టి దీక్షను విరమించిన నేపథ్యంలో సీఎల్పీని టీఆర్‌ఎస్‌లో విలీనం చేయడాన్ని నిరసిస్తూ ఉద్యమాన్ని కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. మంగళవారం అన్ని జిల్లాల కలెక్టరేట్ల ముందు ధర్నా నిర్వహించాలని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి నాయకులు, పార్టీ శ్రేణులంతా ధర్నాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

**ప్రాణాలకు తెగించి భట్టి దీక్ష: టీపీసీసీ చీఫ్ ఉత్తమ్**

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు భట్టి తన ప్రాణాలకు తెగించి నిరాహార దీక్ష చేశారని, పోలీసులు దీక్షా శిబిరంపై దాడి చేసి ఆయన్ను అదుపులోకి తీసుకున్నారని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ చెప్పారు. 12 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారే విషయంలో తమ ఫిర్యాదులను పట్టించుకోకుండా స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరించారని ఉత్తమ్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై తాము హైకోర్టులో దాఖలు చేసిన కేసు మంగళవారం విచారణకు రానుందని, ఈ విషయంలో సుప్రీంకోర్టుకు కూడా వెళ్తామని వెల్లడించారు. దీనిపై ఫిర్యాదు చేసేందుకు రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరామని, పార్లమెంటులో కూడా ఈ అంశాన్ని ప్రస్తావిస్తామని చెప్పారు. తెలంగాణను వ్యతిరేకించిన ఎంఐఎంకు ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. తమ ఎమ్మెల్యేల కొనుగోలుపై కేసీఆర్ నోరు విప్పాలని డిమాండ్ చేశారు.



సోమవారం నిమ్స్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఉత్తమ్. చిత్రంలో పొన్నాల, జానారెడ్డి, మల్లు రవి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వీహెచ్ తదితరులు

**కౌరవులపై పోరాటం చేస్తాం: ఎంపీ కోమటిరెడ్డి**

దళితుడిని సీఎం చేస్తానని మోసం చేసిన కేసీఆర్ కనీసం ఓ దళిత నేతను ప్రతిపక్ష నాయకుడిగా ఉండటాన్ని కూడా ఓర్వలేకపోయారని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. నిమ్స్‌లోచికిత్సపొందుతున్న భట్టిని పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీలో ఉన్న ఆరుగురు ఎమ్మెల్యేలు పాండవుల్లా 100 మంది కౌరవ ఎమ్మెల్యేలపై పోరాటం చేస్తారని చెప్పారు. అలాగే ముగ్గురు ఎంపీలం త్రిమూర్తుల్లా పార్లమెంటులో రాష్ట్ర సమస్యలపై గళం విప్పుతామన్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారినంత మాత్రాన కార్యకర్తలు వెళ్లడం లేదని చెప్పారు. ఓటేయకపోతే సంక్షేమ పథకాలు నిలిపేస్తామని ప్రజలను భయపెట్టి టీఆర్‌ఎస్ నేతలు ఓట్లు వేయించుకున్నారని, రానున్న రోజుల్లో టీఆర్‌ఎస్ నామరూపాలు లేకుండా పోతుందన్నారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, కార్యకర్తలు అధైర్యపడొద్దని, మంగళవారం కలెక్టరేట్ల ముందు నిర్వహించే ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. అధికారం మత్తులో కేసీఆర్ నిరంకుశ పాలన చేస్తున్నారని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. అహంకారపూరిత పాలన చేస్తున్న కేసీఆర్‌కు భట్టి దీక్ష ఓ హెచ్చరిక అని వ్యాఖ్యానించారు.

# హైకోర్టుకు సీఎల్పీ విలీన వివాదం

- కేవియట్ ఉన్నా స్పీకర్ మా వాదన వినలేదు
- స్పీకర్ చర్య చట్టవ్యతిరేకం
- హైకోర్టును ఆశ్రయించిన కాంగ్రెస్ పార్టీ
- రిట్ దాఖలు చేసిన భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- నేడు విచారిస్తామన్న ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌కు చెందిన 12 మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయిస్తే స్పీకర్ చర్యలు తీసుకోకపోగా వారి వినతి మేరకు కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని అధికార టీఆర్‌ఎస్ శాసనసభాపక్షంలో విలీనం చేయడం చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. కాంగ్రెస్ ఎమ్మెల్యే భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి దాఖలు చేసిన ఈ వ్యాజ్యంలో శాసనసభ స్పీకర్, కార్యదర్శి, కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి, పార్టీ ఫిరాయించిన 12 మంది ఎమ్మెల్యేలను (వ్యక్తిగత హోదాలో) ప్రతివాదులుగా చేశారు. ఈ కేసు విచారణ ఆవశ్యకతను సోమవారం హైకోర్టు దృష్టికి పిటిషనర్ల తరపు న్యాయవాది జంధ్యాల రవిశంకర్ తీసుకొచ్చారు. గతంలో దాఖలు చేసిన ఇదే తరహా కేసు విచారణ రేపు (మంగళవారం) విచారణకు రానుందని చెప్పడంతో రెంటింటినీ కలిపి మంగళవారం విచారిస్తామని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

**పార్టీ విలీన అధికారం ఈసీకే ఉంది..**

'పార్టీ ఫిరాయింపులపై చర్య తీసుకునే అధికారం కేంద్రం ఎన్నికల సంఘానికే ఉంది. శాసనసభ స్పీకర్‌కు అధికారం లేకపోయినా విలీనం చేసి చట్ట ఉల్లంఘనకు పాల్పడ్డారు. ఈ చర్య రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనలనే కాకుండా 102, 191, 324 అధికరణాల ఉల్లంఘన. న్యాయ సమీక్ష చేస్తే స్పీకర్ రాజ్యాంగ ఉల్లంఘన బట్టబయలు అవుతుంది. ఎర్రబెల్లి దయాకర్‌రావు–తలసాని శ్రీనివాస్ యాదవ్‌ల కేసులో సుప్రీంకోర్టు.. పార్టీ ఫిరాయింపుల ఫిర్యాదు అందిన మూడు నెలల్లోగా పరిష్కరించాలని స్పీకర్‌కు ఇచ్చిన ఆదేశాలు ఈ కేసులో అమలు చేసేలా స్పీకర్‌కు ఆదేశాలివ్వాలి. కేవియట్ వేసినా ఖాతరు చేయని స్పీకర్ తీసుకున్న విలీన నిర్ణయాన్ని రద్దు చేయాలి. స్పీకర్ ఆదేశాల మేరకు అసెంబ్లీ సెక్రటరీ విడుదల చేసిన బులిటెన్ 10 అమలును సస్పెండ్ చేయాలి. పార్టీ ఫిరాయించిన 12 మందిపై ఉన్న అనర్హత ఫిర్యాదును విచారించి నిర్ణయం తీసుకున్న తర్వాతే స్పీకర్ ఇతర అంశాలపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలి' అని రిట్ పిటిషన్‌లో హైకోర్టును కోరారు.

**తెర వెనుక టీఆర్‌ఎస్ అధినేత కుట్ర...**

'ఆ 12 మంది ఎమ్మెల్యేలపై ఫిరాయింపు నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోవాలనే ఫిర్యాదు కేంద్ర ఎన్నికల సంఘం వద్ద పెండింగ్‌లో ఉంది. అసెంబ్లీ స్పీకర్/కౌన్సిల్ చైర్మన్‌లకు రాజకీయపార్టీల విలీనంపై నిర్ణయం తీసుకునే అధికారంలేదు. స్పీకర్‌కు కూడా ఫిర్యాదు చేశాం. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద వారిపై అనర్హత వేటు వేయాలనే ఫిర్యాదులు పెండింగ్‌లోనే ఉండగా స్పీకర్ తన పరిధిలోకి రాని విలీన అంశంపై నిర్ణయం తీసుకుని చట్టాన్ని ఉల్లంఘించారు. విలీనంపై స్పీకర్ నిర్ణయానికి అనుగుణంగా ఈ నెల 6న అసెంబ్లీ బులిటెన్ (నంబర్ 10) విడుదల చేసింది. ముందుగా మా వాదన వినాలని స్పీకర్ వద్ద కేవియట్ దాఖలు చేసినా ప్రయోజనం లేకపోయింది. కేవియట్ ప్రకారం తమకు నోటీసు ఇచ్చి విచారించాకే నిర్ణయం తీసుకోవాలన్న చట్ట నిబంధనలకు స్పీకర్ తిలోదకాలిచ్చారు. రాజేంద్రసింగ్ రాణా–స్వామిప్రసాద్ మౌర్య కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ప్రకారం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శుల చర్యలు రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించాలి. యూపీలో బీఎస్పీకి చెందిన 13 మంది ఎమ్మెల్యేల అనర్హత కేసు పెండింగ్ విషయంలో కేవియట్ దాఖలైతే ఆ మేరకు స్పీకర్ అమలు చేశారు. పదో షెడ్యూల్ పేరా 4, సబ్ పేరా 2 కింద విలీనానికి తమకు అభ్యంతరం లేదని టీఆర్‌ఎస్ నేత స్పీకర్‌కు తెలియజేయడం విడ్డూరంగా ఉంది. ఆ 12 మంది ఎమ్మెల్యేలకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు బీఫాం ఇచ్చే అధికారాన్ని టీఆర్‌ఎస్ ఇచ్చిందంటే విలీనానికి ముందే టీఆర్‌ఎస్ కుట్ర స్పష్టంగా కనబడుతోంది. ఈ కుట్ర వెనుక టీఆర్‌ఎస్ అధినేత ఉన్నారు' అని రిట్‌లో పేర్కొన్నారు.

## పౌరుడు కూడా ఫిర్యాదు చేయవచ్చు..

పార్టీ ఫిరాయింపుల చట్టం(1986) ప్రకారం కూడా స్పీకర్ వ్యవహరించలేదు. కాంగ్రెస్ పార్టీకి, కాంగ్రెస్ శాసనసభాపక్షానికి తేడా లేదు. సీఎల్పీ విలీనానికి పార్టీ ఆమోదం ఉండాలనే తమ అభ్యర్థను స్పీకర్ పట్టించుకోలేదు. స్పీకర్, అసెంబ్లీ సెక్రటరీలు చట్టవ్యతిరేకంగా వ్యవహరించారు. ఒడిశా అసెంబ్లీకి సంబంధించి ఉత్కల్ కేసరి ఫరిడా కేసును ఉదహరిస్తూ ఒడిశా అసెంబ్లీలో 2013లో ఉన్న నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజూ జనతాదళ్‌లో కలిసిపోతే ఫిర్యాదు చేసేందుకు ఒక్కరూ మిగలలేదు. టెన్త్ షెడ్యూల్‌లోని పేరా 2 (1ఎ) ప్రకారం వారు అనర్హులు. స్పీకర్ ఎదుట ఫిర్యాదు లేకపోవడంతో వారంతా ఎమ్మెల్యేలుగా కొనసాగేందుకు అర్హత ఉంటుంది. ఈ విధానం 10వ షెడ్యూల్ స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉందని రూల్ 6 ఆఫ్ 1987 (సబ్ రూల్ 1,2) ప్రకారం పౌరుడు కూడా స్పీకర్‌కు ఫిర్యాదు చేయవచ్చు.. అని కూడా రిట్‌లో పేర్కొన్నారు.

# ఘనంగా బోనాల ఉత్సవాలు

- జూలై 4న గోల్కొండ, 21న సికింద్రాబాద్, 28న పాతబస్తీలో..
- బోనాల పండగ ఏర్పాట్లపై మంత్రి తలసాని సమీక్ష

సాక్షి, హైదరాబాద్



సచివాలయంలో మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో ఇంద్రకరణ్‌రెడ్డి, మహమూద్ అలీ

ఆషాఢ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు బోనాల పండగ ఏర్పాట్లపై సోమవారం సచివాలయంలో హోంమంత్రి మహమూద్ అలీ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. బోనాల నిర్వహణకు ప్రభుత్వం రూ.15 కోట్లు, వివిధ పనుల కోసం జీహెచ్‌ఎంసీ ద్వారా రూ.22 కోట్లు కేటాయించనుందని తెలిపారు. జూలై 4న గోల్కొండ, 21న సికింద్రాబాద్, 28న పాతబస్తీలో బోనాల ఉత్సవాలు ఉంటాయని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్ వాటర్ వర్క్స్ 3 లక్షల తాగునీటి ప్యాకెట్లను ఏర్పాట్లు చేసిందని, ఆర్ అండ్ బీ ద్వారా దేవాలయాల వద్ద బారికేడింగ్, విద్యుత్‌కు అంతరాయం లేకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. సాంస్కృతిక శాఖ సహకారంతో దేవాలయాల వద్ద సాంస్కృతిక, భక్తి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బోనాల నేపథ్యంలో భక్తుల కోసం అదనంగా మెట్రో ట్రిప్‌లు తిరిగేలా చూడాలన్నారు. ఉత్సవాలకు అవసరమైన ఏనుగును చూడాల్సిందిగా అటవీ శాఖకు సూచించారు. హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. ఉత్సవాల నిర్వహణకు అన్ని పనులను ముందుగానే పూర్తి చేయాలన్నారు.

## ఈసారి మరింత మెరుగ్గా..

దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలకు ఈసారి గతంలో కంటే మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. 26 ముఖ్య దేవాలయాలకు పట్టు వస్త్రాలను పంపుతామన్నారు. పురోహితులను, ప్రసాదాల పంపిణీకి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్ శర్మ, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, రాజాసింగ్, ముఠాగోపాల్, మాగంటి గోపీనాథ్, జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్ సిన్హా, ఇన్‌చార్జి కమిషనర్, లా అండ్ ఆర్డర్ డీజీ జితేందర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్, ఎండీ వాటర్ వర్క్స్ దానకిషోర్, ఎండోమెంట్స్ కమిషనర్ అనీల్ కుమార్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ట్రాన్స్ కో డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరి సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

- కొత్త రాష్ట్రంలో బీసీలకు 238 గురుకుల కాలేజీలు
- సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ప్రతి ఒక్కరి సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కేజీ టు పీజీ మిషన్‌లో భాగంగా తలపెట్టిన గురుకుల పాఠశాలలు అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయని, విద్యార్థుల సంఖ్యకు తగినట్లు కొత్త గురుకులాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. సోమవారం సచివాలయంలో మంత్రి ఈశ్వర్ మీడియాతో మాట్లాడారు. అంతకుముందు బీసీ గురుకుల సొసైటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 17వ తేదీ నుంచి కొత్తగా 119 గురుకుల పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు. గురుకుల బోధన ఉన్నతంగా ఉండాలనేది సీఎం కేసీఆర్ ఆశయమని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందు కేవలం 19 బీసీ గురుకులాలు మాత్రమే ఉండేవని, ఇప్పుడు వీటిసంఖ్య 257కు పెరిగిందన్నారు. 2017–18 విద్యా సంవత్సరంలో 119 గురుకుల పాఠశాలలు ప్రారంభించగా 2019–20 విద్యాసంవత్సరంలో మరో 119 గురుకులాలు అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు. 19 జూనియర్ కాలేజీలు, ఒక మహిళా డిగ్రీ కాలేజీని కూడా ప్రారంభించినట్లు చెప్పారు.

**కొత్త గురుకులాలకు భవనాలు సిద్ధం**


కొత్తగా ఏర్పాటయ్యే 119 గురుకుల పాఠశాలలకు భవనాలు సిద్ధం చేశామని మంత్రి ఈశ్వర్ చెప్పారు. ఈ పాఠశాలల్లో 2019–20 విద్యాసంవత్సరంలో 5, 6,7 తరగతులు ప్రారంభిస్తున్నామని, ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు. ప్రిన్సిపాళ్ల బాధ్యతల విషయంలో పాత స్కూల్‌లో పనిచేస్తున్నవారికి కొత్త స్కూళ్ల అదనపు బాధ్యతలు ఇచ్చామని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే వరకు ఈ బాధ్యతల్లో కొనసాగాల్సి ఉంటుందని చెప్పారు. కొత్త స్కూళ్లకు 3,689 పోస్టులు ప్రభుత్వం మంజూరు చేసిందని, వీటిని వివిధ దశల్లో భర్తీ చేస్తామన్నారు. అప్పటి వరకు పాత పాఠశాలల నుంచి ఇద్దరు టీచర్ల చొప్పున కొత్త పాఠశాలలకు డిప్యుటేషన్ మీద పంపుతున్నట్లు చెప్పారు. అవసరమున్నచోట పీఈటీ, స్టాఫ్ నర్సులు, బోధనేతర సిబ్బందిని ఔట్ సోర్సింగ్ విధానంలో తీసుకునేలా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. 98 శాతం పాఠశాలలకు పుస్తకాల సరఫరా పూర్తయిందన్నారు. సమావేశంలో మహాత్మా జ్యోతిభా పూలే గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి మల్లయ్యభట్టు, సంయుక్త కార్యదర్శి వీవీ రమణారెడ్డి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బాలాచారి పాల్గొన్నారు.

# 42.40 లక్షల మందికి 'ఉపాధి హామీ'

▶ మొదటి పేజీ తరువాయి

కల్పించారు. ఈ పనుల కోసం రూ. 3,027 కోట్లు ఖర్చు చేశారు. ఉపాధి హామీ అమలుపై గ్రామీణాభివృద్ధిశాఖ తాజా నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. తెలంగాణ రాష్ట్ర ఉపాధి హామీ మండలి నాలుగో సమావేశం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 2018–19, 2019–20 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన నివేదికలను సమీక్షించారు. 2018–19లో తెలంగాణకు హరితహారంలో భాగంగా రూ. 688 కోట్లతో 11,933 గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేసి 11.43 కోట్ల మొక్కలు నాటారు. అలాగే రూ. 670 కోట్లతో 61,116 భూసార/నీటి పరిరక్షణ పనులు పూర్తి చేశారు. రూ. 46.7 కోట్లతో 2,031 శ్మశాన వాటికల నిర్మాణం చేపట్టారు. రూ. 470.8 కోట్లు ఖర్చు చేసి 22,037 సిమెంటు రోడ్లు వేశారు. రూ. 63.5 కోట్లతో 1,219 గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు, రూ. 14.86 కోట్ల వ్యయంతో 634 కొత్త అంగన్‌వాడీ భవనాలు నిర్మించారు. పనుల ప్రాధాన్యతలో భాగంగా వ్యవసాయ నీటి గుంతలు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, వంటగదుల నిర్మాణం, ఇంకుడు గుంతలు, డంపింగ్ యార్డులు, పశువుల కొట్టాలు, మేకలు–గొర్రెల షెడ్లు, కూరగాయల పందిళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. ఈ సమావేశంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, సి.హెచ్. మల్లారెడ్డి, ఉపాధి హామీ మండలి సభ్యులు గద్దల పద్మ, తుల ఉమ, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ నీతూప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి బెన్హర్ మహేష్‌దత్ ఎక్కా ఇతర అధికారులు పాల్గొన్నారు.

**ఉపాధి అమల్లో ఆదర్శం: మంత్రి ఎర్రబెల్లి**



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల అమల్లో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా నిలపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. తెలంగాణ గ్రామీణ ఉపాధి హామీ మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఉపాధి హామీ పథకం అమలులో గ్రామ పంచాయతీలు క్రియాశీలకపాత్ర పోషించాలి. పంచాయతీల ఆదేశాల మేరకు పనుల గుర్తింపు, అమలు జరగాలి. గ్రామసభ ఆమోదించిన పనులనే చేపట్టాలి. ఫీల్డ్ అసిస్టెంట్లు సంబంధిత గ్రామ పంచాయతీకి నివేదిస్తారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీపై ఫిర్యాదు పెట్టెను ఏర్పాటు చేయాలి. ప్రతి గ్రామంలో తెలంగాణకు హరితహారం, నర్సరీల ఏర్పాటు, మొక్కల పెంపకం, చెరువుల పునరుద్ధరణ, పంట కాల్వలు, నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. శ్మశానాలు, మరుగుదొడ్లు, వంట గదులు, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాల వంటి పనులు చేపట్టాలి. ఉపాధి కల్పించే వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి. తెలంగాణకు హరితహారంలో భాగంగా చింత, వేప చెట్లను విరివిగా నాటి వాటి సంరక్షణలో సర్పంచులను, కార్యదర్శులను భాగస్వాములను చేయాలి. ఉపాధి హామీ నిధులతో రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీకీ భవనాలు, డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి' అని అన్నారు.

## దోస్త్‌-2019లో మార్పులు చేయాలి

**మంత్రికి డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్యాల సంఘం వినతి**

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన దోస్త్–2019లో కొన్ని మార్పులు చేయాలని తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్యాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌వీసీ ప్రకాశ్, ఎ.పరమేశ్వర్ ప్రభుత్వానికి విన్నవించారు. దోస్త్‌లో ఆదాయ ధ్రువీకరణ పత్రం అప్‌లోడ్ విషయంలో గతేడాది అనుసరించిన విధానాన్నే ఈసారి కూడా అనుమతించాలని కోరారు. 20శాతం సీట్ల భర్తీకి కాలేజీ యాజమాన్యానికి అవకాశమివ్వాలని, విద్యార్థులకు సీటు అలాట్ చేసిన వెంటనే కాలేజీలో రిపోర్టు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఫేస్‌లో సీటు కేటాయించిన వెంటనే సంబంధిత కాలేజీలో రిపోర్టు చేసేలా నిబంధనలు పెట్టాలని కోరారు. ఈమేరకు సోమవారం వారు విద్యాశాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.

# రైతుల కోసం 'ఉద్యమం'

- కార్యాచరణ రూపొందిస్తున్న కిసాన్ కాంగ్రెస్
- రైతుబంధు అమలు, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్ల చెల్లింపులే ఎజెండా
- ప్రకృతి వైపరీత్యాలకింద ఎంత ఖర్చు పెట్టారో వెల్లడించాలని డిమాండ్



సోమవారం గాంధీభవన్‌లో మాట్లాడుతున్న శశిధర్‌రెడ్డి. చిత్రంలో అన్వేశ్‌రెడ్డి, కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలపై ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలని కిసాన్ కాంగ్రెస్ నిర్ణయించింది. ఇందుకోసం ఉద్యమ కార్యాచరణను రూపొందించి, రైతుల భాగస్వామ్యంతో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటానికి శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలోని రైతులందరికీ రైతుబంధు పథకం అమలుతోపాటు రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్ల చెల్లింపులు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలనే డిమాండ్‌తో ఉద్యమాలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం గాంధీభవన్‌లో జరిగిన రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ సమావేశంలో తీర్మానించారు. రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భూరికార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలతోపాటు మొత్తం 9 అంశాలపై చర్చించారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చి ఆరునెలలవుతున్నా ఇంతవరకు రుణమాఫీ చేయలేదని, ధాన్యం కొనుగోళ్లు చేసి ఇంతవరకు డబ్బులు చెల్లించలేదని కిసాన్ కాంగ్రెస్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ అంశాలన్నింటిపై రైతులతో కలిసి ఉద్యమం చేయాలని నిర్ణయించారు. సమావేశం అనంతరం ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, భూరికార్డుల ప్రక్షాళన అనంతరం రాష్ట్రంలోని 6 లక్షలకుపైగా రైతులకు కొత్త పాసుపుస్తకాలు అందలేదని, వీరికి రైతుబంధు కూడా అమలు కావడం లేదని, ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే 35వేల మంది రైతులకు రైతుబంధు ఇవ్వడం లేదని చెప్పారు. భూరికార్డుల ప్రక్షాళనతో పాటు కొత్త పాసుపుస్తకాలను పంపిణీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైనందునే ఈ ఇబ్బందులు వచ్చాయని, లోపభూయిష్ట విధానాలతో ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. రైతు సమస్యలపై పోరాటాలు చేయాలని తాము నిర్ణయించామని, పటిష్ట కార్యాచరణతో ముందుకెళ్తామని చెప్పారు. రాష్ట్ర చైర్మన్ అన్వేశ్‌రెడ్డి మాట్లాడుతూ రబీ ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమయిందని, ధాన్యం కొనుగోలుకు ఎన్ని గన్నీబ్యాగులు అవసరమవుతాయో కూడా ప్రభుత్వానికి తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. 15–20 రోజులపాటు అసలు ధాన్యమే కొనుగోలు చేయలేదని, ధాన్యం కొనుగోలు చేసిన రెండు నెలల తర్వాత కూడా డబ్బులు ఇవ్వడం లేదన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావస్తున్నా రబీ కొనుగోళ్లకు రూ.2వేల కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ధాన్యం చెల్లింపులు రాకపోవడంతో రైతులకు పెట్టుబడి ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలవుతున్నా రుణమాఫీ చేయలేదని, ఈ అంశాలన్నింటిపై ఉద్యమించాలని కిసాన్ కాంగ్రెస్ నిర్ణయించిందని చెప్పారు.

## ప్రకృతి వైపరీత్య నిధులపై శ్వేతపత్రం: శశిధర్‌రెడ్డి

కిసాన్ కాంగ్రెస్ సమావేశానికి హాజరైన జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ మాజీ వైస్‌చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ, గత ఐదేళ్లలో ప్రకృతి వైపరీత్యాల నిధుల కింద కేంద్రం రాష్ట్రానికి రూ.1,500 కోట్ల సాయం చేసిందని, ఈ మొత్తాన్ని ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఐదేళ్లలో ప్రకృతి వైపరీత్యాల కింద నష్టపోయిన రైతులకు ఎంత చెల్లింపులు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాల నష్టాల గురించి వివరాలు చెప్పేందుకు రాష్ట్రం సహకరించడం లేదని కేంద్ర బృందం చెప్పడం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన చెప్పారు.

## సమష్టిగా అభివృద్ధి: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కొత్తగా ఎన్నికైన జెడ్పీ చైర్‌పర్సన్లు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేయాలని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు అన్నారు. గ్రామపంచాయతీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం వరకు అందరు సమష్టిగా పనిచేయాలని సూచించారు. సమష్టి కృషితోనే బంగారు తెలంగాణ సాకారమవుతుందని చెప్పారు. కొత్తగా ఎన్నికైన కొత్తగా జెడ్పీ చైర్‌పర్సన్లు పుట్ట మధు (పెద్దపల్లి), కోవా లక్ష్మి (కుమ్రంభీమ్ ఆసిఫాబాద్), లింగాల కమల్ రాజ్ (ఖమ్మం), పి.పద్మ (నాగర్‌కర్నూలు), లోక్‌నాథ్‌రెడ్డి (వనపర్తి), హేమలత (మెదక్), బండ నరేందర్‌రెడ్డి (నల్లగొండ), ఎలిమినేటి సందీప్‌రెడ్డి(యాదాద్రి భువనగిరి), మంజుశ్రీ (సంగారెడ్డి), సుధీర్ కుమార్ (వరంగల్ అర్బన్), గండ్ర జ్యోతి (వరంగల్ రూరల్), పాగాల సంపత్‌రెడ్డి (జనగామ), కుసుమ జగదీష్ (ములుగు), ఆంగోతు బిందు (మహబూబాబాద్), జక్కు శ్రీహర్షిణి (జయశంకర్ భూపాలపల్లి) సోమవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిశారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, జి.జగదీశ్‌రెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, ఎస్.నిరంజన్‌రెడ్డి, వరంగల్ ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ గద్దల పద్మా నర్సింగరావు, ఎంపీలు పసునూరి దయాకర్, మాలోతు కవిత, ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, బి.వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, కోనేరు కోనప్ప, సండ్ర వెంకటవీరయ్య, గొంగిడి సునీత, గండ్ర వెంకటరమణారెడ్డి, బి.శంకర్ నాయక్, బి.సుమన్, గ్యాదరి కిషోర్, గువ్వల బాలరాజు, చల్లా ధర్మారెడ్డి, వి.సతీష్‌కుమార్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, నన్నపునేని నరేందర్, బానోతు హరిప్రియ, సీహెచ్.క్రాంతికిరణ్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్లు, జెడ్పీటీసీలు కేటీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

## హాస్టళ్లకు భవనాలు నిర్మించండి: కృష్ణయ్య



హైదరాబాద్: సచివాలయంలో ఉన్న భవనాలను కూలగొట్టి అదే స్థానంలో నూతన భవనాలు నిర్మిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని, సచివాలయ భవనాలు కాదు.. అసలు భవనాలే లేని సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు, గురుకులాలకు భవనాలు నిర్మించాలని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం బీసీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గొర్రెలు, బర్రెలు, పందులు ఇవ్వడానికి రూ. 10 వేల కోట్లు ఖర్చుపెడుతున్న ప్రభుత్వం.. బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్ భవనాల నిర్మాణానికి బడ్జెట్ ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. ఐదేళ్ల టీఆర్‌ఎస్ పాలనలో ఒక్క హాస్టల్ భవనాన్ని కూడా నిర్మించలేదని అన్నారు. రాష్ట్రంలో 270 బీసీ, 190 ఎస్సీ, 103 ఎస్టీ కాలేజీ హాస్టళ్లను ప్రారంభించి 12 ఏళ్లు గడిచినా.. ఒక్క సొంత భవనం కూడా నిర్మించలేదని విమర్శించారు. బీసీల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. వేలాది మంది విద్యార్థులు ఫీజులు కట్టే ఆర్థిక స్థోమత లేక చదువులు మానుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై టీఆర్‌ఎస్ పార్టీలో ఉన్న బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రశ్నించాలని కోరారు.

## పక్క రాష్ట్రం నుంచి ఏనుగును తేవాలి

**బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్**



సాక్షి, హైదరాబాద్: బోనాల పండుగకు ఏనుగు అనేది సంప్రదాయమని, మన రాష్ట్ర ఏనుగు ఆరోగ్యంగా లేకపోతే పక్క రాష్ట్రం నుంచి తేవాలని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోనాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంత బడ్జెట్ విడుదల చేస్తుందో చెప్పడం లేదన్నారు. అదేవిధంగా తమ నియోజకవర్గానికి ఎంత బడ్జెట్ కేటాయించారో కూడా చెప్పాలని ప్రభుత్వాన్ని కోరినట్లు రాజాసింగ్ చెప్పారు. గతేడాది కంటే ఎక్కువ బడ్జెట్ వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## సచివాలయంలో కరెంట్‌కు అంతరాయం

సాక్షి, హైదరాబాద్: సాంకేతిక సమస్యతో సచివాలయంలోని డీ బ్లాక్‌లో కరెంట్‌కు అంతరాయం ఏర్పడింది. ఎప్పుడు వెలుగులతో ఉండే డీ బ్లాక్ ఒక్కసారిగా కరెంట్ పోవడంతో చీకట్లలో ఉండిపోవాల్సి వచ్చింది. కొంత మేర ఉద్యోగుల పనికి ఆటంకం ఏర్పడింది. దీన్ని గుర్తించిన సిబ్బంది సమస్యను సరిచేసి యథావిధిగా కరెంట్ సరఫరా వచ్చేలా చేశారు.

## స్కూల్ బ్యాగు బరువు తగ్గించండి

**ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి పద్మనాభరెడ్డి**

సాక్షి, హైదరాబాద్: స్కూలు బ్యాగుల బరువు తగ్గించడానికి తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి పద్మనాభరెడ్డి కోరారు. బ్యాగు అధిక బరువు వల్ల పిల్లల వెన్నెముక, మోకాళ్లపై ప్రభావం చూపుతుందని వాపోయారు. కొన్ని స్కూళ్లు బహుళ అంతస్తుల భవనాలు కావడంతో విద్యార్థులు బ్యాగులతో పైకి ఎక్కాలంటే ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషిని కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. స్కూల్ బ్యాగు బరువు తగ్గించడానికి గతంలో ఇచ్చిన జీవో మార్గదర్శకాలు కాగితాలకే పరిమితమయ్యాయని, ఆ జీవోను వెంటనే అమలు చేయాలని విన్నవించారు.

## 'జగన్ సామాజిక సమతుల్యం పాటించారు'

సాక్షి, హైదరాబాద్: కేబినెట్ కూర్పులో సామాజిక సమతుల్యతను పాటించిన సమర్థుడు ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని బీసీ సంక్షేమసంఘం ప్రధాన కార్యదర్శి దాసు సురేశ్ అన్నారు. దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా రాజకీయాల్లో తనదైన ముద్రవేసి పరిపాలనను ఆరంభించిన జగన్ మోహన్‌రెడ్డికి ఆయన అభినందనలు తెలిపారు.

## టీఎస్‌పాలీసెట్-2019 తుది విడత సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పాలీసెట్–2019 తుది విడత కౌన్సెలింగ్ ముగిసింది. తుది విడత కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు ఇచ్చుకున్న 8,749 మంది అభ్యర్థులకు సోమవారం సీట్లు కేటాయించారు. టీఎస్‌పాలీసెట్–2019కు రాష్ట్రవ్యాప్తంగా 95,850 మంది అర్హత సాధించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 145 పాలిటెక్నిక్ కాలేజీల్లో వివిధ కోర్సుల్లో 34,963 సీట్లు ఉండగా.. వీటిలో 26,513 సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 8,450 సీట్లు ఖాళీగా ఉన్నాయి. కాగా, రాష్ట్రవ్యాప్తంగా 75.83శాతం సీట్లు భర్తీ అయినట్లు పాలీసెట్ కన్వీనర్ తెలిపారు.

## 'కొండా' అసలైన భూకబ్జాకోరు

- అపోలో హాస్పిటల్ బాగోతాలను బయటపెడతా
- ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి వెల్లడి



తాండూరు టౌన్: తాను భూకబ్జాలకు పాల్పడ్డానని ఆరోపిస్తున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అసలైన కబ్జాకోరు అని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తాండూరులోని ఆయన నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అపోలో ఆస్పత్రిలో 25 శాతం మందికి ఉచితంగా వైద్యం చేయాల్సి ఉండగా నిబంధనలకు పాతరవేశారని ఆరోపించారు. పేదోళ్ల రక్తం తాగుతున్న ఆయన బాగోతాలను త్వరలోనే బయటపెడతానని స్పష్టం చేశారు. ఇటీవల టీఆర్‌ఎస్‌లోకి వచ్చిన 11 మంది ఎమ్మెల్యేలలో తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఒక్కరన్నారు. ఎమ్మెల్సీగా నియోజకవర్గ అభివృద్ధిలో విషయంలోనైనా, ప్రొటోకాల్ ప్రకారమైనా తానే ముందు వరుసలో ఉంటానని తెలిపారు. తాండూరు ప్రాంతంలో ఇక కాంగ్రెస్ పార్టీ కనుమరుగైనట్లేనని చెప్పారు. ఎన్నికల సందర్భంగా రణరంగాన్ని వదిలేసి పారిపోయిన ఆ పార్టీ ఇన్‌చార్జి రమేష్ మహరాజ్ గురించి మాట్లాడటం టైమ్ వేస్ట్ అని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో మంత్రిగా.. నియోజకవర్గ ప్రజలు, కుల సంఘాలకు ఇచ్చిన హామీలను త్వరలోనే నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులన్నింటినీ మూడు రోజుల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. ఈ సమావేశంలో నాయకులు కరణం పురుషోత్తంరావు, గాజీపూర్ నారాయణరెడ్డి, అబ్దుల్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మంగళవారం, జూన్, 11

# సరైన తీర్పు

దేశం మొత్తం సిగ్గుతో తలదించుకోవాల్సిన అత్యంత అమానుషమైన దురంతంలో నేరగాళ్లకు కఠిన శిక్షలు విధిస్తూ సోమవారం పంజాబ్‌లోని పఠాన్‌కోట్ ప్రత్యేక కోర్టు వెలువరించిన తీర్పు హర్షించదగ్గది. నిరుడు జనవరిలో జమ్మూలోని కథువాలో అసిఫా అనే ఎనిమిదేళ్ల బాలికను అపహరించి, అత్యాచారం జరిపి హతమార్చిన కేసులో ప్రధాన నిందితుడు సాంజీ రాం, మరో ఇద్దరు నిందితులకు యావజ్జీవ శిక్ష విధించడంతోపాటు సాక్ష్యాధారాలను ధ్వంసం చేయడానికి ప్రయత్నించిన మరో ముగ్గురికి అయిదేళ్ల జైలు శిక్ష, రూ. 50,000 చొప్పున జరిమానా విధిస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. సాంజీరాం కుమారుడు విశాల్‌ను కోర్టు నిర్దోషిగా ప్రకటించగా, ఆయనకు సమీప బంధువైన మైనర్ బాలుడు జువెనైల్ కోర్టులో విచారణనెదుర్కొంటున్నాడు. ఆ దురంతం సాధారణమైనది కాదు. అసిఫాను దారుణంగా హింసించి మత్తు పదార్థాన్నిచ్చి నాలుగు రోజులపాటు అత్యాచారం జరిపారు. చివరికామెను రాళ్లతో కొట్టి చంపారు. అత్యాచారాలు, ఇతర లైంగిక నేరాలు బయటికొచ్చినప్పుడల్లా సమాజంలో ఆగ్రహావేశాలు పెల్లుబకడం రివాజే. కానీ కథువా అత్యాచారం విషయంలో జరిగింది ఇది కాదు. ఆరోపణలెదుర్కొంటున్న నిందితులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ప్రదర్శనలు జరిగాయి. అప్పటి పీడీపీ–బీజేపీ ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న ఇద్దరు ఆ ర్యాలీలో పాల్గొనడం మాత్రమే కాదు... 'ఒక బాలిక మృతిపై ఇంత రాద్ధాంతం చేస్తారా?' అంటూ పోలీసులపై విరుచుకుపడ్డారు. ఎంతమంది మహిళలు ఈ ప్రాంతంలో మరణించడం లేదంటూ ప్రశ్నించారు. చివరకు బీజేపీ కేంద్ర నాయకత్వం జోక్యం చేసుకుని ఆ మంత్రులిద్దరితోనూ రాజీనామాలు చేయించింది. కథువా బార్ అసోసియేషన్, హిందూ ఏక్తా మంచ్ వంటి సంస్థలు జాతీయ పతాకంతో ర్యాలీలు నిర్వహించాయి. ఇందులో స్థానిక బీజేపీ, కాంగ్రెస్ నేతలు కూడా పాల్గొన్నారు. చార్జిషీటు దాఖలు చేయడానికొచ్చిన అధికారులను అక్కడి బార్ అసోసియేషన్ అడ్డగించింది. చివరకు బాధితులు అక్కడైతే న్యాయం దక్కదని సుప్రీంకోర్టును ఆశ్రయించాక కేసు విచారణ పంజాబ్‌కు బదిలీ అయింది.

రాజకీయాలు నేరమయం అవుతున్నాయని అందరూ ఆందోళనపడుతున్నారు. కానీ కథువా ఉదంతం విషయంలో ఇది తిరగబడింది. అక్కడ నేరం రాజకీయమయం కావడం కనిపిస్తుంది. మతపరమైన కోణంలో నిందితులకు మద్దతు పలకడం కనిపిస్తుంది. ఈ సందర్భంగా న్యాయమూర్తి తేజ్విందర్‌సింగ్ చేసిన వ్యాఖ్యలు గమనార్హమైనవి. నేరగాళ్లు ఈ సమాజంలో ఆటవిక రాజ్యం ఉన్నదన్న రీతిలో చెలరేగిపోయారని ఆయన వ్యాఖ్యానించారు. ఇలాంటి నేరాల విషయంలో నిజానికి సమాజం మొత్తం ఒక్కటి కావాలి. నిందితుల నేరం రుజువు కావడానికి అవసరమైన అన్ని రకాల చర్యలూ తీసుకోవాలని పట్టుబట్టాలి. కానీ జమ్మూలోనూ, కథువాలోనూ అక్కడి సమాజం ఏకమై నిందితులను సమర్థించింది. నేరాన్నిబట్టి, దాని తీవ్రతనుబట్టి కాకుండా బాధిత వర్గం ఎవరో, నేరగాళ్లెవరో చూసుకుని సమర్థించాలో, వ్యతిరేకించాలో నిర్ణయించుకునే ధోరణి చివరకు సమాజాన్ని ధ్వంసం చేస్తుంది. తమ ప్రాంతంలో ఉంటున్న సంచార తెగవారిలో ఒకరు తమ బంధువును కొట్టారన్న ఆగ్రహంతో ప్రధాన నిందితుడు కక్షగట్టి అసిఫాను కిడ్నాప్ చేయించి ఈ మొత్తం దురంతానికి సూత్రధారిగా మారాడు. దిక్కూమొక్కూలేని సంచార తెగవారు ఈ ఉదంతం తర్వాత ప్రాణభయంతో ఆ ప్రాంతాన్ని వదిలిపెట్టిపోతారని, ఈ నేరం అక్కడితో సమసిపోతుందని అతగాడు భావించాడు. దీనంతటికీ ప్రార్థనా స్థలాన్ని వినియోగించుకున్నాడు.


లైంగిక నేరాలకు దోహదపడుతున్న అంశాలేమిటో సక్రమంగా అవగాహన చేసుకున్నప్పుడే సరైన పరిష్కారం సాధ్యమవుతుంది. జరుగుతున్న నేరాలపై సత్వర దర్యాప్తు మొదలుపెట్టి, వెనువెంటనే దోషులను శిక్షించే ప్రక్రియ అమలైతే అవి చాలావరకూ తగ్గుతాయి. అయితే దీంతోపాటు చేయాల్సింది చాలా ఉంది. లైంగిక నేరాలకు మూలం ఆధిపత్య ధోరణిలో ఉంది. ఆ ఆధిపత్య ధోరణిలో ఒక్క జెండర్ అంశం మాత్రమే కాదు... కుల, మతాలవంటివి బలంగా ఉన్నాయని... అణగారిన వర్గాలపై ఆధిపత్యాన్ని ప్రదర్శించడానికి అత్యాచారాన్ని ఆయుధంగా ఉపయోగిస్తున్నారని సామాజిక శాస్త్రవేత్తలు ఎప్పటినుంచో చెబుతున్నారు. కథువాలో అది బాహాటంగా వెల్లడైంది. అసిఫాకు న్యాయం జరగాలని పట్టుదలతో కృషి చేసిన మహిళా న్యాయవాది దీపికా సింగ్ రజావత్‌ను సామాజిక మాధ్యమాల్లో అసభ్య పదజాలంతో దూషించడం, చంపేస్తామని బెదిరించడం మాత్రమే కాదు...సాంఘిక బహిష్కరణ అమలు చేశారు. న్యాయస్థానంలో ఆమె సహచరులు ఆమెతో మాట్లాడటం మానుకున్నారు. ఇరుగుపొరుగు, బంధువులు దీపికా సింగ్‌ను దూరం పెట్టారు. ఆమెపై 'జాతి వ్యతిరేకి' ముద్ర వేశారు. ఇవన్నీ గమనించాక ఆమె కుటుంబసభ్యులు హడలెత్తి ఈ కేసు నుంచి తప్పుకోమంటూ ఒత్తిళ్లు తీసుకొచ్చారు. ఒక నిస్సహాయ సంచార తెగ బాలిక అన్యాయంగా బలైపోయిందని భావించి, మానవతా దృక్పథంతో ఈ కేసును స్వచ్ఛందంగా స్వీకరించిన ఒక మహిళా న్యాయవాది సమాజంలో ఏకాకిగా మారడం ఊహకందనిది. ఇలాంటివి లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాల్లో జరిగాయని విన్నప్పుడు అందరూ ఆశ్చర్యపోయేవారు. అది మనకు సైతం సాధారణ విషయంగా అనిపించే స్థితి ఏర్పడటం ప్రమాదకరమైంది. నిజానికి మిలిటెంట్ల ఆగడాలతో కశ్మీర్‌లో ఉండలేక అక్కడినుంచి వలస వచ్చిన కశ్మీరీ పండిట్ల కుటుంబానికి చెందినవారు దీపికాసింగ్. ఆమెను వ్యతిరేకించినవారి అభ్యంతరం అదే. అన్ని బాధలకు కారణమైనవారికి 'ఏదో జరిగితే' ఎందుకు పట్టించుకోవాలన్నది వారి ప్రశ్న. ఈ కేసు విచారణ ఏడాది వ్యవధిలో పూర్తయి దోషులకు శిక్షపడటం ఊరటనిస్తుంది. సహజంగానే ఈ కేసు అప్పీల్‌కు వెళ్తుంది. ఉన్నత న్యాయస్థానాల్లో సైతం ఇదే వేగంతో విచారణ కొనసాగి నేరగాళ్లకు కఠిన శిక్షలు పడాలని ఆశించాలి.

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, తిథి శు.నవమి రా.9.36 వరకు, తదుపరి దశమి నక్షత్రం ఉత్తర ప.2.44 వరకు, తదుపరి హస్త, వర్జ్యం రా.10.36 నుంచి 12.05 వరకు, దుర్ముహూర్తం ఉ.8.03 నుంచి 8.55 వరకు తదుపరి రా.10.50 నుంచి 11.34 వరకు, అమృతఘడియలు... ఉ.8.01 నుంచి 9.27 వరకు.

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం: 6.27
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

# ప్రత్యేక హోదా ఏపీ జీవనాడి



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

**ఏపీ అభివృద్ధి ఎజెండా కేవలం ఎన్నికల ఫలితాలకు అతీతమైందని బీజేపీ నాయకత్వం గ్రహించి తీరాలి. 'ఏపీకి ప్రత్యేక హోదా అన్నది ఇక ముగిసిపోయిన అధ్యాయం' అని రాష్ట్ర బీజేపీ అధ్యక్ష హోదా నుంచి కన్నా లక్ష్మీనారాయణ ఓటమి తర్వాత కూడా 'దండోరా' వేస్తున్నారంటే ప్రధాని మోదీ, లేదా బీజేపీ నాయకత్వపు సంకుచిత ఆలోచనా ధోరణి స్పష్టాతిస్పష్టం. 'ప్రత్యేక ప్రతిపత్తి'ని గురించిన ప్రతిపాదన సాధించేంతవరకు జగన్ నిరంతరం జాగరూకతతో ఆందోళన చేయడం అనివార్యమవుతుంది. కేంద్రం తక్షణం 'జాతీయాభివృద్ధి మండలి' సమావేశాన్ని ఏర్పాటు చేయాలి. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రత్యేక ప్రతిపత్తి వైఎస్ జగన్‌కు కాదు... అది ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి.**

**మన దేశంలో కులాలు, మతోన్మాదం ప్రజల మనస్సులపైన, ప్రజల నైతికతపైన చాలా విచిత్రమైన ప్రభావం కలిగిస్తున్నాయి. బహుళ సంఖ్యాక ప్రజలను బాధిస్తున్న దారిద్ర్యాన్ని తదితర ఈతి బాధలను గురించి దేశంలో ఎవరూ ఆలోచించి బాధపడుతున్నట్లు తోచదు. నిజమే.. దారిద్ర్యబాధల్లో ఉంటూ దుఃఖితులుగా ఉన్న వారికి వ్యక్తిగత స్థాయిలో కొందరు సాయపడటానికి ముందుకు వస్తూ ఉండవచ్చు గాక. కానీ ఆ సహాయాన్ని అందించే దాతలు మాత్రం తమ సొంత కులంలోని వారికో లేదా సొంత మతస్థులలోని వారికి మాత్రమే సాయపడుతున్నారని మరవరాదు. ఈ ధోరణి నిజమైన నైతిక ప్రమాణాలకు పరమ విరుద్ధమైన నీతి, 'ఉల్టా' నైతికత! దురదృష్టవశాత్తూ మన దేశంలో అమలు జరుగుతున్నదే ఈ 'ఉల్టా' నీతి!**

*– డా. బి. ఆర్. అంబేడ్కర్ 'ఏది విమోచన మార్గం' (విచ్ వే టు ఎమాన్సిపేషన్) అస్పృశ్యులన్నపేరిట వేలాదిమంది దళితులు హాజరైన బహిరంగ సభలో మరాఠీలో చేసిన ప్రసంగం: ''అంబేడ్కర్ స్పీక్స్'' వాల్యూమ్ 1, పేజీ 182, ఎడిటర్ ప్రొఫెసర్ నరేంద్రయాదవ్ (2013)*

**''దారిద్ర్యం అనేది మానవుడు కల్పించిందే అయితే, అదే మానవుడు ఆ దారిద్ర్యాన్ని రూపుమాపడమూ సాధ్యమే. ఈ ప్రాపంచిక దృక్పథమే నాకు జీవితపాఠమై నా కళ్లు తెరిపించింది.''**

*– టిటో టోనీ, సుప్రసిద్ధ ఫిలిప్పీన్స్ సామాజిక కార్యకర్త, వందలాది గ్రామాల్లో పెనుమార్పులకు ఆద్యుడైన వాడు (5–10–2017, రూరల్ ఇండియా కథనం)*

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన వైఎస్సార్ కాంగ్రెస్ యువజన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేసిన తర్వాత తొలి ప్రసంగంలో తన పాలనారథానికి, రథికులకు విధానపరమైన దశా, దిశా నిర్దేశం చేశారు. సుమారు 14 మాసాలపాటు సుదీర్ఘ రాష్ట్ర పాదయాత్ర సందర్భంగా ఆయన రూపొందించి, కోట్లాది మంది ప్రజలతో ముఖాముఖిగా సమస్యలను శ్రద్ధతో విన్న అనుభవంతో ఆచరణలోకి తాను తేనున్న నవరత్నాల సంక్షేమపథకానికి వెంటనే శ్రీకారం చుట్టడం రాష్ట్రచరిత్రలోనే కాదు, స్వాతంత్ర్యానంతర భారత దేశ మంత్రివర్గాల ఆచరణ చరిత్రలోనే ఒక అపురూప పరిణామంగా భావించాలి. ఉమ్మడి రాష్ట్రాన్ని అర్ధంతరంగా చీల్చడానికి, ముఖ్యమంత్రి పదవి కోసం వెంపర్లాడిన చంద్రబాబు అనర్థదాయక పాలనా వారసత్వాన్ని ప్రజాబాహుళ్యం అండదండలతో పాతిపెట్టి జగన్ ప్రజాపక్షపాతిగా రూపొందారు. ఇందుకు ప్రధాన కారణం గతించిన రాచరిక పాలనల్లో కొనసాగుతూ వచ్చిన కుల, వర్గ, వర్ణ, మత వివక్షలకు దూరంగా కేవలం సకలమతాల 'సారమతి'గా జగన్ తనకు తాను సంస్కరించుకున్న ఫలితంగా బైబిల్–ఖురాన్–భగవద్గీతల సారాన్ని రంగరించుకుని నూతన దృక్పథానికి అంకురార్పణ చేశారు. ఇది పాలకులకే కాదు, పాలితులయిన విభిన్న స్రవంతులకు చెందిన ప్రజలకూ పాఠమే!

జడత్వంలో మగ్గుతున్న తెలుగు సమాజాన్ని మన్నుతిన్న పింజేరులా పడి ఉండక కొంతైనా చైతన్యం పొందడానికి జగన్ ప్రయత్నం, ప్రణాళిక ఉషోదయం ముందు తొలికోడి కూతలాంటి మేలుకొలుపుగా భావించాలి! అలాంటి మేలుకొలుపులకు ఆద్యులు దేశ చరిత్రలోనూ, రాష్ట్రాల చరిత్రల్లోనూ, కొన్ని రాచరిక పాలనా వ్యవస్థల్లో కూడా లేకపోలేదు. అలాగే జగన్ మనస్సులో నైలునది పొత్తిళ్లలో ఎదిగిన ఈజిప్టు, నదీ సంగమాల మధ్యన రూపుదిద్దుకున్న మెసపటోమియా నాగరికతల వైభవ ప్రాభవాలు మెదలవకపోవు. ఆ సంస్కృతిలోనే కృష్ణా, గోదావరి, పెన్నా నదీతీరాలలో తెలుగు మాగాణాలు సుక్షేత్రాలుగా అవతరించడానికి ఎలా దోహదం చేశాయో ఆయన మనస్సులో ఆలోచనలను కుదిపి ఉండవచ్చు. క్రీ.పూ 594 నాటి ఏథెన్సులో ధనికులకు పేదలకు మధ్య జాంబవంతుడి అంగలతో పంగలతో పెరిగిపోయిన అసమానతలు, దారిద్ర్యం గురించిన చరిత్ర వైఎస్ జగన్‌కు తెలియకపోదు. ఆ క్రమంలో ధనిక వర్గ శక్తులు తమ తమ ఆస్తిపాస్తులకు ఎదురైన సవాళ్లను కర్కశంగా ఎదుర్కొనడంలో ఎన్నివేలమంది పేదల్ని, వారి జీవితాలను నాశనం చేశారో కూడా జగన్‌కి తెలుసు. ఈ దుర్మార్గాలకు, దుర్మార్గులకు కోర్టులు కూడా వత్తాసు పలికి అవినీతికి వత్తాసు పలికి సామాన్య పేద, మధ్యతరగతి ప్రజలను ఎలా నట్టేట ముంచడానికి వెరవలేదో ప్లూటార్క్ మహాశయుడు రోమన్ చరిత్రలో భావితరాలకు గుణపాఠంగా లిఖించిన సంగతీ జగన్‌కు గుర్తుండే ఉండాలి.

చంద్రబాబు అరాచక పాలన ఫలితంగా రుణ బాధలలో కూరుకుపోయిన ఆంధ్రప్రదేశ్ వేగాతివేగంగా బయట పడేందుకు యువనేత జగన్‌వైపు మొరలెత్తుకుని చూస్తోంది. ఇందుకు, అగమ్య గోచరంగా తెలుగు ప్రజల్ని విభజించి సరైన రాజధానిని, దానికి మౌలిక సదుపాయాలను సమకూర్చగల శక్తిగా పునాది బలంలేని రాజధానిని ఆంధ్రప్రదేశ్ ప్రజల నెత్తిపైన ఆకస్మికంగా రుద్ది, 'మీ చావు మీరు చావండ'ని అర్ధంతరంగా వదిలేసిన రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేదోడు కాగలిగేది –ప్రత్యేక ప్రతిపత్తి 'హోదా' మాత్రమేగానీ కేవలం 'వాదోడు' కాదు. రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తి హోదా లేదా 'ప్రత్యేక తరహా ప్రతిపత్తి' ప్రతిపాదన ఎందుకు తలెత్తవలసి వచ్చింది? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కృత్రిమ పద్ధతుల్లో విభజించినందుకు.. అందుకు కారకులు కాంగ్రెస్, బీజేపీ నాయకులు. చట్టం చేయకుండా బిల్లు రూపంలో (కాంగ్రెస్) నాటకం ఆడి, చట్టం కాకుండా శాసనవేదిక తలుపులు మూసి 'చీకట్లో చిందులాట'తో కాంగ్రెస్ 'తూ.నా. బొర్డు' చెప్పగా, ఇక 'మేం అధికారంలోకి ఎలాగూ వస్తున్నాం కాబట్టి ప్రత్యేక ప్రతిపత్తి మేమిస్తాం' అన్న మిషపైన బీజేపీ వ్యవహరించి 'దుస్తులు దులుపుకుంది'. నాటి రాజ్యసభలో బీజేపీ నాయకులు అరుణ్‌జైట్లీ, వెంకయ్య నాయుడు కాంగ్రెస్ సభ్యులతో కలిసి సంతోషంగా చేతులూపుకుంటూ ఆడిన నాటకాన్ని తెలుగు ప్రజలు మరచిపోరు, మరచిపోరాదు.

తీరా జరిగిందేమిటి? కాంగ్రెస్ నుంచి తనకు అధికారాన్ని బీజేపీ గుంజుకున్నదేగానీ, విడగొట్టిన ఏపీకి మాత్రం బాబు చాటున దాగి, అతనితో పరస్పరం లాలూచీ 'ప్రత్యేక ప్రతిపత్తి'ని 'ప్రత్యేక ప్యాకేజీ'గా మార్చి ప్రత్యేక ప్రతిపత్తికే ఇప్పటికీ ఎగనామం పెడుతూనే వచ్చారు. నిన్నగాక మొన్న (9–6–19) తిరుపతి సభలో కూడా మోదీ ఎంతసేపూ 'ఏపీలో నూతన ప్రభుత్వం అభివృద్ధిని సాధించాలన్న' నోటిమాటతోనే సరిపెట్టారు, లేదా 'జగన్ అభివృద్ధి సాధించాలి' అన్న పదాల చాటున దాగుతూ 'కేంద్రం అండగా ఉంటుందన్న' తడిలేని 'పొడి పొడి' మాట లేగానీ 2014 నాటి విభజన చట్ట నిబంధనలను సహితం పాటిస్తామన్న మాట మోదీ నోట రాలేదు. ఇంతకూ మోదీ నాన్పుడు ధోరణి వెనుక బీజేపీకి ఒక స్పష్టమైన లక్ష్యం ఉన్నట్టు స్పష్టం అవుతోంది. జగన్ నిరంతర పోరాటం ద్వారా డిమాండ్ చేస్తున్న ఆంధ్రప్రదేశ్ విభజిత రాష్ట్రానికి 'ప్రత్యేక ప్రతిపత్తి'ని మరి ఐదేళ్లపాటు వాయిదా వేస్తూ జగన్ ప్రభుత్వాన్ని సంక్షోభంలోకి నెట్టి ప్రజలలో వ్యతిరేకత పెరగడం కోసం 'గుంట కాడ నక్కల' మాదిరిగా ఎదురుచూస్తూ మళ్లీ ఎన్నికల సంతర్పణ నాటికి, రాష్ట్రంలో స్థానభ్రష్టత పొందిన బీజేపీకి ఎలాగోలా ప్రాణం పోయాలన్న తపన ఆ పార్టీ నాయకత్వానికి ఉందనిపిస్తోంది.

కేంద్ర 5వ ఆర్థిక సంఘం 'ప్రత్యేక తరహా ప్రతిపత్తి' (స్పెషల్ క్యాటగిరీ స్టేటస్)ని ముందు మూడు రాష్ట్రాలకు (అస్సాం, నాగాలాండ్, జమ్మూ–కశ్మీర్‌లు) కల్పించి తరువాత మరో ఎనిమిది రాష్ట్రాలకు విస్తరించింది. అలా వాటి సంఖ్య మొత్తం 11 రాష్ట్రాలకు పెరిగింది. అయితే, ఆ తర్వాత 'ప్రత్యేక ప్రతిపత్తి'ని మాత్రం ఐదు సూత్రాలపై ఆధారపడి అస్సాం, నాగాలాండ్, జమ్మూ–కశ్మీర్‌లకు మంజూరు చేశారు. నిజానికి ఇవన్నీ కృత్రిమ విభజన ద్వారా ఏర్పడిన రాష్ట్రాలే, పన్ను రాయితీలకు, రాష్ట్ర ఆదాయం హెచ్చుతగ్గుల నిష్పత్తిపైన ఆధారపడి ప్రత్యేక ప్రతిపత్తిని అనుభవిస్తున్నవే. అయితే ఇక్కడ ఎంత మాత్రం విస్మరించ కూడని అంశం ఏదంటే– ఆంధ్రప్రదేశ్ విభజన, స్థిరమైన రాజధాని లేని విభజన ద్వారా, ఐదేళ్ల తర్వాత కూడా కోలుకోలేని స్థితిలో ఉన్న రాష్ట్రమనీ, అందుకే ప్రత్యేక ప్యాకేజీ కాకుండా, 'ప్రత్యేక ప్రతిపత్తి' గల రాష్ట్రంగానే పారిశ్రామిక, విద్యా, ఆరోగ్యరంగాల సత్వర ఆర్థికాభివృద్ధికి అవసరమని గుర్తించాలి. ఏపీ అభివృద్ధి ఎజెండా కేవలం ఎన్నికల ఫలితాలకు అతీతమైందని బీజేపీ నాయకత్వం గ్రహించి తీరాలి. 'ఏపీకి ప్రత్యేక హోదా అన్నది ఇక ముగిసిపోయిన అధ్యాయం' అని రాష్ట్ర బీజేపీ అధ్యక్ష హోదా నుంచి కన్నా లక్ష్మీనారాయణ ఓటమి తర్వాత కూడా 'దండోరా' వేస్తున్నారంటే ప్రధాని మోదీ, లేదా బీజేపీ నాయకత్వపు సంకుచిత ఆలోచనా ధోరణి స్పష్టాతిస్పష్టం. 'ప్రత్యేక ప్రతిపత్తి'ని గురించిన ప్రతిపాదన సాధించేంత వరకు జగన్ నిరంతరం జాగరూకతతో ఆందోళన చేయడం అనివార్యమవుతుంది. తక్షణం 'జాతీయాభివృద్ధి మండలి' సమావేశాన్ని ఏర్పాటు చేయాలి. ప్రత్యేక ప్రతిపత్తి వైఎస్ జగన్‌కు కాదు, ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి. ఇంతకూ చంద్రబాబును ఇంతకాలంగా అంటకాగుతూ వచ్చిన బీజేపీ అగ్రేసర నాయకత్వం బాబు బహిర్గత అక్రమాలపై, అవినీతిపై సమగ్ర విచారణ జరిపి, శిక్షాపాత్రుణ్ణి చేయడానికి ఎందుకు వెనుకాడుతుందో, రాష్ట్ర ప్రజలకు స్పష్టం చేయాలి. 'పరోపదేశ పాండిత్యం' ఇక చెల్లదుగాక చెల్లదు!!

abkprasad2006@yahoo.co.in

### రెండో మాట



సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




### సోషల్ మీడియా

#### శాంతి



"దేవుని దయ వల్ల, మన దేశంలోని న్యాయ వ్యవస్థ శక్తి వల్ల, ప్రభుత్వం మద్దతు కారణంగా.. ఈ రోజు నేను ఓ భారతీయ మహిళగా ప్రపంచం ముందు తలఎత్తుకుని నిలబడుతున్నా. కథువా అత్యాచార ఘటనలో నిందితులు ఆరుగురినీ కోర్టు దోషులుగా తేల్చింది. ప్రధాన కుట్రదారుడు సంజీరామ్‌తో సహా మరో ఇద్దరికి జీవిత ఖైదు విధించింది. అసీఫా, నీ ఆత్మకు శాంతి కలుగుగాక"

– జైనాబ్ సికిందర్, రచయిత్రి

#### నవ్వు



"క్రేజీ మోహన్ సార్ ఇక లేరట. ఆయన లాంటివారు మరొకరు కనబడరు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నా. ఆయన కుటుంబ సభ్యులకు నా సానుభూతి. ఆయన మా తమిళ స్మృహలో భాగం. ఒక జోక్ విని మేం నవ్వే నవ్వులో కూడా ఆయన ఓ భాగం"

– సిద్ధార్థ, హీరో

#### ఆల్ ద బెస్ట్



"ఆటగాళ్లు వస్తూ ఉంటారు, పోతూ ఉంటారు. కానీ, యువరాజ్ సింగ్ లాంటి ఆటగాడు చాలా అరుదు. ఎంతో క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్నప్పటికీ అనారోగ్యాన్నీ, బౌలర్లనూ ఎదిరించి హృదయాలను గెలుచుకున్నాడు. తన ఆత్మవిశ్వాసంతోనూ, పోరాటంతోనూ ఎందరికో స్ఫూర్తిగా నిలిచాడు"

– వీరేందర్ సెహ్వాగ్, క్రికెటర్

#### స్వేచ్ఛ



"గిరీష్ కర్నాడ్ గొప్ప నాటక రచయిత, నటుడు. అంతకంటే సామాజిక రాజకీయ కార్యకర్త. మత మౌఢ్యానికి వ్యతిరేకంగా, బహుళ సంస్కృతుల కోసం, భావప్రకటనా స్వేచ్ఛ కోసం ఆయన పనిచేశారు"

– ఊర్మిళా మటోండ్కర్, హీరోయిన్

#### మౌనీ బాబా




"జగన్‌గారి కేబినెట్లో 60% మంత్రులు అణగారిన వర్గాలకు చెందిన వారే. దళితులు, బీసీలు సీఎంలుగా ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇంత ప్రాధాన్యత ఇవ్వలేదు. బీసీలకు 50% నామినేషన్ పనులు కేటాయించి ఆర్థికంగా ఎదిగేలా చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో బీసీలు, కాపులను ఉద్ధరిస్తానని కోతలు కోసిన చంద్రబాబుకు జగన్‌గారి కేబినెట్ కూర్పుపై ప్రశంసించడానికి ఒక్క మాట రావడం లేదు. సామాజికంగా అణిచివేతకు గురైన వారికి నాలుగు ఉప ముఖ్యమంత్రి పదవులివ్వడంపై ఏ వ్యాఖ్యా చేయకుండా మౌనీ బాబా అయ్యారు బాబు"

– విజయసాయిరెడ్డి
వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

# ధిక్కార స్వరం గిరీష్

నాటక రచయిత, సినిమా నటుడు, ప్రముఖ సామాజికవేత్త గిరీష్ కర్నాడ్ దీర్ఘకాలంగా అనారోగ్య సమస్యని ఎదుర్కొంటూ శరీరంలోని ప్రధాన అవయవాలు పనిచేయకపోవడంతో సోమవారం ఉదయం బెంగళూరులోని ఆసుపత్రిలో మృతిచెందారు. మహారాష్ట్రలో మే 19, 1938లో జన్మించిన గిరీష్ కర్నాడ్ 1958లో కర్ణాటక యూనివర్సిటీ నుండి డిగ్రీ పట్టా పొందారు. 1963లో ఎమ్.ఏ విద్యాభ్యాసం పూర్తిచేశారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో తత్త్వశాస్త్రం, పొలిటికల్ సైన్స్, అర్థశాస్త్రాలను అభ్యసించారు. సామాజిక విలువల కోసం చివరి వరకు పోరాటం కొనసాగిస్తూ హిందుత్వవాదుల నుంచి నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు.

కన్నడ సినిమాలో రచయితగా, ఫిలింమేకర్‌గా, సామాజిక ఉద్యమకారుడిగా సమాజంలో తన బాధ్యతాయుతమైన పాత్రను నిర్వహించారు. 1974లో పద్మశ్రీ, 1992లో పద్మభూషణ్, 1998లో జ్ఞానపీఠ అవార్డును స్వీకరించారు.



నివాళి

2017లో ప్రముఖ జర్నలిస్టు గౌరీలంకేశ్ హత్య అనంతరం ఆ హింసను ఖండించడంలో ముందు వరుసలో నిలబడ్డారు. ఒక గౌరీని హత్య చేస్తే మేమందరం గౌరీలుగా మారతామని ప్రభుత్వాలకు అల్టిమేటం ఇచ్చారు. గిరీష్ కర్నాడ్ చాలా నాటకాలు రాశారు. 1961లో యయాతి, 1972లో హయవదన, 1988లో నాగమండాల రచించారు. తెలుగు, కన్నడ సహా పలు భాషల్లోని సినిమాల్లో నటించారు. అంతేకాక పలు హిందీ సినిమాల్లో కూడా నటించాడు.

దేశంలో 300 సంస్థలతో పుణేలో ఎల్గార్ పరిషత్ ఏర్పడి భీమాకొరేగాంలో దళితులు తమ ఉద్యమ ఆకాంక్షను ప్రకటిస్తే.. దాన్ని అణచివేయడం కోసం హిందుత్వ శక్తులు హింసకు పాల్పడి, ఇద్దరు దళితులను హత్య చేశాయి. హిందుత్వ శక్తులపై చట్టబద్ధ చర్యలు తీసుకోలేని ప్రభుత్వం, దోషులను విడిచిపెట్టి, ప్రజాస్వామిక వాదులైనటువంటి మేధావులను, ప్రొఫెసర్లను, న్యాయవాదులను అక్రమంగా అరెస్టు చేసి ఏడాది కాలంగా బెయిల్ రాకుండా పుణేలోని ఎరవాడ జైల్లో నిర్బంధించారు. ఈ నిర్బంధాల వెనుక ప్రధాన కారణంగా అర్బన్ నక్సల్ అనే పదాన్ని తీసుకువచ్చి అందరిమీద క్రూర నిర్బంధాన్ని అమలుచేస్తోంది. దీన్ని నిరసిస్తూ తానూ అర్బన్ నక్సల్‌నేనని మెడలో బోర్డు వేసుకొని ప్రపంచానికి తెలియజేశారు, ప్రభుత్వాలను సవాల్ చేశారు. ప్రజాస్వామికవాదులపై జరుగుతున్న దాడులను నిలదీయడంలో తనవంతు బాధ్యతను నిర్వహించిన గిరీష్ కర్నాడ్ జీవితం చాలా విలువైనదని భావిస్తున్నాం. అలాగే హక్కుల కోసం పోరాడే ఏ ప్రజాస్వామిక గొంతుకలకైనా మద్దతుగా పౌరహక్కుల సంఘం నిలబడుతుందని తెలియజేస్తూ గిరీష్ కర్నాడ్‌లాగా పౌర ప్రజాస్వామిక హక్కుల కోసం మేధావులు, ప్రజాస్వామిక వాదులు ఆయన స్ఫూర్తితో ఉద్యమించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

ఎన్. నారాయణరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పౌరహక్కులసంఘం
మొబైల్ : 98667 34867

# ఎన్నికల తక్కెడలో మీడియా లెక్కలు

టెక్నాలజీ యుగంలో అత్యంత వేగంగా చేరువయ్యే మార్గమైన సోషల్ మీడియా ప్రభావం, ఈ సారి ఎన్నిక ఫలితాల్లోనూ స్పష్టంగా ఉందని చెప్పక తప్పని నిజం. ప్రధానమంత్రి అభ్యర్థిగా బరిలోకి దిగిన మోదీ నుంచి మొన్నటి సర్పంచ్ ఎన్నికల్లో అభ్యర్థుల వరకు సోషల్ మీడియాను వినియోగించుకున్నవారే. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, న్యూస్ యాప్స్.. వెబ్ చానెల్స్.. ఇలా సోషల్ మీడియా ఎన్నిక ప్రచారంలో కీలకంగా పనిచేసింది.. ఇందుకోసం రాజకీయ పార్టీలు ప్రత్యేకంగా ఐటీ సెల్స్ ఏర్పాటు చేశాయి. ఈ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు తమ ఎన్నిక ఖర్చులో 5 నుంచి 7 శాతం సోషల్ మీడియాకే కేటాయించినట్టు ప్రాథమికంగా తెలుస్తోంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీ సోషల్ మీడియా కోసం 2 నుంచి 5 శాతం బడ్జెట్ ఖర్చు చేసింది.

ఓ సర్వే ప్రకారం గత ఎన్నికల్లో సోషల్ మీడియా కోసం ఒక్కొక్క పార్టీ 400 నుంచి 500 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు అంచనా. ఇక ఈసారి బీజేపీ ఏకంగా తొమ్మిది లక్షలమందిని సెల్‌ఫోన్ ప్రముఖ్స్ పేరిట నియమించింది. వీరికి అదనంగా ప్రతి ఎలక్షన్ బూత్‌కు సోషల్ మీడియా కోఆర్డినేటర్‌ను నియమించారు. కాంగ్రెస్ పార్టీ సైతం భారతీయ జనతా పార్టీకి దీటుగా డిజిటల్ సాథి పేరిట ప్రత్యేకంగా కొందరు వలంటీర్లను నియమించుకుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న పలు ప్రాంతీయ పార్టీలు కూడా ప్రత్యేకంగా ఐటీ సెల్ ఏర్పాటు చేసుకున్నాయి. ఒక్కొక్క పార్టీ సుమారు వంద మంది ఉద్యోగులను నియమించుకుని ఎప్పటికప్పుడు పార్టీ ప్రణాళికలను ప్రచారంలో పెట్టి, ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశాయి.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభంజనం సృష్టించిన వైఎస్సార్‌సీపీ విషయమే తీసుకుంటే... ఆ పార్టీ సోషల్ మీడియాను ఈసారి సంపూర్ణంగా వినియోగించుకుందనే చెప్పాలి. ఈ పార్టీకి అనుకూలంగా సోషల్ మీడియాలో దాదాపు 250 మేర చానళ్లు, గ్రూపులు, వెబ్‌సైట్లు పని చేశాయి. ఆ పార్టీ ఎన్నిక వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలో ఇందుకోసం ప్రత్యేకంగా ఓ బృందం పనిచేసినట్టు వినికిడి. గత ఎన్నిక వరకూ ఎన్నిక ప్రచారంలో టెక్నాలజీ వినియోగంలో ముందంజలో ఉన్న తెలుగుదేశం పార్టీ ఈసారి సోషల్ మీడియా వాడకంపై అంతగా దృష్టి పెట్టలేదు.

ట్విట్టర్‌లో ప్రపంచస్థాయిలో అత్యంత ఆదరణ కలిగిన ప్రముఖుల్లో ఒకరుగా నిలిచిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ... సోషల్ మీడియా వేదికను వాడడంలో మేటి అనే చెప్పాలి. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మొట్టమొదటిసారిగా ఎన్నికల ప్రచారంలో సోషల్ మీడియాను భాగస్వామి చేసిన తొలిపార్టీ బీజేపీ. ఆ తర్వాత ఇతర పార్టీలు ఆ విధానాన్ని అనుసరించాయి. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తన ప్రచార సభను ప్రత్యక్ష ప్రసారం చేయడం మొదలుకొని ప్రత్యర్థులపై విమర్శలు, విసుర్లను ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ లాంటి సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ల ద్వారా ఎప్పటికప్పుడు జనంలోకి తీసుకెళ్లారు. దీంతో ప్రజలతో ఆయనే నేరుగా సంభాషించే వీలు కల్గింది.

భారతదేశంలో సోషల్ మీడియా వినియోగదారులు నానాటికీ పెరుగుతున్నారు. అందరికీ స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులోకి వచ్చిన తర్వాత అరచేతిలో అస్త్రంగా మారింది సోషల్ మీడియా. ఇండియాలో 200 మిలియన్ల మంది వాట్సాప్ వినియోగిస్తున్నారు. 7.65 మిలియన్ల మందికి ట్విట్టర్ ఖాతాలున్నాయి. ప్రపంచంలోనే అత్యధికంగా ఫేస్‌బుక్‌ను 300 మిలియన్ల మంది భారతీయులు వాడుతున్నారు. ఇక నెలకు 41 మిలియన్ల మంది యూట్యూబ్‌ను వాడుతున్నట్టు సర్వేలు వెల్లడిస్తున్నాయి.

దేశంలోని 40 శాతం ఓటర్లు యువతే... వారంతా ఇంటర్నెట్, సోషల్ మీడియాను నిత్యం ఏదో ఒక రూపంలో వాడేవాళ్లే. అందుకే యువతను ప్రభావితం చేసేందుకు పార్టీలు సోషల్ మీడియాను వేదికగా చేసుకున్నాయి. ట్విట్టర్ వాడుతున్న వారిలో 18 ఏళ్లు నిండిన భారతీయులు 4.3 కోట్ల మంది ఉన్నారు. అంటే యువతలో ప్రతి 20 మంది ఓటర్లలో ఒకరు ట్విట్టర్ వాడుతున్న వారే. భారతదేశంలో ఫేస్‌బుక్ యూజర్లలో 24.1 కోట్ల మంది 18 ఏండ్లు నిండిన వారే, అంటే ప్రతి నలుగురు ఓటర్లలో ఒకరు ఫేస్‌బుక్ వాడే వాళ్లు ఉన్నారు. వాట్సాప్ వాడుతున్న వారిలో 37.9 కోట్ల మంది 18 ఏండ్లు నిండిన వారే. అంటే ప్రతి ముగ్గురు ఓటర్లలో ఒకరు వాట్సాప్ వాడుతున్నారు. అందుకే పార్టీలన్నీ సోషల్ మీడియాపై దృష్టి సారిస్తున్నాయి.

సత్తి రామచంద్రారెడ్డి

# సుయజ్ఞుడు

ఉశీనర అనే ఒక దేశం పాలకుడు సుయజ్ఞుడు ఒకప్పుడు శత్రువులతో యుద్ధం చేస్తూ, సుయజ్ఞుడు యుద్ధభూమిలోనే మరణించాడు. ఆ వార్త విని ఆయన అంతఃపుర రాణులంతా గొల్లుమంటూ వచ్చి రణభూమిలో రక్తసిక్తంగా పడి ఉన్న భరత్ శరీరాన్ని చూసి గుండెలు కొట్టుకుంటూ వలవలా విలపించారు. వాళ్ల దుఃఖం చూసి, యమ ధర్మరాజుకే గుండె కరిగిపోయింది. స్వయంగా తనే ఒక మునిబాలకుడి మారు వేషంలో వెళ్లి, మరణాన్ని గురించిన కొన్ని ముఖ్యమైన, విలువైన నిత్యసత్యాలు వాళ్లకు బోధించి, ఊరడించారు. 'అయ్యో! ఎంత ఆశ్చర్యం! ఈ రాణులందరూ లోకధర్మం తెలిసిన వివేకవతులు. రోజూ పుట్టేవాళ్లనూ, గిట్టేవాళ్లనూ ఎందరినో చూస్తూ ఉండేవాళ్లే. అయినా భర్తమీది మోహంతో, ఇప్పుడు 'చావక మానెడు వారి భంగి, ఈ చచ్చిన వానికేడ్చెదరు'! వీళ్లకు తెలియదా, 'ఎచ్చటపుట్టె అచ్చటికి ఏగుట నైజము ప్రాణికోటికి' అని?

'ఆ సర్వేశ్వరుడు తన ఇచ్ఛ ప్రకారం ఈ చరాచర జగత్తునంతా సృష్టిస్తాడు, రక్షిస్తాడు, సంహరిస్తాడు. అది ఆయన లీల. ఈ జగత్తు ఆయనకు క్రీడా వస్తువు. ఆట బొమ్మ. ఆయన రక్షణ ఉన్నంతవరకూ, ఎక్కడున్నా, ఎవరికయినా చావురాదు. అది తీరితే, ఎక్కడ ఉన్నా ఎవరికయినా చావు తప్పదు. ఇది లోకధర్మం. 'పాంచ భౌతికమైన ఈ శరీరం ఖాళీ ఇల్లు. కర్మఫలాలు అనుభవించేందుకు జీవుడు ఇందులో ప్రవేశిస్తాడు. ఇల్లు కూలిపోతే, జీవుడు వెళ్లిపోతాడు. ఇల్లు కూలుతుంది కానీ దేహికి నాశనం లేదు. ఇక మీ శోకం ఎవరి గురించి?'




'సుయజ్ఞుడి దేహం మీ ముందే ఉంది. కానీ ఇన్నాళ్లూ మీ మాటలన్నీ వింటూ, మీకు బదులిస్తూ వచ్చిన జీవుడు మాత్రం ఇప్పుడు ఈ శరీరంలో లేడు. వెళ్లిపోయాడు. ఆ జీవుడు ఎప్పుడూ ఎలాగూ మీ కంటికి కనిపించినవాడు కాదు, కనిపించేవాడు కాదు. ఇంక శోకం దేన్ని గురించి? 'నిత్యమేదో, అనిత్యమేదో తెలిసిన వాళ్లు శోకించరు. శోకించేవాళ్లు ఎంత శోకించినా, నిత్యం అనిత్యం కాదు. అనిత్యం నిత్యం అయిపోదు. మనుషులకు మహా మాయా ప్రభావంవల్ల భార్యాపుత్రులూ, బంధుమిత్రులూ అంటూ ఎన్నెన్నో ఏవేవో సంబంధాలు ఏర్పడతాయి. కర్మానుబంధంవల్ల ఏర్పడతాయి. కర్మఫలానుభవం పూర్తి కాగానే కల కరిగినట్టు మాయమౌతాయి. ఈ బంధాలన్నీ కలలో లభించిన సంపద లాంటివి. మీరిలా నూరు సంవత్సరాలు శోకించినా, కాలధర్మం ప్రకారం కొంత కాలానికి మీరూ వెళ్లిపోతారు తప్ప మీ భర్త తిరిగి రాడు'. సాక్షాత్తూ యముడే చేసిన వేదాంత బోధ, రాణులకు సాంత్వన కలిగించింది. భాగవతం సప్తమ స్కంధంలో సుయజ్ఞోపాఖ్యానం జిజ్ఞాసువులకు ఆవశ్యపఠనీయం.

– ఎం. మారుతి శాస్త్రి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ మంగళవారం
11-6-2019



పిల్లలు కావాలనుకున్నప్పుడే పెళ్లి
సినిమా పేజీలో...



ఎంతెత్తుకెదిగినా.. ఎంత పెద్ద శిఖరమైనా...
ఎంత వ్యాప్తి ఉన్న వర్ఛస్సయినా...
గుప్పడు గుండెలో ఒదిగిన గిరి..
ఆకాశానికి ఎదిగిన గిరి..

గిరీష్ కర్నాడ్

# ఆకాశానికి ఎదిగిన గిరి

**నటుడుగా, నాటకకర్తగా, దర్శకుడిగా, చైతన్యకారునిగా, బుద్ధిజీవిగా తన కాలపు తరాలకే కాదు రాబోవు తరాలకు కూడా గిరీష్ కర్నాడ్ స్ఫూర్తిమంతంగా నిలిచాడు. 81 సంవత్సరాల వయసులో జూన్ 10న ఆయన ప్రపంచమనే ఈ నాటకరంగాన్ని శాశ్వతంగా విడిచిపెట్టి అభిమానుల నుంచి వీడ్కోలు తీసుకున్నాడు.**

తెలుగువారికి నటుడుగా పరిచయం కావడానికి ముందే గిరీష్ కర్నాడ్ తెలుగు సినిమాల కోసం పని చేశాడు. శ్యామ్ బెనగళ్ దర్శకత్వం వహించిన 'అనుగ్రహం' సినిమాకు బెనగళ్‌తో పాటు ఆయన కూడా స్క్రీన్ ప్లే రాశాడు. వాణిశ్రీ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాను అభిరుచి ఉన్న ప్రేక్షకులు నేటికీ మర్చిపోలేదు. నిజానికి కర్నాడ్– తాను నాటకం రాయగలడని, నటించగలడని, దర్శకత్వం వహించగలడని తెలియకుండా ఆయా దారుల గుండా ప్రయాణించి, అత్యుత్తమ ప్రతిభ కనపరిచి, ఎత్తులకు ఎదిగాడు.

కర్నాడ్‌కు ఇంగ్లిష్ కవి కావాలని ఉండేది. లండన్ తన శాశ్వత నివాస నగరి అని చదువుకునే రోజుల్లోనే అనుకున్నాడు. లండన్‌లో చదువుకోవడానికి స్కాలర్‌షిప్ రావడం చాలా పెద్ద విషయం కనుక ఎక్కువ మార్కులు పొందడం ఒక్కటే మార్గం అనుకుని, తనకు పెద్దగా ఇష్టం లేని గణితంలో డిగ్రీ చేసి ఆశించినట్టుగా స్కాలర్‌షిప్ పొందాడు. అయితే తల్లిదండ్రులు ఇద్దరూ నాటక రంగంతో పరిచయం ఉన్నవారు కావడం వల్ల తెలియకుండానే పుస్తకాల పట్ల, కళల పట్ల ఆసక్తి ఏర్పడింది. ఉత్తర కర్ణాటకకు సాంస్కృతిక క్షేత్రమైన 'ధార్వాడ్'లో ఇంటర్, డిగ్రీ చదవడం వల్ల, ఆ సమయంలో అక్కడికి వచ్చే ప్రఖ్యాత సాహిత్యకారులతో పరిచయం ఏర్పడటం వల్ల కర్నాడ్‌కు సాహిత్యం పట్ల ఇష్టం ఏర్పడింది. ఆ రోజుల్లో ఊరూరా తిరిగి యక్షగానాలను ప్రదర్శించే బృందాలతో ప్రభావితం చెందాడు. సి.రాజగోపాలచారి మహాభారతానికి రాసిన వ్యాఖ్యాన ఉద్గ్రంథం చదివాక ఒకరోజు హటాత్తుగా ఉద్ధృతిగా ఆయన రాసిన తొలి నాటకమే 'మానిషాద'. కాలేజీ ముగిశాక లండన్ వెళ్లే ముందు ఈ కన్నడ నాటకం రాసి, దాని సంగతి వదిలి, ఆక్స్‌ఫర్డ్‌లో చదువుతూ అక్కడి ఇంగ్లిష్ కార్యకలాపాలలో మునిగాడు కర్నాడ్. ఇంగ్లిష్ కవిగా, నాటకకారునిగా గుర్తింపు పొందాలని తపన పడుతున్నప్పుడు 'మా నిషాద' కన్నడలో అచ్చయ్యి పేరు తెచ్చింది. లండన్‌కు పంపుతూ తండ్రి 'నువ్వు తిరిగి వచ్చి మమ్మల్ని చూసుకోవాలి' అని షరతు పెట్టడం గుర్తొచ్చి, భారతంలో 'యయాతి' కూడా తన కుమారులకు 'మీ యవ్వనం ఇవ్వండి' అని షరతు పెట్టాడు కదా అనుకుని లండన్‌లో ఉండగానే రాసిన మరో నాటకం 'యయాతి'. కన్నడంలో రాసిన ఆ నాటకం గిరీష్ కర్నాడ్‌కు చాలా ఖ్యాతి తెచ్చిపెట్టింది. దాంతో కర్నాడ్ 'ఇక ఇంగ్లిష్ నేలకు సెలవు... నా సాధనంతా నా మాతృభాషలో చేసుకుంటాను... నా సాహిత్యకృషి అంతా నా దేశంలోనే సాగాలి' అనుకుని ఇక్కడకు వచ్చేశాడు.

భారతదేశానికి వచ్చి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్, మద్రాసు శాఖలో పని చేస్తూ ఉండగా ప్రఖ్యాత అనువాదకుడు ఏ.కె.రామానుజన్ కర్నాడ్‌కు షికాగో యూనివర్సిటీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పని చేసే అవకాశం కల్పించాడు. అంతే కాదు ఒక తాజా నాటకం రాయమని కర్నాటక ప్రాంతంలో ఉన్న ఒక జానపద కథను సూచించాడు. ఆ కథ ఆధారంగా కర్నాడ్ రాసిన నాటకమే 'నాగమండల'. తనను పట్టించుకోని మొగునికి మందు పెడదామని ఒక ఇల్లాలు అనుకుని పాలల్లో మందు కలిపితే పొరపాటున ఆ పాలు వొలికి పుట్టలో పడతాయి. వాటిని తాగిన పుట్టలోని పాము రోజూ ఆమె భర్త రూపు దాల్చి ఇల్లాలితో కూడుతూ ఉంటుంది. తర్వాత ఏమవుతుందనేది కథ. ఈ నాటకమే కాదు చరిత్ర పట్ల, చరిత్రను చూడాల్సిన చూపు పట్ల అవగాహన ఉన్న కర్నాడ్ 'తుగ్లక్', 'టిప్పు సుల్తాన్' నాటకాలు రాసి దేశంలో, విదేశాలలో గుర్తింపు పొందాడు.

కన్నడంలో సంచలనం సృష్టించిన నవల 'సంస్కార' (రచన: యు.ఆర్.అనంతమూర్తి) ఆధారంగా తీస్తున్న సినిమాలో మొదటిసారి ప్రధాన పాత్రలో నటించాడు కర్నాడ్. దీనికి దర్శకత్వం వహించిన పఠాభి తెలుగువాడు కనుక కర్నాడ్‌ను స్క్రీన్ ఆర్టిస్ట్‌ను చేసిన ఘనత తెలుగువారిది అని సంతోషించాలి. ఆ తర్వాత శ్యాం బెనగళ్‌తో ఏర్పడిన పరిచయం త్వరత్వరగా కర్నాడ్‌ను హిందీ భాషల్లో ఇతర భారతీయ భాషల్లో వ్యాప్తి చెందేలా చేసింది. దేశంలో క్షీర విప్లవం తెచ్చిన కురియన్ అనుభవాల ఆధారంగా బెనగళ్ తీసిన 'మంథన్'లో కర్నాడ్ హీరోగా నటించి చాలామందికి గుర్తుండిపోయాడు. జంధ్యాల దర్శకత్వంలో 'ఆనందభైరవి'లో నటించి 'శంకరాభరణం' జె.వి.సోమయాజులు తర్వాత అంతటి పేరు పొందిన నటుడు కర్నాడ్. తనకు వచ్చిన నాట్యానికి వారసులు లేకుండా పోతారేమోనన్న చింతలో ఉండే నాట్యాచారునిగా, పట్టిన పట్టు కోసం చివరకు కపాలమోక్షం చేసుకునే ఆత్మాభిమానిగా కర్నాడ్ నటన తెలుగువారిని కట్టిపడేసింది.

సాహిత్యం తెలిసినవాడు సినిమాల్లోకి వెళితే ఏం చేస్తాడో గిరీష్ కర్నాడ్ కూడా అదే చేశాడు. కన్నడంలో ఎస్.ఎల్.భైరప్ప రాయగా విఖ్యాతమైన నవల 'వంశవృక్ష'ను తొలిసారిగా డైరెక్ట్ చేశాడు. ఆ తర్వాత భైరప్పే రాసిన మరో నవల 'గోధూళి'ని, మరో నవల 'కాడు'ను సినిమాలుగా తీశాడు. 'కాడు' సినిమా 'క్షత్రియ పుత్రుడు' తీయడానికి తనకు ఇన్‌స్పిరేషన్‌గా పని చేసిందని కమల హాసన్ ఒక సందర్భంలో చెప్పాడు. ఇక శూద్రకుడు రాసిన విఖ్యాత సంస్కృత నాటకం 'మృచ్ఛకటికం'ను హిందీలో 'ఉత్సవ్' పేరుతో తీశాడు కర్నాడ్. శశి కపూర్ నిర్మించిన ఈ సినిమా రేఖ, శేఖర్ సుమన్‌లకు చాలా పేరు తెచ్చి పెట్టింది. తన ఆసక్తికి తగిన పనులు చేస్తూ భుక్తికి కమర్షియల్ సినిమాలలో నటించాడు. శంకర్ దర్శకత్వంలోని 'ప్రేమికుడు'లో ఆయన పోషించిన గవర్నర్ పాత్ర అందరికీ గుర్తు. 'ధర్మచక్రం'లో వెంకటేశ్‌కు, 'శంకర్ దాదా ఎం.బి.బి.ఎస్'లో చిరంజీవికి కర్నాడ్ తండ్రిగా నటించాడు. హిందీలో ఇటీవల 'ఏక్ థా టైగర్', 'టైగర్ జిందాహై'లలో సల్మాన్ ఖాన్ బాస్‌గా ముఖ్యపాత్ర పోషించాడు.

గిరీష్ కర్నాడ్ నటుడే కాదు నటగురువు కూడా. పూణె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రిన్సిపాల్‌గా ఉంటూ నసిరుద్దీన్ షా వంటి నటులకు పాఠాలు చెప్పాడు. విద్యార్థిగా ఉన్న నసిరుద్దీన్ షా ప్రిన్సిపాల్‌గా ఉన్న కర్నాడ్ మీద తోటి విద్యార్థులతో కలిసి సమ్మెకు దిగడం ఆనాటి ఒక ముచ్చట. పూణె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఒక గొప్ప ఇన్‌స్టిట్యూట్‌గా ఖ్యాతి గడించడానికి కర్నాడ్ స్థిరం చేసిన ప్రమాణాలే కారణం. కొత్త టాలెంట్‌ను గమనించే కర్నాడ్ తన సినిమాల ద్వారా విష్ణువర్ధన్, శంకర్‌నాగ్‌లను ఇంట్రడ్యూస్ చేశాడు. ఇవాళ్టి విఖ్యాత ఆర్ట్ డైరెక్టర్ సాబు సిరిల్‌ని కూడా కర్నాడే పరిచయం చేశాడు.

అయితే సృజనకారుడు సృజన చేసి ఊరుకుంటే సరిపోదని అతనికి సామాజిక బాధ్యత ఉండాలని భావించినవాడు కర్నాడ్. భారతదేశం వెయ్యేళ్ల క్రితం ఎలా ఉందో ఇప్పుడూ అలాగే మతం, కులం అంటూ కొట్టుకుంటూ ఉందని ఆవేదన చెందుతాడు. మతతత్వం దేశానికి ఏ మాత్రం మంచిది కాదని బాహాటంగా కర్నాడ్ వేదికలెక్కి మాట్లాడాడు. సమాజాన్ని చైతన్యపరిచే ఇంటలెక్చువల్స్‌ని 'అర్బన్ నక్సలైట్'లుగా ప్రభుత్వ ఏజెన్సీలు వ్యాఖ్యానిస్తుంటే అలాగైతే నేను కూడా అర్బన్ నక్సలైట్‌నే అంటూ మెడలో కార్డు వేలాడేసుకుని తిరిగినవాడు కర్నాడ్. బెదిరింపులు, హేళనల మధ్య తన నిరసన తెలిపే హక్కును కోల్పోని ధైర్యవంతుడు కర్నాడ్.

నాటకశాలలో దీపాలు ఆరిపోయాక స్టేజ్ మీద దీపం వెలగాలి. అది బుద్ధికి దారి చూపాలి. సాహిత్యం, సినిమా కూడా చేయాల్సింది అదే. కాని ఇవాళ వెలుతురు ఇవ్వాల్సిన అన్ని కళలకు, సాహిత్య రూపాలకు, ప్రశ్నించే మాధ్యమాలకు నిర్బంధం ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయని, నోరున్నా మాట్లాడలేని పరిస్థితులు ఉన్నాయని కర్నాడ్ ఆవేదన చెందుతాడు.

ధైర్యం లేని జాతి మానసిక సంకుచితానికి గురి కాక తప్పదని భావించే కర్నాడ్‌లాంటి సృజనకారులను స్మరించుకుంటూ ఉండాలంటే సదా వివేచనతో హేతువుతో ప్రజాస్వామిక విలువలతో ముందుకు సాగాలి.

అలా చేయగలగడమే ఆయనకు అసలైన నివాళి.

– కె

## సారస్వత బ్రాహ్మణులు

గిరీష్ కర్నాడ్ కుటుంబం సారస్వత బ్రాహ్మణ కుటుంబం. పూర్వం సరస్వతి నది పరివాహక ప్రాంతం నుంచి వచ్చిన బ్రాహ్మణులు కనుక తాము సారస్వత బ్రాహ్మణులు అని వీరు అంటారు. వీరు ఆది నుంచి ఉన్నత విద్యావంతులు. బ్రిటిష్ హయాంలో మంచి హోదాలలో పని చేశారు. కర్నాటకలోని ధర్వాడ్ సమీపంలో ఉన్న సారస్వత్‌పూర్‌లో 1950లలోనే యాభై బంగళాలలో సారస్వత బ్రాహ్మణులు ఒక అగ్రహారంగా జీవించేవారు. కర్నాడ్‌కు అక్కడ ఒక సొంత బంగ్లా ఉంది. కర్నాడ్ తల్లి కృష్ణాబాయి. తండ్రి డాక్టర్ రఘునాథ్ కర్నాడ్. తల్లి బాల వితంతువు కాగా ఆమె నర్సుగా పని చేస్తూ డాక్టర్ అయిన రఘునాథ్‌ను వివాహం చేసుకున్నారు. అయితే ఆమె పెద్ద కొడుకు తన సవతి కొడుకని చాలా ఏళ్ల వరకూ తెలియకుండా తల్లి తమను పెంచిందని కర్నాడ్ చెప్పారు.

## గిరీష్ కర్నాడ్ మృతి

- కర్ణాటకలో మూడురోజుల సంతాప దినాలు
- నిరాడంబరంగా అంత్యక్రియలు



ప్రఖ్యాత నటుడు, నాటకకర్త, దర్శకుడు గిరీష్ కర్నాడ్ (81) సోమవారం బెంగళూరులో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని కుటుంబం తెలిపింది. కర్నాడ్ భార్య సరస్వతి గణపతి వైద్యురాలు. కుమారుడు రఘు రచయిత, జర్నలిస్టు. కుమార్తె షల్మలి ఆరోగ్యరంగంలో పని చేస్తున్నారు. మహారాష్ట్రలోని మాథెరన్ (ముంబైకి సమీపంలో ఉండే హిల్‌స్టేషన్)లో జన్మించిన కర్నాడ్ బాల్యం పూణెలో కౌమారం కర్నాటకలోని ధార్వాడ్‌లో గడిచింది. ఇంట్లో మరాఠి, కన్నడ... రెండు భాషలు మాట్లాడేవారు. బిఎస్సీ మేధమేటిక్స్ చదివినప్పటికీ కళారంగంలో తన అభిరుచిని గమనించిన కర్నాడ్ నాటకాల ద్వారా, సినిమాల ద్వారా గుర్తింపు పొందారు. జానపద, పౌరాణిక పరంపరను ఆధునికతతో సమ్మిళతం చేసి కొంత మార్మిక ధోరణిలో సాగిన కర్నాడ్ నాటక శైలి విశేష ఖ్యాతి సాధించి పెట్టింది. ప్రఖ్యాత కన్నడ రచయిత బి.వి.కారంత్‌తో కలిసి నాటకాల్లో, సినిమాల్లో కర్నాడ్ విశేష కృషి చేశారు. పారలల్ సినిమాలు ఊపందుకోవడంలో ముఖ్యపాత్ర పోషించారు. శ్యాం బెనగళ్ దర్శకత్వంలో హైదరాబాద్ నేపథ్యంలో సాగే 'అంకుర్' కథలో కర్నాడ్ కనిపిస్తారు. 'నిషాంత్', 'మంథన్', 'స్వామి' ఆయన నటించిన ఇతర సినిమాలు. కర్నాడ్ చేసిన కృషికి ఎన్నో పురస్కారాలు అందాయి. 1974లో పద్మశ్రీ, 1992లో పద్మభూషణ్ గౌరవాన్ని పొందారు. 1998లో ఆయనకు సాహిత్యంలో ప్రకటించే సర్వోన్నత పురస్కారం 'జ్ఞానపీఠ్' దక్కింది. కర్నాడ్ మృతి వార్త వెలువడిన వెంటనే కర్నాటక ప్రభుత్వం సోమవారం రోజు ప్రభుత్వ సెలవును ప్రకటించింది. మూడురోజుల సంతాప దినాలను పాటించాలని కోరింది. కర్నాడ్‌కు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరపాలని భావించినా కర్నాడ్ చివరి కోరిక మేరకు కర్నాడ్ కుటుంబం సున్నితంగా తోసిపుచ్చింది. అభిమానులు, సెలబ్రిటీలు భారీగా తరలి రావడానికి కూడా అంగీకరించలేదు. కొంతమంది నాటకరంగ మిత్రులు మాత్రమే అంతిమ నివాళి అర్పించినవారిలో ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ దహనవాటిక ద్వారా గిరీష్ కర్నాడ్ అంతిమ సంస్కారాలు ముగిశాయి.



వాజ్‌పేయి నుంచి జ్ఞానపీఠ్ అవార్డు తీసుకుంటూ...



'స్వామి'లో షబానా అజ్మీతో...



'ఆనంద భైరవి'లో...

## వద్దనుకుంటే పుట్టిన బిడ్డ

గిరీష్ కర్నాడ్ తల్లికి మొదటి భర్త నుంచి ఒక కొడుకు ఉన్నాడు. రెండవ పెళ్లి తర్వాత ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. గిరీష్ కర్నాడ్ కడుపులో పడినప్పుడు ఇప్పటికే ముగ్గురు ఉన్నారు కదా, అబార్షన్ చేయించుకుంటాను అని అనుకుందట తల్లి. అబార్షన్ కోసం ఒక డాక్టరమ్మ క్లినిక్‌కు కూడా వెళ్లిందట. అయితే అదృష్టవశాత్తు ఆ డాక్టరమ్మ ఆ రోజు క్లినిక్‌కు రాలేదు. లీవు పెట్టింది. మధ్యాహ్నం వరకూ కూచున్న కర్నాడ్ తల్లి విసుగొచ్చి ఇంటికి వచ్చేసింది. ఆ తర్వాత ఆమెకు అబార్షన్ చేయించుకోవాలనే మూడ్ పోవడంతో కర్నాడ్ పుట్టాడు. 'ఈ సంగతి తెలిసి ఆశ్చర్యపోయాను. నేను పుట్టకుండా ఈ లోకం ఎలా ఉంటుంది ఎలా ఉండేది అని ఇప్పటికీ నాకు ఆశ్చర్యమే' అని నవ్వుతాడు కర్నాడ్.



తొలి చిత్రం 'సంస్కార' (1970 – కన్నడ)



'మంథన్' (1976–హిందీ)



మాల్గుడి డేస్



ప్రేమికుడు (తెలుగు)



టైగర్ జిందా హై (హిందీ)


చెట్టు నీడ

## ధ్యానం... నేను చేసే వ్యవసాయం

గౌతమబుద్ధుడు ఊరూరా తిరుగుతూ బౌద్ధమత ప్రచారం చేస్తున్న రోజులవి. ఒకరోజు బుద్ధుడు పొలం గట్టు మీద నుండి నడిచి వెళ్తుండగా చూసిన ఒక రైతు పరుగున వెళ్లి ఆయనకు నమస్కరించాడు. ''నేనొక సామాన్య రైతుని. కొద్దిపాటి పొలం దున్నుకుంటూ పని చేస్తే తప్ప పొట్ట గడవదు. పాళీ భాషలో మీరు చెప్పే బోధనలు నాకు అర్థం కావు. ప్రపంచం గురించి చదివి తెలుసుకునే తీరికా, జ్ఞానమూ లేనివాణ్ణి. ధ్యానం గురించి తెలుసుకోవాలనుంది. సెలవిస్తారా?'' అని విన్నవించాడు రైతు.

వెంటనే బుద్ధుడు ''నేను కూడా వ్యవసాయం చేసుకునే రైతునే'' అనడంతో రైతు ఆశ్చర్యంతో ''అయ్యా.. తమలాంటి గొప్పవారు ఇలా వేళాకోళం ఆడవచ్చా? మీరొక రాజకుమారుడు. రైతు అయితే పొలం దున్నుతూనో, విత్తనాలు జల్లుతూనో కనబడాలి కదా. చుట్టూ ఎడ్లు, బండ్లు, పార, పలుగు, పనిముట్లు ఉండాలి. అవేవీ లేవు. మీరొక సన్యాసిలా కనబడుతున్నారు'' అని సందేహం వ్యక్తపరిచాడు.

రైతు ప్రశ్నలకు బుద్ధుడు నవ్వి'' నువ్వు చేసే వ్యవసాయానికి, నేను చేసే వ్యవసాయానికి కొంచెం తేడా వుంది. నేలను దున్ని, విత్తనాలు జల్లి, నీరు పారించి, కలుపు తొలగించి, ఆరుగాలం శ్రమిస్తే నీ పొలంలో పంట పండుతుంది. నేనైతే హృదయమనే భూమిని ధ్యానమనే నాగలితో దున్ని జ్ఞానమనే విత్తనాలు చల్లి, ఏకాగ్రత అనే నీరు పోసి, కోర్కెలనే కలుపు తీసి, ఆశయమనే ఎరువు వేసి, మోక్షమనే పంటను పండిస్తున్నాను. సత్యం, నమ్రత, సదాచారం, సద్విచారం, సద్గుణం, ఉన్నతమైన లక్ష్యాలే నా పనిముట్లు. నీకు అర్థమయ్యేలా నీ భాషలో చెప్పాలంటే నేను చేసే వ్యవసాయం పేరు ధ్యానం'' అని చెప్పాడు. రైతు సందేహం తీరింది. బుద్ధుడి కాళ్ళకి దండం పెట్టి పొలంలోకి వెళ్లిపోయాడు.



ధ్యానం మీద లగ్నం చేస్తే మనసు ప్రశాంతంగా ఉండి భౌతికమైన కోర్కెలు దూరమై అతీతమైన, అలౌకిక ఆనందం పొందగలరని బుద్ధుడి ప్రబోధాల సారాంశం. అది ఆచరణలో చూపినప్పుడే మానవుడు జ్ఞానోదయం పొందుతాడు.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

**గమనిక**

నిన్నటి సంచికలో ప్రచురితమైన 'లవింగ్ డాటర్స్' కథనంలో ''మా నాన్న పెంచినట్టే నేనూ..'' అనే అభిప్రాయంలో బి.జ్యోతి సహచరుడి పేరు మానవహక్కుల న్యాయవాది పురుషోత్తమ్ రెడ్డి అని అచ్చయింది. అది పౌరహక్కుల సంఘం పురుషోత్తమ్‌గా గమనించగలరు. అలాగే ''ప్రాపర్టీ అనే భావనతోనే'' అన్న అభిప్రాయం ఫొటో రైటప్‌లో యేసుల్లా జ్యోతి అని అచ్చయింది. యెదుళ్ల జ్యోతిగా గమనించగలరు.

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



రేపు శారద పుట్టినరోజు

**పల్లవి:**
ఎవరు రాయగలరూ
అమ్మా అను మాట కన్న కమ్మని కావ్యం
ఎవరు పాడగలరూ
అమ్మ అను రాగం కన్న తీయని రాగం
అమ్మేగా...
అమ్మేగ తొలిపలుకు నేర్చుకున్న భాషకి
అమ్మేగ ఆది స్వరం
ప్రాణమనె పాటకి
॥ఎవరు రాయగలరు॥

**చరణం:**
అవతారమూర్తి అయినా
అణువంటె పుడతాడు
అమ్మ పేగు పంచుకునే
అంతవాడు అవుతాడు
అవతారమూర్తయినా
అణువంటె పుడతాడు
అమ్మ పేగు పంచుకునె
అంతవాడు అవుతాడు
అమ్మేగా.... అమ్మేగ చిరునామ
ఎంతటి ఘన చరితకి
అమ్మేగ కనగలదు అంత గొప్ప అమ్మని
॥ఎవరు రాయగలరు॥

**చరణం:**
శ్రీరామ రక్ష అంటూ నీళ్లపోసి పెంచిందీ
దీర్ఘాయురస్తు అంటూ నిత్యం దీవించిందీ
శ్రీరామ రక్ష అంటు నీళ్లపోసి పెంచింది
దీర్ఘాయురస్తు అంటు నిత్యం దీవించింది
నూరేళ్లూ... నూరేళ్ల ఎదిగి బ్రతుకు
అమ్మ చేతి నీళ్లతో
నడక నేర్చుకుంది
బ్రతుకు అమ్మ చేతి వేళ్లతో
॥ఎవరు రాయగలరు॥

**చిత్రం: అమ్మ రాజీనామా**
**సంగీతం: చక్రవర్తి**
**రచన : సిరివెన్నెల ; గానం : ఎస్పీ బాలు**

కట్‌చేయ్...దాచేయ్...

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 4 | | 2 | | | 6 | |
| | 1 | | 6 | 4 | | 2 | | 8 |
| | | | 3 | | 8 | 5 | | |
| 5 | | 1 | 9 | | 4 | | 8 | |
| | 6 | | | | | | 5 | |
| | 7 | | 8 | | 5 | 3 | | 9 |
| | | 3 | 7 | | 1 | | | |
| 1 | | 6 | | 9 | 3 | | 2 | |
| | 4 | | | 5 | | 8 | | |

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

**నిన్నటి జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 9 | 1 | 7 | 4 | 3 | 5 | 6 | 8 |
| 8 | 6 | 3 | 1 | 2 | 5 | 9 | 7 | 4 |
| 5 | 7 | 4 | 8 | 6 | 9 | 2 | 3 | 1 |
| 9 | 1 | 2 | 5 | 3 | 6 | 8 | 4 | 7 |
| 7 | 3 | 5 | 4 | 8 | 1 | 6 | 9 | 2 |
| 6 | 4 | 8 | 9 | 7 | 2 | 3 | 1 | 5 |
| 1 | 2 | 9 | 3 | 5 | 4 | 7 | 8 | 6 |
| 3 | 5 | 7 | 6 | 1 | 8 | 4 | 2 | 9 |
| 4 | 8 | 6 | 2 | 9 | 7 | 1 | 5 | 3 |

# పిల్లలు కావాలనుకున్నప్పుడే పెళ్లి



● తాప్సీ

**"ప్రేక్షకులు 200-300 రూపాయలు పెట్టి టికెట్ కొనుక్కుని రెండు మూడు గంటలు సమయాన్ని వెచ్చించి నా సినిమా చూస్తున్నారు. అలాంటప్పుడు వారిని మెప్పించేలా నా చిత్రాలు ఉండాలి. లేకుంటే వారి డబ్బు, సమయం వృథా. డబ్బు సంపాదించుకోవచ్చు.. కానీ సమయం తిరిగి రాదు.. అందుకే మంచి కథలు ఎంచుకుంటున్నా" అని తాప్సీ అన్నారు. ఆమె లీడ్ రోల్‌లో అశ్విన్ శరవణన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఓవర్'. వై నాట్ స్టూడియోస్, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఎస్.శశికాంత్ నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో తాప్సీ పంచుకున్న విశేషాలు...**

● దాదాపు ఏడాదిన్నర కష్టపడి 'గేమ్ ఓవర్' కథ రెడీ చేసుకున్నారు శరవణన్. కథ చెప్పగానే చాలా ఇంప్రెస్ అయ్యా.. వెంటనే ఓకే చెప్పేశా. ఎందుకంటే భారతీయ సినీ చరిత్రలో ఇంతవరకూ రాని సరికొత్త కథాంశమిది. నా పాత్ర వైవిధ్యంగా, చాలెంజింగ్‌గా ఉంటుంది. మేకింగ్, స్క్రీన్‌ప్లే హైలైట్.

● కెరీర్ మొదట్లో నాకు సినిమా అంటే ఏంటి? కథ, స్క్రీన్‌ప్లేకి ఎంత ప్రాధాన్యం ఉంటుంది? ఇలాంటివి తెలియదు. కానీ. గత రెండు మూడేళ్లుగా మంచి కథలు మాత్రమే ఎంచుకుంటున్నా. 'కాంచన2' తర్వాత తమిళంలో సినిమాలు చేయలేదు. కానీ, తెలుగులో మాత్రం ఏడాదికి ఓ సినిమా చేస్తున్నా.

● 'గేమ్ ఓవర్' నచ్చడంతో అనురాగ్ కశ్యప్‌గారు హిందీలో డబ్ చేస్తున్నారు. ఈ ఏడాది తెలుగులో ఇది నా స్ట్రెయిట్ ఫిల్మ్. నా రియల్ లైఫ్‌లో ఎప్పుడూ చిన్న కట్టు కూడా కట్టుకోలేదు. అలాంటిది ఈ సినిమా కోసం 60 శాతం కాళ్లకు బ్యాండేజ్ కట్టుకుని చక్రాల కుర్చీలో కనిపిస్తాను. షూటింగ్‌లో రోజూ బ్యాండేజ్ కట్టడానికి, విప్పడానికి 45 నిమిషాలు పట్టేది. ఫిజికల్‌గా, మెంటల్‌గా చాలెంజ్‌తో కూడుకున్న పాత్ర ఇది.

● నేనెప్పటికీ డైరెక్టర్స్ హీరోయిన్‌నే. నా గత సినిమాల పోస్టర్స్‌లో నా పేరు ఉండేది కాదు.. కాబట్టి అంత ఒత్తిడికి గురయ్యేదాన్ని కాదు. కానీ, 'గేమ్ ఓవర్' పోస్టర్స్‌లో 'తాప్సీ ఇన్ గేమ్ ఓవర్' అని వేస్తుంటే పెద్ద బాధ్యతగా ఫీలవుతున్నా. అందుకే తొలిసారి ఒత్తిడి అనిపిస్తోంది. పైగా గర్వంగానూ ఉంది. నా సినిమాలు వందకోట్ల క్లబ్‌లో చేరాలంటే ఎలా? 30–40 కోట్లంటే ఓకే.

● నాకు హారర్ సినిమాలంటే భయం. ఈ సినిమా చేస్తున్నప్పుడు మైండ్ డైవర్ట్ అయ్యేందుకు కామెడీ సినిమాలు చూసేదాన్ని. 'బద్ లా' సినిమా విడుదల తర్వాత వేరే సినిమా షూటింగ్ కోసం ఉత్తర ప్రదేశ్‌లో ఉన్నా. అందరూ సినిమా బాగుంది, పార్టీ ఎప్పుడు? అంటూ ఫోన్లు చేశారు. నా సహనటులతో నేనెప్పుడూ ఒకేలా ఉంటా. అది అమితాబ్‌సర్ అయినా, అభిషేక్ అయినా.

● బాలీవుడ్‌లో వైవిధ్యమైన సినిమాలు చేస్తున్నానని అంటున్నారు.. నేనెప్పుడూ ప్రయోగాలకు సిద్ధమే. కమర్షియల్ సినిమాలు, గ్లామర్ రోల్స్ చేస్తా. నేను కూడా బాలీవుడ్ హీరోయిన్లలా లిప్ కిస్సులు పెడతా, డ్యాన్సులు చేస్తానన్నా.. కానీ ఏ బాలీవుడ్ డైరెక్టర్స్ నన్ను ఆ యాంగిల్‌లో చూసి, అవకాశం ఇవ్వడం లేదు.

● 'గేమ్ ఓవర్' తెలుగు ట్రైలర్‌ని రానా లాంచ్ చేసి, 'చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది.. నిన్ను చూస్తుంటే గర్వంగానూ ఉంది.. ఈ సినిమాకోసం వేచి చూస్తున్నా' అంటూ మెసేజ్ పెట్టాడు.


● 'పింక్' సినిమా సౌత్‌లో రీమేక్ కావడం సంతోషంగా, గర్వంగా ఉంది. 1,2,3... ఈ నంబరింగ్ గేమ్ గురించి నాకు తెలీదు. నేను సోలోగా వెళుతున్నాననుకుంటున్నా. తెలుగు ప్రేక్షకులకు సినిమా అంటే ప్యాషనేట్, భలే క్రేజ్. అది బాలీవుడ్ ప్రేక్షకుల్లో అంతగా కనిపించదు.

● ఒక్కోసారి అన్ని భాషల్లో ఒకే టైమ్‌లో నటించడం వీలు పడదు. అందుకే కొన్ని సౌత్ సినిమాలు వదులుకున్నా. అయితే బాలీవుడ్‌లోనూ ఎక్కువ చాన్స్‌లు రావడం లేదు.. వచ్చినవి చేస్తున్నా. ఇప్పుడు సౌత్‌లోనూ నాకు అవకాశాలు తగ్గాయి. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో చేయడం లక్కీగా ఫీలవుతున్నా. నిర్మాతగా మారాలనుకుంటున్నా. అయితే ప్రొడక్షన్ అన్నది చాలా రిస్క్. మంచి పార్టనర్, మంచి టీమ్ కుదిరితే స్టార్ట్ చేస్తా.

● పెళ్లినేది ప్రతిఒక్కరి జీవితంలో ముఖ్యమైంది. ప్రస్తుతానికి నా దృష్టంతా సినిమాలపైనే ఉంది. పెళ్లి చేసుకోవాలనే ఆలోచన ఇప్పట్లో లేదు. పిల్లలు కావాలనిపించినప్పుడు చేసుకుంటా. ప్రస్తుతం తెలుగులో రెండు సినిమాలకు చర్చలు జరుగుతున్నాయి.. తమిళంలో ఓ సినిమా ఓకే అయింది. హిందీలో రెండు చిత్రీకరణలో ఉన్నాయి.




● బ్రహ్మానందం



● సునీల్

# నార్త్‌లో సౌత్ నవ్వులు

బ్రహ్మానందం, సునీల్ తెలుగు ప్రేక్షకులను కొన్నేళ్లుగా నవ్విస్తున్నారు. ఈ ఇద్దరూ సీన్‌లో ఉంటే పంచ్‌లు, సెటైర్‌లు పేలుతూనే ఉంటాయి. లేటెస్ట్‌గా వీళ్లిద్దరూ బాలీవుడ్ ఆడియన్స్‌నూ నవ్వించడానికి ముంబై ఎక్స్‌ప్రెస్ ఎక్కబోతున్నారని తెలిసింది. సన్నీ లియోన్, మందాన కరిమి ముఖ్య పాత్రల్లో ప్రసాద్ తాటికేని దర్శకత్వంలో ఓ హారర్–కామెడీ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. మహేంద్ర దరివాల్, పరమదీప్ సాందు నిర్మాతలు. ఈ సినిమాలో కీలక పాత్రల్లో బ్రహ్మానందం, సునీల్ నటిస్తే బావుంటుందని భావించిన చిత్రబృందం వీళ్లను ఎంపిక చేసిందట. వచ్చే నెలలో బ్రహ్మానందం షూట్‌లో జాయిన్ కాబోతున్నారు. సినిమాను సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేయాలని చిత్రబృందం ప్లాన్ చేస్తోందట. సో.. వీరిద్దరూ నార్త్ ఆడియన్స్‌నూ నవ్వుల్లో ముంచేయడానికి రెడీ అవుతున్నారన్నమాట.



● శ్రద్ధా కపూర్

# మా ప్రపంచంలోకి రండి

సాహో ప్రపంచం ఎలా ఉండబోతోందో చూపించడానికి మేం రెడీ అయ్యాం అంటోంది చిత్రబృందం. ప్రభాస్ హీరోగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సాహో'. శ్రద్ధా కపూర్ కథానాయిక. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్కీ నిర్మిస్తున్నారు. దాదాపు 300 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం టీజర్‌ను ఈనెల 13న రిలీజ్ చేస్తున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. సినిమాలోని శ్రద్ధా కపూర్ లుక్‌ను విడుదల చేశారు. షూటింగ్ చివరిదశలో ఉన్న ఈ సినిమాలో శ్రద్ధా కపూర్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తారు. నీల్ నితిన్ ముఖేశ్, అరుణ్ విజయ్, ఎవలిన్ శర్మ, లాల్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం ఆగస్ట్ 15న రిలీజ్ కానుంది.

# నవ్వులు వెలవెలపోయాయి

**తమిళ రచయిత క్రేజీ మోహన్ మృతి**

తమిళ నాటక రచయిత, హాస్యనటుడు, డైలాగ్ రైటర్ 'క్రేజీ' మోహన్ సోమవారం తుది శ్వాస విడిచారు. గుండెపోటు రావడంతో చెన్నైలో ఓ ప్రముఖ ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. 1952 అక్టోబర్ 16న జన్మించిన 'క్రేజీ' మోహన్ అసలు పేరు మోహన్ రంగాచారి. కాలేజీ రోజుల్లో నుంచే నాటకాలు రాసి, అందులో నటిస్తుండేవారు. అలా రాసిన 'గ్రేట్ బ్యాంక్ రోబరీ' స్కిట్‌కు ఉత్తమ రచయితగా, ఉత్తమనటుడు అవార్డ్‌ను కమల్‌హాసన్ చేతులమీదుగా అందుకున్నారు. ఆయన రాసిన మొదటి నాటకం 'క్రేజీ థీవ్స్ ఇన్ పాలవాక్కమ్'. ఈ నాటకం సూపర్ హిట్ అవ్వడమే కాకుండా మోహన్ రంగాచారిని, 'క్రేజీ' మోహన్‌గా మార్చింది. ఈ నాటకం ఆధారంగా ఓ టీవీ సీరియల్ కూడా స్టార్ట్ చేశారు. తమ్ముడు మధు బాలాజీ డ్రామా ట్రూప్‌కు ఎక్కువగా నాటకాలు రాసేవారు మోహన్. వేరే ప్రొడక్షన్స్ వాళ్లకు చాలా నాటకాలు రాసిన తర్వాత 1979లో సొంతంగా ఓ ప్రొడక్షన్ హౌస్‌ను స్థాపించి, దానికి 'క్రేజీ క్రియేషన్స్' అని నామకరణం చేశారు. 30కి పైగా నాటకాలు, 6,500 స్టేజిషోలు చేశారు. మోహన్ నాటకాల్లో వాళ్ల అన్నయ్య మధు బాలాజీ హీరోగా నటించేవారు. 'క్రేజీ' మోహన్ రచించిన 'మ్యారేజెస్ ఆర్ మేడిన్ సెలూన్' నాటకం ఆధారంగా కె. బాలచందర్ 'పోయికల్ కుదిరై' చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాతో డైలాగ్ రైటర్‌గా సినిమాల్లోకి ప్రవేశించారు మోహన్. ఆ తర్వాత తమిళంలో సూపర్ హిట్ కామెడీ సినిమాలకు తనవంతు మాటల సాయం చేశారాయన. 'క్రేజీ' మోహన్ ఎక్కువగా కమల్ హాసన్‌తో పని చేశారు. 'సతీ లీలావతి, కాదలా కాదలా (నవ్వండి లవ్వండి), మైఖేల్ మదన కామరాజు, విచిత్రసోదరులు, ఇంద్రన్ చంద్రన్ (ఇంద్రుడు–చంద్రుడు), భారతీయుడు, భామనే సత్యభామనే, తెనాలి, పంచతంత్రం, వసూల్ రాజా ఎంబీబీఎస్' వంటి సినిమాలకు కలసి పనిచేశారు. 'అరుణాచలం, రక్షకుడు' సినిమా చేశారు. నటుడిగా కమల్‌హాసన్ సినిమాల్లో చిన్న చిన్న పాత్రల్లోనూ మెరిశారు మోహన్. తమిళనాడు రాష్ట్రప్రభుత్వం 'క్రేజీ'మోహన్‌ను 'కలైమామణి' అవార్డుతో సత్కరించింది. ఆయన మృతికి పలువురు సినీప్రముఖులు సంతాపం తెలిపారు.



**"స్నేహానికి అంతం అనేదే ఉండదు. మనిషి బతికి ఉంటేనే స్నేహం ఉంటుందా? మోహన్ కామెడీ ఆయన సినిమాల ద్వారా ఆయన అభిమానులలో నిలిచే ఉంటుంది. మోహన్‌లోనాకు బాగా నచ్చే క్వాలిటీ ఆయన చిన్నపిల్లాడిలాంటి మనస్తత్వం. అందరికీ ఉండేది కాదది. 'క్రేజీ' అనే టైటిల్ అతనికి సూట్ కాదు. అతనో 'కామెడీ జీనియస్" అని పేర్కొన్నారు కమల్ హాసన్.**



● కమల్ హాసన్, మోహన్

# మా ఇద్దరి విజన్ ఒక్కటే

"మన లక్ష్యం మంచిది అయినా వెళ్లేదారి కరెక్ట్‌గా ఉన్నప్పుడే దేవుడి ఆశీస్సులు ఉంటాయని చెప్పే చిత్రం 'వజ్ర కవచధర గోవింద'. ఈ సినిమా కథ వజ్రం చుట్టూ తిరుగుతుంది. గోవిందు అనే దొంగ తన ఊరికోసం ఏం చేశాడన్నదే కథ. దీనికితోడు గోవింద అన్నది దేవుడి పేరు కావడంతో 'వజ్ర కవచధర గోవింద' అనే టైటిల్ పెట్టాం'' అని డైరెక్టర్ అరుణ్ పవార్ అన్నారు. సప్తగిరి, వైభవీ జోషీ జంటగా నటించిన చిత్రం 'వజ్ర కవచధర గోవింద'. 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' ఫేమ్ అరుణ్ పవార్ దర్శకత్వం వహించారు. నరేంద్ర యడ్ల, జీవీఎన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమాని డిస్ట్రిబ్యూటర్ బ్రహ్మయ్య ఈనెల 14న విడుదల చేస్తున్నారు. అరుణ్‌పవార్ మాట్లాడుతూ– ''మాది నెల్లూరు.. ఇంటర్ తర్వాత హైదరాబాద్ వచ్చి విజువల్ ఎఫెక్ట్స్ కోర్సు చేశా. డైరెక్టర్ త్రివిక్రమ్‌గారి వద్ద 'అతడు' చిత్రం నుంచి 'అ..ఆ' సినిమా వరకూ విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో పనిచేశా. దర్శకత్వంపై ఇష్టంతో 'బెస్ట్ యాక్టర్స్' సినిమాని తీశా. అది అనుకున్నంత హిట్ అవలేదు. ఆ తర్వాత తీసిన 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' మంచి హిట్ అయింది. అందుకే ఈ చిత్రాన్ని నా తొలి సినిమాగా భావిస్తా. నేను ఏ డైరెక్టర్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేయలేదు. పదేళ్లలో దాదాపు 100 సినిమాలకు విజువల్ ఎఫెక్ట్స్ చేశా. షూటింగ్‌టైమ్‌లో డైరెక్టర్స్‌తో కలిసి ఉండటంతో మేకింగ్, డైరెక్షన్‌పై అవగాహన ఉంది. నేను చేసిన ఓ షార్ట్ ఫిల్మ్ నచ్చిన త్రివిక్రమ్‌గారు భవిష్యత్తులో మంచి డైరెక్టర్ అవుతావన్నారు. అంతేకాదు.. మేకింగ్ టెక్నిక్స్, కథలు రాసుకోవడం ఎలాగో చెప్పారాయన. పైగా మా ఇద్దరి విజన్ ఒక్కటే. అందుకే నా గురువుగా ఆయన్ని భావిస్తాను. వినోదాత్మకంగా రూపొందిన 'వజ్ర కవచధర గోవింద' చిత్రంలో భావోద్వేగ సన్నివేశాలు కూడా ఉన్నాయి. విజువల్ ఎఫెక్ట్స్ అన్నవి ఓ హాబీలా చేస్తా. విజువల్ ఎఫెక్ట్స్ కంటే డైరెక్షన్ మోస్ట్ చాలెంజింగ్ విజన్ అనుకుంటున్నా. ఓ ప్రేమ కథ రెడీ చేశా. డైరెక్టర్ బాబీగారు ఆ సినిమా నిర్మిస్తారు. ఇందులో సాయిధరమ్ తేజ్ హీరో అనుకుంటున్నాం'' అన్నారు.



● అరుణ్ పవార్

# యాక్షన్ ఎంటర్‌టైనర్



● మధుబాల, సురేశ్

తమిళ, మలయాళ భాషల్లో యాక్షన్ హీరోగా చేసిన ఆర్.కె.సురేశ్ 'శివలింగాపురం' చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయమవుతున్నారు. తోట కృష్ణ దర్శకత్వంలో రావూరి అల్లికేశ్వరి సమర్పణలో రావూరి వెంకటస్వామి ఈ చిత్రాన్ని నిర్మించారు. మధుబాల కథానాయిక. ఈ సినిమా ఆడియో, ట్రైలర్ విడుదల కార్యక్రమంలో నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ –''అభిరుచితో ఆయన తీసిన ఈ చిత్రం విజయవంతం కావాలి'' అన్నారు. ''గతంలో లిటిల్ హార్ట్స్, మా తల్లి గంగమ్మ, కొక్కొరోకో' వంటి సినిమాలు తీశాను. మేము పెరిగిన లొకేషన్‌లో ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలను చిత్రీకరించాం. ఈ నెలాఖరులో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు వెంకటస్వామి. ''గ్రామీణ నేపథ్యంలో యాక్షన్, ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని మలిచాను. అన్న, చెల్లెలి సెంటిమెంట్ హైలైట్ అవుతుంది''అన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి రామసత్యనారాయణ, టి.ప్రసన్నకుమార్, మోహన్ వడ్లపట్ల, సాయివెంకట్, రాకేష్ రెడ్డి, పద్మిని నాగులపల్లి, డి.ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.



● 'షకలక' శంకర్

# సమాజానికి కేడీ సందేశం

హాస్య నటుడిగా ప్రేక్షకులను అలరించిన షకలక శంకర్ 'శంభో శంకర' చిత్రంతో హీరోగా మారారు. ఆ సినిమాతో మంచి గుర్తింపు, ఓపెనింగ్స్ రాబట్టుకున్న శంకర్ నటించిన తాజా చిత్రం 'నేనే కేడీ నెం–1'. ఆర్ ఏ ఆర్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై ఎండి రవూఫ్ సమర్పణలో జాని స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ముస్కాన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుని, సెన్సార్ జరుపుకుంటోంది. ఈ నెల చివరి వారంలో సినిమాని విడుదల చేస్తున్నారు. దర్శక–నిర్మాత జాని మాట్లాడుతూ– ''మంచి ఎంటర్‌టైనర్‌తో వస్తున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. ప్రస్తుత సమాజంలో పిల్లలు చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారంటే దానికి కారణం తల్లిదండ్రులు కూడా. నేటి బిజీలైఫ్‌లో పిల్లలను పట్టించుకోకుండా, బాధ్యతలు తెలపకుండా పూర్తి స్వేచ్ఛ ఇచ్చి, గాలికి వదిలేస్తున్నారు. ఈ క్రమంలో యువత పెడదోవ పడుతోంది అనే అంశాన్ని మా సినిమాలో చూపించాం. తల్లిదండ్రులతోపాటు పిల్లలు చూడాల్సిన సినిమా ఇది. ప్రేక్షకులకు కావాల్సిన వాణిజ్య అంశాలన్నీ జోడించాం. ముస్కాన్ అందం, అభినయం, ముకుల్ దేవ్, పృథ్వీ పాత్రలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి'' అన్నారు. పూజా, పి.డి.రాజు, కరాటే కళ్యాణి, రామ్ జగన్, రాజేందర్, నాగ మహేష్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: అజయ్ పట్నాయక్, కెమెరా: శ్రావణ్ కుమార్.







సాక్షి భవిత
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com
స్పర్ధయా వర్ధతే విద్య
మంగళవారం
11-6-2019

## విద్య, ఉద్యోగ సమాచారం

### రెప్కో బ్యాంక్‌లో 40 ఖాళీలు

చెన్నై (టీ-నగర్)లోని భారత ప్రభుత్వ రంగ సంస్థకి చెందిన రెప్కో బ్యాంక్ 40 జూనియర్ అసిస్టెంట్/క్లర్క్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.




- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి ఏదైనా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత.
- **వయసు:** 2019, ఏప్రిల్ 30 నాటికి 21–28 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; పీడబ్ల్యూడీలకు పదేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్ ద్వారా ఎంపిక జరుగుతుంది.
- **పని ప్రదేశం:** చెన్నై.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీలకు రూ.400; మిగిలిన వారికి రూ.700.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జూన్ 20, 2019.
- **ఆన్‌లైన్ పరీక్షతేదీ:** జులై 7, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.repcobank.com

### ఎంఈటీఐలో ప్రవేశాలు

కేరళ (కొచ్చి)లోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నడిచే మెరైన్ ఇంజనీరింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎంఈటీఐ).. మెరైన్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్ (జూనియర్ మెరైన్ ఇంజనీర్) కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ప్రతి ఏడాది రెండు బ్యాచుల్లో (జనవరి, ఆగస్టు) ఈ కోర్సు నిర్వహిస్తారు.

Marine Engineering Training Institute
Cochin Shipyard Ltd

- **కాల వ్యవధి:** ఏడాది.
- **సీట్లు:** 32.
- **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఇంజనీరింగ్ (మెకానికల్/మెకానికల్ అండ్ ఆటోమేషన్/నేవల్ ఆర్కిటెక్చర్) డిగ్రీ ఉత్తీర్ణత. పదో తరగతి లేదా ఇంటర్మీడియట్‌లో ఇంగ్లిష్ సబ్జెక్టులో 50 శాతం మార్కులు వచ్చి ఉండాలి.
- **వయసు:** 28 ఏళ్లకు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జులై 1, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://cochinshipyard.com

### ఎస్‌సీసీఎల్‌లో 4 ఖాళీలు

కొత్తగూడెం (భద్రాద్రి జిల్లా)లోని ప్రభుత్వ రంగ సంస్థ అయిన ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 4 ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ONE FAMILY. ONE VISION. ONE MISSION
THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
SCCL

- **విభాగాల వారీ ఖాళీలు:** జనరల్ మేనేజర్-1, డిప్యూటీ జనరల్ మేనేజర్ (సేఫ్టీ)-1, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఆష్ హ్యాండ్లింగ్ ప్లాంట్)-1, సూపరింటెండెంట్-1.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 2019, మార్చి 31 నాటికి 42–52 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ:** జూన్ 17, 2019.
- **హార్డ్‌కాపీలు పంపడానికి చివరితేదీ:** జూన్ 24, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://scclmines.com

సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్లో..
- ఎస్‌బీఐ క్లరికల్, పీవో మెటీరియల్
- జనరల్ స్టడీస్ మోడల్ పేపర్లు
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి
Google Play
App Store




# బీఈడీకి పూర్వవైభవం!

**బీఈడీ కోర్సు.. తెలుగు రాష్ట్రాల్లో పూర్వవైభవాన్ని తిరిగి పొందుతోందా! గత కొన్నేళ్లుగా వన్నె కోల్పోయిన బీఈడీ.. ఇప్పుడు టీచర్ పోస్టు ఔత్సాహిక అభ్యర్థులను అమితంగా ఆకర్షిస్తోందా..! అంటే.. అవుననే సమాధానం వినిపిస్తోంది!! గతంలో బీఈడీ ప్రవేశ పరీక్షకు లక్షకుపైగా దరఖాస్తులు వచ్చేవి. గత కొన్నేళ్లుగా దరఖాస్తుల సంఖ్య తగ్గుతూ వస్తున్న సంగతి తెలిసిందే. కానీ, అనూహ్యంగా ఈ ఏడాది బీఈడీ ఎంట్రెన్స్ టెస్టు ఎడ్‌సెట్‌కు దరఖాస్తుల సంఖ్య పెరిగింది. ఇది స్కూల్ టీచర్ కెరీర్ పట్ల యువతలో క్రేజ్ పెరుగుతోందనడానికి నిదర్శనం అంటున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో బీఈడీ పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెరగడానికి కారణాలతోపాటు బీఈడీతో టీచింగ్ కెరీర్ గురించి తెలుసుకుందాం..**

డిగ్రీ పూర్తయ్యాక ఎంబీఏ, ఎంసీఏ, ఇతర వృత్తి విద్య కోర్సుల వైపు గ్రాడ్యుయేట్లు అడుగులు వేస్తున్నారు. ఇది ఇప్పటి మాట. కానీ, గతంలో డిగ్రీ పూర్తిచేసిన వారిలో చాలామంది విద్యార్థులు బీఈడీలో చేరేందుకు మొగ్గు చూపేవారు. ఏడాది కాల వ్యవధి ఉన్న కోర్సు కావడం, 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బోధించే అవకాశం ఉండటం వల్ల అన్ని నేపథ్యాల విద్యార్థులు బీఈడీలో చేరేవారు. అంతేకాకుండా గతంలో క్రమం తప్పకుండా డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడుతుండటంతో బీఈడీ పూర్తిచేయడం ద్వారా ప్రభుత్వ రంగంలో టీచర్ ఉద్యోగం(ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్) సొంతం చేసుకునే వీలుండేది.

### ఇదీ నేపథ్యం

బీఈడీ కరిక్యులంలో చైల్డ్ సైకాలజీ లేదని.. కాబట్టి బీఈడీ అభ్యర్థులు చిన్న పిల్లలకు బోధించేందుకు అర్హులు కాదంటూ డీఈడీ అభ్యర్థుల సంఘం 2008లో సుప్రీంకోర్టుకెళ్లింది. 1 నుంచి 5వ తరగతి వరకు బోధించే ఎస్‌జీటీ పోస్టులకు డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈడీ) అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొనాలంటూ కోర్టును కోరింది. దీనిపై 2010లో సుప్రీంకోర్టు తీర్పు చెబుతూ.. ఎస్‌జీటీ పోస్టులకు డీఈడీ అభ్యర్థులే అర్హులని, బీఈడీ ఉత్తీర్ణులు అర్హులు కాదని పేర్కొంది. ఈ మేరకు నిబంధనల్లో మార్పులు చేస్తూ జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి(ఎన్‌సీటీఈ)గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. నాటి నుంచి తెలుగు రాష్ట్రాల్లో చేపట్టిన టీచర్ నియామకాల్లో ఎస్‌జీటీ పోస్టుల్లో బీఈడీ అభ్యర్థులకు అర్హత లేకుండా పోయింది. కేవలం ఎస్‌ఏ పోస్టులకే పోటీపడ్డారు. ఎస్‌ఏ పోస్టుల సంఖ్య తక్కువగా ఉండేది. ఫలితంగా ప్రభుత్వ రంగంలో బీఈడీ అభ్యర్థులకు అవకాశాలు పరిమితమయ్యాయి. దాంతో వారు తమను ఎస్‌జీటీ పోస్టులకు తిరిగి పరిగణించాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చారు. ఈ నేపథ్యంతో కేంద్రం బీఈడీ అభ్యర్థులకు ఎస్‌జీటీ పోస్టులకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

### ఉపాధ్యాయుల కొరత

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల విద్యపై దృష్టిసారించడంతో ప్రభుత్వ రంగంలో భారీ సంఖ్యలో స్కూళ్లు ఏర్పాటవుతున్నాయి. వీటిలో ఉపాధ్యాయుల కొరత నెలకొంది. ఇప్పటికే ఏర్పాటైన ప్రభుత్వ స్కూళ్లు అరకొర బోధన సిబ్బందితో నెట్టుకొస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ బడుల్లో పెద్దసంఖ్యలో ఉపాధ్యాయుల అవసరం ఉంది. మరోవైపు ప్రైవేటు రంగంలో పట్టణాలు, నగరాలు, పల్లెలు అని తేడా లేకుండా.. ప్రతిచోటా ప్రైవేటు పాఠశాలలు వెలుస్తున్నాయి. ముఖ్యంగా పట్టణాల్లో, నగర శివార్లల్లో పేరొందిన కార్పొరేట్ పాఠశాలలు తమ శాఖలను విస్తరిస్తున్నాయి. వీటిలో నైపుణ్యాలు కలిగిన టీచర్లకు మంచి డిమాండ్ ఉంది. ప్రైవేటు కార్పొరేట్ స్కూళ్లు, ఇంటర్నేషనల్ స్కూళ్లలో టీచర్లకు ఉజ్వల ఉపాధి అవకాశాలు లభించే అవకాశముంది.

### ఆకర్షణీయ వేతనాలు

'బతకలేక బడి పంతులు' ఇది గత నానుడి. గతంలో టీచర్లు చాలీచాలని జీతాలతో ఎదుగూబొదుగూ లేకుండా నెట్టుకొచ్చే పరిస్థితి ఉండేది. కానీ టీచింగ్ ఇప్పుడు క్రేజీ కెరీర్‌గా మారుతోంది. ప్రభుత్వ రంగంలో స్కూల్ టీచర్లకు ఆకర్షణీయ వేతనాలు లభిస్తున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రారంభ వేతనం రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఉంటుంది. అదనంగా పీఎఫ్, ఇన్సూరెన్స్, పెన్షన్ వంటి సదుపాయాలు ఉంటాయి.

- ప్రైవేటు రంగంలో మధ్య తరగతి స్కూళ్లల్లో టీచర్లకు ప్రారంభంలో నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం అందుతోంది. కార్పొరేటు స్కూళ్లలో రూ.30వేలకు పైగా జీతం లభిస్తోంది. దీంతోపాటు అదనంగా అలవెన్సులు కూడా అందుతాయి. అన్నీ కలుపుకొని ప్రముఖ ప్రైవేటు స్కూళ్లల్లో నైపుణ్యాలున్న టీచర్లు రూ.లక్ష వరకు అందుకుంటున్నారంటే ఆశ్చర్యంలేదు. ఇక ఇంటర్నేషనల్ స్కూళ్లలో ప్రారంభ వేతనం రూ.40వేల నుంచి రూ.50వేలకు తగ్గకుండా ఉంటుంది. ఇతర అలవెన్సులు అదనం.

### అవకాశాలు.. కెరీర్ గమనం

- స్కూల్ టీచర్ కొలువులో చేరిన వారికి ఉజ్వల కెరీర్ అవకాశాలు ఉంటాయని చెప్పొచ్చు. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా చేరి ఎస్‌జీటీ/ఎస్‌ఏగా కెరీర్ ప్రారంభించవచ్చు. సీనియారిటీతో మండల విద్యాధికారి, ఆపై స్థాయికి చేరుకోవచ్చు. పీజీ పూర్తిచేస్తే జూనియర్ లెక్చరర్ స్థాయి అందుకోవచ్చు.
- ఉపాధ్యాయ కోర్సును పూర్తిచేయడంతోపాటు రాష్ట్రస్థాయిలో టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్), కేంద్ర ప్రభుత్వ పాఠశాలలైన.. కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాలు మొదలైన వాటిలో ఉద్యోగాలు పొందడానికి సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటీఈటీ) స్కోర్ తప్పనిసరి.
- ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్, లాంగ్వేజ్ పండిట్స్, స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగాల్లో పనిచేసే టీచర్లు కూడా ఉంటారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు అండర్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పూర్తిచేసి ఉండాలి. దీనికి ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హత ఉన్న వారు అర్హులు. అలానే బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో చేరేందుకు ఏదైనా గ్రాడ్యుయేషన్ చేసిన వారు అర్హులు.
- తెలుగు, హిందీ, సంస్కృతం సబ్జెక్టులను బోధించడానికి లాంగ్వేజ్ పండిట్లు అవసరం. లాంగ్వేజ్ పండిట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ రాసి పండిట్ కోర్సులు చేయవచ్చు.
- మానసిక, శారీరక వైకల్యంతో బాధపడుతున్న చిన్నారులకు అవసరమయ్యే బోధనా పద్ధతుల్లో శిక్షణనిచ్చేదే..స్పెషల్ ఎడ్యుకేషన్. మెంటల్ రిటార్డేషన్, హియరింగ్, విజువల్ ఆటిజం, ఇంపెయిర్‌మెంట్, లెర్నింగ్ డిజెబిలిటీ విభాగాల్లో డీఈడీ, బీఈడీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

### పెరిగిన దరఖాస్తులు

2014కు ముందు డిగ్రీ తర్వాత బీఈడీ ఏడాది కోర్సుగానే ఉండేది. ఎన్‌సీటీఈ 2014లో బీఈడీని రెండేళ్ల కోర్సుగా మార్చింది. దీనివల్ల కూడా డిమాండ్ తగ్గిందని చెప్పొచ్చు. గతంలో బీఈడీలో చేరేందుకు ఏటా లక్ష మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే వారు. ఆ సంఖ్య కాస్తా క్రమంగా తగ్గుతూ వచ్చింది. 2018–19లో బీఈడీలో ప్రవేశాల కోసం తెలంగాణలో ఎడ్‌సెట్‌కు 38,694 వేల మంది మాత్రమే హాజరయ్యారు. కానీ ఈ ఏడాది ఆ సంఖ్య గణనీయంగా 52,380కు పెరిగింది.

ఆంధ్రప్రదేశ్‌లో గతేడాది 8,697 మంది దరఖాస్తు చేసుకోగా 7,679 మంది పరీక్షకు హాజరయ్యారు. అయితే ఈ ఏడాది దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 14,019కు పెరిగింది. వీరిలో 11,650 మంది పరీక్షకు హాజరయ్యారు.

### టీచర్ కావాలంటే..

- ఇంటర్మీడియట్/డిగ్రీ తర్వాత ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించేందుకు వీలుకల్పించే డీఈడీ, బీఈడీ వంటి టీచర్ ట్రైనింగ్ కోర్సుల్లో చేరొచ్చు.
- ఇంటర్ అర్హతతో ప్రవేశ పరీక్ష రాసి, డీఈడీ కోర్సు పూర్తిచేసిన వారు ప్రాథమిక తరగతులకు బోధించవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో డీఎస్సీ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌జీటీ పోస్టు దక్కించుకోవచ్చు.
- డిగ్రీ తర్వాత ఎడ్‌సెట్ రాసి బీఈడీ కోర్సు చదివిన వారు పదో తరగతి వరకు పాఠాలు బోధించవచ్చు. సర్కారీ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌గా స్థిరపడొచ్చు.

### రాణించాలంటే..

- టీచర్ వృత్తిలో రాణించాలంటే.. ప్రధానంగా సబ్జెక్టు పరిజ్ఞానం ఉండాలి. నిత్యం నేర్చుకుంటూ విద్యార్థులకు బోధిస్తుండాలి. ఉపాధ్యాయుడు నిత్యవిద్యార్థిగా మారాలి. ప్రధానంగా ఇంగ్లిష్ మీడియంలో బోధించ గలిగే నైపుణ్యం ఉన్న అభ్యర్థులకు ప్రైవేటు రంగంలో మెరుగైన అవకాశాలు లభిస్తున్నాయి. తెలుగు మీడియం నేపథ్యంతో వచ్చే అభ్యర్థులు సైతం భాషా నైపుణ్యాలు మెరుగుపరచుకొని రాణించవచ్చు. చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్, భాషా నైపుణ్యాలు, సబ్జెక్టుపై పట్టు, ఓర్పు, సహనం, కొత్త విషయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస, సానుకూల దృక్పథం, సమయస్ఫూర్తి, ప్రజెంటేషన్ స్కిల్స్ ఉన్న టీచర్లకు అవకాశాలు, జీతాలు మెరుగ్గా ఉంటాయి.



# సీఏ-సీపీటీలో విజయానికి..

**చార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ) కోర్సు తొలిదశ పరీక్ష సీఏ-సీపీటీ జూన్ 16న జరగనుంది. విద్యార్థుల సుదీర్ఘ ప్రణాళికాయుత సన్నద్ధత చివరి దశకు చేరింది. సీపీటీ విధానంలో నిర్వహించే తుది పరీక్ష ఇదే కాబట్టి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ నేపథ్యంలో తుదిదశ సన్నద్ధతకు ఉపయోగపడేలా సూచనలు..**




2019, జూన్ 16న ఉదయం అకౌంట్స్, మర్కంటైల్ లా సబ్జెక్టులకు మధ్యాహ్నం ఎకనామిక్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ సబ్జెక్టులకు పరీక్ష జరుగుతుంది. మొత్తం 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఇప్పటి వరకు ప్రిపరేషన్‌కు ఏ మెటీరియల్‌ను ఉపయోగించారో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో రివిజన్‌కు కూడా అదే మెటీరియల్‌ను వినియోగించాలి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) మెటీరియల్‌ను ప్రామాణికంగా తీసుకోవాలి.

- మర్కంటైల్ లా, అకౌంట్స్ సబ్జెక్టులు చాలా ముఖ్యమైనవి. వీటిపై పూర్తిస్థాయిలో పట్టుసాధించడం ద్వారా సీపీటీని దిగ్విజయంగా పూర్తిచేయొచ్చు.
- రోజుకు కనీసం పది గంటలను రివిజన్‌కు కేటాయించాలి. బాగా తెలిసిన ఎంసీక్యూలను కొట్టేస్తూ ప్రిపరేషన్ కొనసాగించాలి. దీనివల్ల ఆ ఎంసీక్యూస్‌ను మళ్లీ చదవాల్సిన అవసరం ఉండదు. ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుంది.
- భావనలను అర్థం చేసుకుంటూ ఎంసీక్యూస్ చదవాలి. అంతేతప్ప బట్టీపట్టకూడదు. సబ్జెక్టు పరంగా ఏవైనా సందేహాలుంటే తప్పనిసరిగా నిపుణుల సహాయంతో నివృత్తి చేసుకోవాలి.
- సీపీటీలో ఉత్తీర్ణత సాధించాలంటే 200 మార్కులకు 100 మార్కులు సాధించడంతో పాటు ప్రతి సబ్జెక్టులో 30 శాతం మార్కులు తెచ్చుకోవాలి. దీన్ని దృష్టిలో ఉంచుకొని రివిజన్‌లో అన్ని సబ్జెక్టులకు ప్రాధాన్యమివ్వాలి.
- ప్రిపరేషన్ సమయంలో ఉపయోగించిన క్యాలిక్యులేటర్‌నే అసలు పరీక్షకు తీసుకెళ్లాలి. రోజుకు కనీసం అరగంటైనా క్యాలిక్యులేటర్ స్పీడ్ టైపింగ్‌ను ప్రాక్టీస్ చేయాలి. పరీక్షలో ఎలక్ట్రానిక్ క్యాలిక్యులేటర్‌ను ఉపయోగించకూడదు.

## సబ్జెక్టుల వారీ ముఖ్యాంశాలు

### అకౌంట్స్

- అకౌంట్స్ సబ్జెక్టు సీపీటీలో ప్రారంభమై ఫైనల్ వరకు ప్రతి దశలోనూ ఉంటుంది. అందువల్ల ప్రతి అంశాన్ని క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. సీపీటీలో అధిక మార్కులు పొందేందుకు అవకాశమున్న సబ్జెక్టు ఇది.
- అకౌంట్స్‌లో జర్నల్ ఎంట్రీస్ చాలా ముఖ్యమైనవి. ప్రతి చాప్టర్‌లోనూ జర్నల్ ఎంట్రీస్ ఉంటాయి. ఈ సబ్జెక్టులోని ఏ అంశాన్నీ బట్టీపట్టకూడదు. ప్రతి అంశంపై తార్కిక ఆలోచనా దృక్పథం అలవరచుకోవాలి.
- ఇప్పటికే జర్నల్ ఎంట్రీస్‌ను ఒక పుస్తకంలో రాసుకున్నట్లయితే వాటిని పునశ్చరణ చేయాలి.
- అకౌంట్స్‌లో పార్టనర్‌షిప్ అకౌంట్స్, కంపెనీ అకౌంట్స్ అండ్ అకౌంటింగ్ యాన్ ఇంట్రడక్షన్, ఫైనల్ అకౌంట్స్, కన్‌సైన్‌మెంట్ అకౌంట్స్ ముఖ్యమైనవి.

### మర్కంటైల్ లా

- ఇంటర్మీడియెట్‌లో ఏ గ్రూపు చదివిన వారికైనా ఇది కొత్త సబ్జెక్టే. పరీక్షలో ఈ సబ్జెక్టు నుంచి ప్రతి ప్రశ్నా డొంకతిరుగుడు లేకుండా నేరుగా వస్తుంది.
- సబ్జెక్టులోని ప్రతి అంశానికి సంబంధించి అర్థవివరణ నైపుణ్యం పెంచుకోవాలి. ఇది వివాదాలతో కూడుకున్న సబ్జెక్టు కాబట్టి ప్రతి ఎంసీక్యూను లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉండదు.
- సీపీటీ పరిధిలో సెక్షన్ నంబర్లు, కేస్‌స్టడీస్, ఆథర్ పేర్లు, నిర్వచనాలను గుర్తుంచుకోవాల్సిన అవసరం లేదు.
- **identify the correct/the correct/incorrect/ all of the above/none of the above questions** ఉంటాయి. వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి.
- ఇందులో ఇండియన్ పార్టనర్‌షిప్ యాక్ట్, సేల్ ఆఫ్ గూడ్స్ యాక్ట్ ముఖ్యమైనవి.
- కొంచెం శ్రమిస్తే మర్కంటైల్ లాలో 40 మార్కులకు 32–35 మార్కులను తేలిగ్గా సాధించొచ్చు.

### ఎకనామిక్స్

- ఎకనామిక్స్ సబ్జెక్టును రెండు భాగాలుగా విభజించొచ్చు. అవి..1. మైక్రో ఎకనామిక్స్; 2. మ్యాక్రో ఎకనామిక్స్.
- పాత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే ఈ సబ్జెక్టు నుంచి వస్తున్న ప్రశ్నల్లో 15–20 ప్రశ్నలు తేలిగ్గా, నేరుగా వస్తున్నట్లు అర్థమవుతోంది.
- ఇందులోని అన్ని చాప్టర్లకు సమాన ప్రాధాన్యమివ్వాలి. డయాగ్రమ్స్, డెఫినిషన్స్, ఆథర్ పేర్లను గుర్తుంచుకోవాల్సిన అవసరం లేదు.
- మైక్రో ఎకనామిక్స్‌లో ప్రాబ్లమ్స్‌ను ఒకటికి రెండుసార్లు చదివి, అర్థం చేసుకొని సమాధానం గుర్తించాలి. మైక్రో ఎకనామిక్స్‌లోని డయాగ్రమ్స్‌ను విశ్లేషించగలగాలి.
- మ్యాక్రో ఎకనామిక్స్‌లో ఫ్యాక్ట్స్, ఫిగర్స్ (సంవత్సరాలు, శాతాలకు సంబంధించిన సమాచారం) చాలా ముఖ్యమైనవి.
- మైక్రో ఎకనామిక్స్‌లో థియరీ ఆఫ్ కన్స్యూమర్ బిహేవియర్, కాస్ట్ అనాలిసిస్, ప్రొడక్షన్ అనాలిసిస్, ప్రైస్ అండ్ అవుట్‌పుట్ డిటర్మినిషన్ ముఖ్యమైనవి.

### క్వాంటిటేటివ్ మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్

- మ్యాథమెటిక్స్‌లోని ఫార్ములాలు చాలా ముఖ్యమైనవి. సీఈసీ విద్యార్థులు ఎంసీక్యూస్‌ను ఎక్కువసార్లు ప్రాక్టీస్ చేయాలి. అన్ని చాప్టర్లకు సమాన ప్రాధాన్యమివ్వాలి.
- ప్రతి చాప్టర్‌లోని సమస్యలను ప్రాక్టీస్ చేశాక, ఆ సమస్యలకు సంబంధించిన సూత్రాలను ఒకటికి రెండుసార్లు చూడకుండా రాయాలి.
- లిమిట్స్, డెరివేటివ్స్, ఇంటిగ్రేషన్స్, పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, రేషియో అండ్ ప్రపోర్షన్స్, మ్యాథమెటిక్స్ ఆఫ్ ఫైనాన్స్ ముఖ్యమైన అంశాలు.
- స్టాటిస్టిక్స్‌లోని ఫార్ములాలు దగ్గరి పోలికలు కలిగి ఉంటాయి. అందువల్ల సూత్రాల మధ్య వైవిధ్యాన్ని గుర్తించాలంటే తప్పనిసరిగా ఎక్కువసార్లు పునశ్చరణ చేయాలి. స్టాటిస్టిక్స్‌లో సమస్యలతో పాటు సైద్ధాంతిక అంశాలకు కూడా ప్రాధాన్యమివ్వాలి. 35–45 శాతం ఎంసీక్యూలు థియరీ నుంచి వచ్చేందుకు అవకాశముంది.
- స్టాటిస్టిక్స్‌లో ప్రాబబిలిటీ, థియరిటికల్ డిస్ట్రిబ్యూషన్స్, శాంప్లింగ్, స్టాటిస్టికల్ డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ డేటా చాప్టర్లు ముఖ్యమైనవి.
- మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్‌లో అత్యధిక వెయిటేజీ ఉన్న చాప్టర్లకు ఎక్కువ సమయం కేటాయించాలి.

### మోడల్ టెస్ట్‌లతో మేలు

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో మోడల్ పరీక్షలు రాయాలి. కనీసం పది మోడల్ టెస్ట్‌లు రాయడం వల్ల పూర్తిస్థాయి సన్నద్ధత లభిస్తుంది. ఈ పరీక్షల ద్వారా తప్పులను సరిదిద్దుకునే అవకాశం లభిస్తుంది. మైండ్‌మ్యాప్స్‌ను రూపొందించుకొని పునశ్చరణకు ఉపయోగించుకోవాలి. గత ప్రశ్నపత్రాలను లోతుగా, వ్యూహాత్మకంగా పరిశీలిస్తే ఎలాంటి ప్రశ్నలు వస్తున్నాయనేది అర్థమవుతుంది. నిరంతర ప్రాక్టీస్‌తోనే సమస్యలకు సరైన సమాధానాలు గుర్తించగలరు. అందువల్ల ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి.

– సాయికృష్ణ, సీఏ-సీపీటీలో 197 మార్కులు సాధించిన విద్యార్థి.

### ఒత్తిడిని దరిచేరనీయొద్దు



రివిజన్ సమయంలో ఒత్తిడిని దరిచేరనీయొద్దు. మెడిటేషన్ ద్వారా మానసిక సామర్థ్యం పెంపొందుతుంది. ఈ సమయంలో పునశ్చరణకు ఎంత ప్రాధాన్యమిస్తారో అంతేస్థాయిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపైనా దృష్టిసారించాలి. తేలికపాటి ఆహారం తీసుకోవాలి. తగినంత విశ్రాంతి కూడా అవసరం. మాక్ టెస్ట్‌లు రాయడం వల్ల సమయపాలన అలవడుతుంది. విజయానికి దగ్గరి దారులుండవు. నిజాయితీతో కూడిన కష్టమే మంచి ఫలితాలనిస్తుంది.

– ఎం.ఎస్.ఎస్.ప్రకాశ్, డైరెక్టర్, మాస్టర్‌మైండ్స్.

## వ్యక్తిగత జీవితం...

తండ్రి యోగ్‌రాజ్, తల్లి షబ్నమ్ విడాకులు తీసుకొని విడిపోయినా యువరాజ్ వారిద్దరికీ ఎప్పుడూ దూరం కాలేదు. తల్లితోనే ఉండిపోవాలని నిర్ణయించుకున్న అతను తండ్రితోనూ సంబంధాలు కొనసాగించాడు. కొన్నిసార్లు యోగ్‌రాజ్ వివాదాస్పద వ్యాఖ్యలతో ఇబ్బందుల్లో పడ్డా... తనకు ఆటలో ఓనమాలు నేర్పిన తండ్రిని గౌరవిస్తూనే వచ్చాడు. 2015 ఐపీఎల్ సీజన్‌లో యువరాజ్‌పై ఢిల్లీ డేర్‌డెవిల్స్ రూ. 16 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసింది. ఇప్పటివరకు ఐపీఎల్‌లో ఇదే రికార్డుగా ఉంది. 2016లో నటి హాజల్ కీచ్‌తో యువీకి పెళ్ళయింది. బాల నటుడిగా రెండు పంజాబీ చిత్రాల్లో కూడా యువరాజ్ నటించాడు. 2012లో కేంద్ర ప్రభుత్వం నుంచి 'అర్జున అవార్డు'... 2014లో 'పద్మశ్రీ' పురస్కారాలు అందుకున్నాడు.


మీడియా సమావేశంలో భార్య హేజల్ కీచ్, తల్లి షబ్నమ్‌తో యువీ



# మైదానంలో 'మహారాజు'

సాక్షి క్రీడా విభాగం

2000 సంవత్సరం... మ్యాచ్ ఫిక్సింగ్ వివాదంతో మసకబారిన భారత క్రికెట్ ప్రతిష్టను మళ్లీ నిలబెట్టే ప్రయత్నం చేస్తున్న సమయం. కొత్త మిలీనియంలో కెప్టెన్‌గా సౌరవ్ గంగూలీ కొందరు సీనియర్లతో పాటు యువరక్తం నిండిన ఆటగాళ్లతో కలిసి టీమిండియాకు నవ్య దిశ చూపించాలని పట్టుదలగా ఉన్నాడు. అలాంటి సమయంలో అతనికి లభించిన ఒక మెరుపు యువరాజ్ సింగ్. కొన్నాళ్ల క్రితమే జరిగిన అండర్–19 ప్రపంచకప్‌లో చెలరేగి 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచిన ఆ కుర్రాడిని భారత సెలక్టర్లు ప్రతిష్టాత్మక చాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేశారు. తన తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్ అవకాశం రాని యువీ... పటిష్ట ఆస్ట్రేలియాతో జరిగిన తర్వాతి పోరులో 80 బంతుల్లోనే 84 పరుగులతో జట్టును గెలిపించి తన రాకను ఘనంగా చాటాడు. అది మొదలు తర్వాతి 17 ఏళ్ల పాటు యువరాజ్ బ్యాట్ గర్జించింది. వన్డేల్లో అనేకానేక అద్భుతాలు చేయడమే కాదు... అప్పుడప్పుడే అడుగులు నేర్చుకుంటున్న టి20 క్రికెట్‌లో కూడా బలమైన ముద్ర వేసింది. ఒకటా...రెండా... భారత జట్టు సాధించిన ఎన్నో చిరస్మరణీయ విజయాల్లో యువీ పోషించిన పాత్ర అసమానం.

భారత్ తరఫున ఒకే ఒక టెస్టు ఆడిన తండ్రి యోగ్‌రాజ్ సింగ్ తాను సాధించని ఘనతను కొడుకు ద్వారా అందుకోవాలని కలకన్నాడు. అందుకే జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్‌లో చాంపియన్‌గా నిలిచిన తర్వాత యువీ అందుకున్న పతకాన్ని బయటకు విసిరేసి క్రికెట్ మాత్రమే ఆడాలని హెచ్చరించాడు. నాడు తండ్రి ఆంతర్యం సరిగా అర్థం చేసుకోలేకపోయినా తర్వాత ఆటపై పెంచుకున్న మమకారం అతడితో చిన్న వయసు నుంచే అద్భుతాలు చేయించింది. అండర్–15 నుంచి ఏ వయసులో ఆడినా పరుగుల వరద పారించడం అలవాటుగా మారిపోయింది. బిహార్‌తో జరిగిన అండర్–19 కూచ్‌బెహర్ ట్రోఫీ మ్యాచ్‌లో పంజాబ్ తరఫున చెలరేగి చేసిన 358 పరుగుల ఇన్నింగ్స్‌తో యువరాజ్ పేరు దేశవాళీ క్రికెట్‌లో మారుమోగిపోయింది. ఆ తర్వాత యువీ మళ్లీ వెనుదిరిగి చూడాల్సిన అవసరం లేకపోయింది.

### తారాజువ్వలా....

టీమిండియాకు ఎంపికైన తర్వాత కొంత కాలం తన ముద్ర చూపిన యువీ రెండేళ్ల తర్వాత వరుస వైఫల్యాలతో జట్టులో స్థానం కోల్పోయాడు. అయితే పునరాగమనం తర్వాత 2002 నాట్‌వెస్ట్ టోర్నీ అతని కెరీర్‌ను తారాజువ్వలా పైకి లేపింది. 2003 ప్రపంచకప్‌లో సచిన్‌కు తోడుగా అర్ధ సెంచరీ చేసిన అతను... తన 71వ వన్డేలో గానీ మొదటి సెంచరీ సాధించలేకపోయాడు. 2004లో సిడ్నీ మైదానంలో ఆసీస్‌పై చెలరేగి 122 బంతుల్లో చేసిన 139 పరుగుల ఇన్నింగ్స్ అతని కెరీర్‌లో చెప్పుకోదగ్గ ప్రదర్శనల్లో ఒకటి. ఇక 2007లో జరిగిన తొలి టి20 ప్రపంచకప్‌లో యువీ ప్రదర్శన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో స్టువర్ట్ బ్రాడ్ ఓవర్లో ఆరు సిక్సర్లే కాదు... ఆసీస్‌తో జరిగిన సెమీఫైనల్లో 30 బంతుల్లో చేసిన 70 పరుగుల ఇన్నింగ్స్ అతని విలువేమిటో చూపించింది. 2010లో ఫామ్ కోల్పోవడం, క్రమశిక్షణ లోపం, ఫిట్‌నెస్ సమస్యలతో మళ్లీ అతనిపై వేటు పడినా... తక్కువ వ్యవధిలోనే తిరిగొచ్చాడు. 2011 వన్డే వరల్డ్ కప్ ప్రదర్శన యువరాజ్ కెరీర్‌లో కోహినూర్ వజ్రంగా నిలిచిపోయింది. బ్యాటింగ్‌కు తోడు అతని లెఫ్టార్మ్ స్పిన్ కూడా భారత్‌కు కీలక సమయాల్లో విజయాలు అందించింది.

### క్యాన్సర్‌తో పోరాడి...

ప్రపంచ కప్ గెలిచిన కొన్నాళ్లకే యువరాజ్‌కు క్యాన్సర్ ఉన్నట్లు బయటపడింది. జీవితంలో అతి పెద్ద పోరాటంగా భావిస్తూ చికిత్స పొంది కోలుకున్న అనంతరం యువీ మళ్లీ క్రికెట్ మైదానంలో అడుగు పెట్టడం ఒక అద్భుతం. అయితే కెరీర్‌లో ఉచ్ఛ స్థితిలో ఉన్న సమయంలో వచ్చిన క్యాన్సర్ తర్వాత అతని ఆట అంత గొప్పగా సాగలేదు. పోరాటానికి మారుపేరుగా నిలిచిన యువీ పలు మార్లు జట్టులోకి రావడం, పోవడం తరచుగా జరిగాయి. వన్డేల్లో ఇంగ్లండ్‌పై చేసిన 150 పరుగుల తన వ్యక్తిగత అత్యుత్తమ స్కోరు, టి20ల్లో ఆస్ట్రేలియాపై 35 బంతుల్లోనే 77 పరుగులు చేసిన ఇన్నింగ్స్ మినహా చెప్పుకోదగ్గ ప్రదర్శనలు రాలేదు. ఆ తర్వాత దేశవాళీలో ఎన్ని ప్రయత్నాలు చేసినా కొత్త క్రికెటర్ల రాకతో అతను మెల్లగా భారత జట్టుకు దూరమయ్యాడు. అయితే పరిమిత ఓవర్ల క్రికెట్‌లో యువీ రాజసం ఎప్పటికీ చెక్కుచెదరనిది అనడంలో సందేహమే లేదు.

# యువరాజ్ గుడ్‌బై

- రిటైర్మెంట్ ప్రకటించిన స్టార్ క్రికెటర్
- అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌కూ బైబై
- విదేశీ టి20 లీగ్‌లపై ఆసక్తి

**ముంబై:** భారత వన్డే క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న యువరాజ్ సింగ్ ఆటకు వీడ్కోలు పలికాడు. అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు ఐపీఎల్ నుంచి కూడా తప్పుకుంటున్నట్లు అతను వెల్లడించాడు. సోమవారం జరిగిన మీడియా సమావేశంలో తన రిటైర్మెంట్ గురించి ప్రకటన చేసిన 37 ఏళ్ల యువీ... ఇన్నేళ్ల సుదీర్ఘ కెరీర్, భవిష్యత్తు తదితర అంశాలపై వివరంగా మాట్లాడాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌కు ఆఖరి సారిగా ప్రాతినిధ్యం వహించిన యువరాజ్... జాతీయ జట్టు తరఫున రెండేళ్ల క్రితం 2017 జూన్‌లో ఆఖరి వన్డే ఆడాడు. 17 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో యువీ మూడు ఫార్మాట్‌లలో కలిపి 402 మ్యాచ్‌లలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. భారత జట్టులోకి పునరాగమనం చేసే అవకాశాలు దాదాపుగా లేకపోవడం, ఐపీఎల్‌లో కూడా అతనిపై ఫ్రాంచైజీలు ఆసక్తి చూపించకపోవడంతో ఇక తప్పుకోవడమే సరైనదిగా యువీ భావించాడు. 25 ఏళ్ల పాటు 22 గజాల క్రికెట్ పిచ్‌తో అనుబంధం కొనసాగించిన తర్వాత ఆటకు ముగింపు పలికేందుకు ఇది సరైన సమయంగా భావిస్తున్నట్లు యువరాజ్ చెప్పాడు. అయితే రిటైర్మెంట్ అనంతరం బీసీసీఐ అనుమతిస్తే ప్రపంచ వ్యాప్తంగా వేర్వేరు టి20 లీగ్‌లు ఆడాలనుకుంటున్నట్లు తన మనసులో మాటను వెల్లడించాడు. మీడియా సమావేశంలో యువరాజ్ వెంట అతని తల్లి షబ్నమ్, భార్య హాజల్ కీచ్ ఉన్నారు.

భారత్ తరఫున 400కు పైగా మ్యాచ్‌లు ఆడగలగడం నా అదృష్టం. నా కెరీర్ మొదలుపెట్టినప్పుడు ఇది సాధ్యమవుతుందని ఏనాడూ ఊహించలేదు. పడ్డ ప్రతీసారి పైకి లేవడం ఎలాగో నాకు క్రికెట్ నేర్పించింది. విజయాలకంటే అపజయాలు నన్ను ఎక్కువగా పలకరించినా నేనెప్పుడూ ఓటమిని ఒప్పుకోలేదు. దేశం కోసం ఆడే సమయంలో నేను ఉద్వేగంతో ఉప్పొంగి పోయేవాడిని. జట్టు కోసం నేను చేసిన ప్రతీ పరుగు, తీసిన వికెట్, ఆపిన పరుగులు అన్నీ గొప్పగానే అనిపిస్తాయి. 28 ఏళ్ల తర్వాత ప్రపంచకప్ గెలిచిన జట్టులో భాగమయ్యాను. అంతకు మించి ఇంకేం కావాలి. ఎలా రిటైర్ కావాలనే విషయంలో కొంత సందిగ్ధత నన్ను వెంటాడింది. ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ ఆడి టైటిల్ గెలిచాక రిటైర్ అయితే సంతృప్తిగా ఉంటుందని భావించా. అయితే తుది జట్టులో నాకు చోటు దక్కలేదు. జీవితంలో అన్నీ అనుకున్నట్లు జరగవు. సంవత్సరం క్రితమే ఈ ఏడాది ఐపీఎల్ తర్వాత తప్పుకోవాలని నిర్ణయించుకున్నా. ఇక ఆడింది చాలు అనిపించిన సమయం వచ్చేసింది. రిటైర్ అవడానికి ముందు సచిన్ సలహా తీసుకోవడంతో పాటు సహచరులు జహీర్, భజ్జీ, వీరూలకు చెప్పా. చాలా కాలం తర్వాత నాన్నతో కూడా సుదీర్ఘంగా మాట్లాడి నా నిర్ణయాన్ని చెప్పాను. ఇకపై ఆటను ఆస్వాదించేందుకే బయటి లీగ్‌లలో పాల్గొనాలనుకుంటున్నా.

-యువరాజ్

- 10 వేల పరుగులు పూర్తి చేయలేదనే బాధ ఏమాత్రం లేదు. దాని గురించి అసలు ఎప్పుడూ ఆలోచించనే లేదు. నాకు ప్రపంచ కప్ గెలవడం అనేది కల. నా దృష్టిలో 10 వేలకంటే ప్రపంచ కప్ గెలుపే మిన్న.
- నా తొలి కెప్టెన్ గంగూలీ చాలా అండగా నిలిచాడు. తన ఆటగాళ్ల కోసం అతను ఎప్పుడూ పోరాడేందుకు సిద్ధంగా ఉంటాడు. ధోనితో కలిసి ఎన్నో విజయాలు సాధించాం కాబట్టి అతని ప్రభావం కూడా నాపై చాలా ఉంది.
- నాలుగు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌లు, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ అవార్డు, 28 ఏళ్ల తర్వాత భారత్ ప్రపంచకప్ గెలవడం... నిస్సందేహంగా ఇంతకంటే మధుర క్షణం నా కెరీర్‌లోనే లేదు. శ్రీలంకపై 2014 టి20 ప్రపంచ కప్ ఫైనల్ అత్యంత బాధాకర సమయం. నా కెరీర్ అప్పుడే ముగిసిపోయిందని భావించా. నా పనైపోయిందని అందరూ నన్ను తేలిగ్గా తీసిపారేసిన క్షణమది.
- ముత్తయ్య మురళీధరన్, మెక్‌గ్రాత్‌ల బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో నేను ఎక్కువగా ఇబ్బంది పడ్డాను. విదేశీ ఆటగాళ్లలో బ్యాట్స్‌మన్‌గా పాంటింగ్‌ను అభిమానిస్తా.
- వివాదాస్పద అంశాల గురించి మాట్లాడేందుకు మున్ముందు చాలా సమయం ఉంది. ఇప్పుడు మన ఆటగాళ్లు ప్రపంచకప్ ఆడుతున్న సమయంలో ఎలాంటి వ్యాఖ్యలు చేయదల్చుకోలేదు.
- టెస్టుల్లో రాణించలేకపోయాననే నిరాశ మాత్రం ఉంది. నాటి దిగ్గజాల వరుసలో నాకు జట్టులో స్థానం దక్కడమే కష్టంగా ఉండేది. ఒక్క మ్యాచ్ ఆడి విఫలం కాగానే చోటు పోయేది. నేను చేయగలిగినదంతా చేశాను. మరో 40 టెస్టులైనా ఆడగలిగితే బాగుండేదేమో. టెస్టుల్లో సగటు కూడా కనీసం 40 ఉండాలని కోరుకున్నా సాధ్యం కాలేదు.

### 'ఫేర్‌వెల్ మ్యాచ్ వద్దన్నా'...

నాకు ఆఖరిసారిగా ఒక మ్యాచ్ ఆడే అవకాశం ఇవ్వమని బీసీసీఐలో ఎవరినీ అడగలేదు. ఆఖరి మ్యాచ్ అంటూ క్రికెట్ ఆడటం నాకు నచ్చదు. గతంలో ఒకసారి నేను యో యో టెస్టులో విఫలమైతే రిటైర్మెంట్ మ్యాచ్ ఏర్పాటు చేస్తామని నాతో చెప్పారు. అయితే నాకు అవసరం లేదన్నాను. యో యో టెస్టులో విఫలమైతే నేరుగా ఇంటికే వెళ్లిపోతానని చెప్పా. ఆ తర్వాత యో యో టెస్టు పాస్ అయి మిగతా విషయాలు వారికే వదిలేశా.

### మధుర జ్ఞాపకాలు...



**7 అక్టోబర్, 2000 (నైరోబీ):** ఆసీస్‌తో చాంపియన్స్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్. యువీ తొలి ఇన్నింగ్స్ ఇదే. 80 బంతుల్లో 12 ఫోర్లతో 84 పరుగులు చేసి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. యువీ రాక ప్రపంచానికి తెలిసింది. భారత్ ఈ మ్యాచ్‌లో 20 పరుగులతో నెగ్గింది.

**13 జూలై, 2002 (లార్డ్స్):** ఇంగ్లండ్‌పై నాట్‌వెస్ట్ సిరీస్ ఫైనల్లో అసాధ్యమైన 326 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కైఫ్ (87 నాటౌట్)తో కలిసి యువీ ఆడిన అద్భుత ఇన్నింగ్స్ ఇది. వీరిద్దరి 121 పరుగుల భాగస్వామ్యంతో సాధించిన ఘన విజయం భారత వన్డే క్రికెట్ రాతను మార్చింది. యువీ 63 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్‌తో 69 పరుగులు చేశాడు.



**22 జనవరి, 2004 (సిడ్నీ):** ఆస్ట్రేలియాపై 122 బంతుల్లో 16 ఫోర్లు, 2 సిక్సర్లతో చేసిన 139 పరుగులు చేసిన యువరాజ్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అయ్యాడు. అయితే ఈ మ్యాచ్ ఆసీస్ గెలిచింది.

**19 ఫిబ్రవరి, 2006 (కరాచీ):** పాకిస్తాన్ గడ్డపై 4–1తో వన్డే సిరీస్ నెగ్గడంలో కీలక పాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. ఆఖరి వన్డేలో 93 బంతుల్లోనే 14 ఫోర్లతో 107 పరుగులు చేయడంతో భారత్ 8 వికెట్లతో గెలిచింది.

**19 జనవరి, 2017 (కటక్):** పునరాగమనం తర్వాత యువీ చేసిన అద్భుత శతకం ఇది. ఇంగ్లండ్‌పై 127 బంతుల్లోనే 21 ఫోర్లు, 3 సిక్సర్లతో చెలరేగి 150 పరుగులతో తన అత్యధిక స్కోరు నమోదు చేశాడు.

### 6 6 6 6 6 6



యువరాజ్ అంటే క్రికెట్ ప్రపంచానికి గుర్తుకొచ్చే మ్యాచ్ ఇది. 2007 తొలి టి20 ప్రపంచ కప్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరిగిన పోరులో యువరాజ్ చూపించిన విశ్వరూపం ఇది. స్టువర్ట్ బ్రాడ్ వేసిన ఓవర్లో 6 బంతుల్లో 6 సిక్సర్లు బాదిన యువీ కొత్త చరిత్ర సృష్టించాడు. టి20ల్లో ఈ ఘనత సాధించిన ఏకైక ఆటగాడిగా నిలిచాడు. ఈ క్రమంలో 12 బంతుల్లోనే అతను చేసిన ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డు ఇప్పటికీ పదిలంగానే ఉంది.

### కొరుకుడు పడని టెస్టు క్రికెట్...

వన్డేలు, టి20ల్లో అద్భుతాలు చేసినా యువరాజ్ వేర్వేరు కారణాలతో ఏనాడూ మంచి టెస్టు బ్యాట్స్‌మన్ కాలేకపోయాడు. అతని కెరీర్‌లో ఉన్న మూడు సెంచరీలు కూడా పాక్‌పై సాధించినవే కావడం విశేషం. లాహోర్‌లో కఠిన పరిస్థితుల్లో చేసిన 129 పరుగులు, కరాచీలో ఓటమి ఖాయమైన టెస్టులో 122 పరుగులు చేసిన యువీ... బెంగళూరులో భారత్ స్కోరు 61/4గా ఉన్నప్పుడు చేసిన 169 పరుగులు అతని మూడో శతకం. సెంచరీ కాకపోయినా... ఇంగ్లండ్‌పై 2008 చెన్నై టెస్టులో సచిన్‌కు సహకారం అందిస్తూ చేసిన (85 నాటౌట్) ఇన్నింగ్స్ కూడా ఎప్పటికీ మరచిపోలేనిది.

అద్భుతమైన కెరీర్ నీది. మైదానంలోనూ, బయటా కష్టకాలంలో నువ్వు చూపిన పోరాటం అభినందనీయం. జట్టుకు అవసరమైన ప్రతీసారి చాంపియన్‌లా తిరిగొచ్చావు. -సచిన్

గొప్ప కెరీర్ ముగించిన నీకు అభినందనలు. మాకు ఎన్నో విజయాలు, జ్ఞాపకాలు అందించావు. -కోహ్లి

ఆటగాళ్లు వస్తుంటారు, పోతుంటారు కానీ యువీలాంటి వాళ్లు అరుదు. అటు బౌలర్లను, ఇటు క్యాన్సర్‌ను చితక్కొట్టి మనసులు గెలుచుకున్న అతను ఎందరికో స్ఫూర్తిదాయకం. -సెహ్వాగ్

ప్రిన్స్‌కు అభినందనలు. భారత్ తరఫున పరిమిత ఓవర్ల క్రికెట్‌లో నువ్వే అత్యుత్తమం. నేనూ నీలాగా బ్యాటింగ్ చేయగలిగితే బాగుండేది. బీసీసీఐ ఇకపై 12 నంబర్ జెర్సీకి రిటైర్మెంట్ ప్రకటించాలి. -గంభీర్

నా యుద్ధ వీరుడు. ఆటలో, జీవితంలో ఎంతో పోరాడాడు. నీ గురించి అంతా ఎప్పటికీ చెప్పుకుంటారు. -హర్భజన్

నీతో ఆడటం ఎంతో సంతోషాన్నిచ్చింది. క్రికెట్‌లో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా ముగిస్తున్నావు. నీ పట్టుదల, పోరాటంతో మాకందరికీ స్ఫూర్తిగా నిలిచావు. -లక్ష్మణ్

రిటైర్మెంట్‌ను బాగా ఆస్వాదించు. -బ్రాడ్



### 'విశ్వ' రూపం

యువరాజ్ కెరీర్‌లో 2011 వన్డే ప్రపంచ కప్ విజయం ఎవరెస్ట్ లాంటిది. తన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అతను భారత్ 28 ఏళ్ల తర్వాత ట్రోఫీ గెలవడంతో కీలక పాత్ర పోషించాడు. ఒక సెంచరీ, నాలుగు అర్ధ సెంచరీలు సహా 362 పరుగులు చేసిన అతను... 15 వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్'గా నిలిచాడు.

### యువరాజ్ కెరీర్

| | టెస్టులు | వన్డేలు | టి20 |
|---|---|---|---|
| మ్యాచ్‌లు | 40 | 304 | 58 |
| పరుగులు | 1,900 | 8,701 | 1,177 |
| బ్యాటింగ్ సగటు | 33.92 | 36.55 | 28.02 |
| సెంచరీలు | 3 | 14 | 0 |
| అర్ధ సెంచరీలు | 11 | 52 | 8 |
| అత్యధిక స్కోరు | 169 | 150 | 77 |
| వేసిన బంతులు | 931 | 5,048 | 424 |
| తీసిన వికెట్లు | 9 | 111 | 28 |
| బౌలింగ్ సగటు | 60.77 | 38.68 | 17.82 |
| ఉత్తమ బౌలింగ్ | 2/9 | 5/31 | 3/17 |
| క్యాచ్‌లు | 31 | 94 | 12 |

# హతవిధీ... సఫారీ ఆశలు ఆవిరి!

- విండీస్, దక్షిణాఫ్రికా మ్యాచ్ వర్షార్పణం
- సెమీస్ అవకాశాలు సంక్లిష్టం


డు ప్లెసిస్, డికాక్

**సౌతాంప్టన్:** ఈ ప్రపంచకప్‌లో మరో మ్యాచ్ వర్షార్పణమైంది. దక్షిణాఫ్రికాను నిండా ముంచేసింది. ఇంకా విజయాల బోణీ కొట్టని సఫారీ జట్టుకు ఇది కీలకమైన పోరు. కానీ ఈ మ్యాచ్ రద్దవడంతో డు ప్లెసిస్ సేన సెమీస్ ఆశలు దాదాపుగా ఆవిరయ్యాయి. మొత్తానికి దక్షిణాఫ్రికాను ఈ మెగా ఈవెంట్‌లో ప్రత్యర్థులే కాదు వర్షం కూడా దెబ్బకొట్టింది. వానతో ఆలస్యంగా మొదలైన ఈ మ్యాచ్ ఎంతోసేపు సాగలేదు. వర్షంతో ఆట నిలిచే సమయానికి దక్షిణాఫ్రికా 7.3 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 29 పరుగులు చేసింది. టాస్ నెగ్గిన వెస్టిండీస్ మొదట ఫీల్డింగ్ ఎంచుకుంది. డికాక్ (17 నాటౌట్; 1 ఫోర్)తో కలిసి సఫారీ ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఆమ్లా (6) విఫలమయ్యాడు. కాట్రెల్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్లో గేల్‌కు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు. వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన మార్క్‌రమ్ (5)ను కూడా కాట్రెలే ఔట్ చేశాడు. కెప్టెన్ డుప్లెసిస్ (0 నాటౌట్) క్రీజులోకి వచ్చిన కాసేపటికే వర్షం కూడా వచ్చింది. మైదానాన్ని ముంచెత్తింది. దీంతో ఆటకు చాలా సేపు అంతరాయం ఏర్పడింది. చివరకు పిచ్, ఔట్‌ఫీల్డ్ మ్యాచ్ నిర్వహణకు ఏమాత్రం అనుకూలంగా లేకపోవడంతో ఫీల్డు అంపైర్లు పాల్ విల్సన్, రొడ్ టక్కర్‌లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఇరు జట్లు ఒక్కో పాయింట్‌తో సరిపెట్టుకున్నాయి. చిత్రంగా మూడు మ్యాచ్‌లాడినా పాయింట్లు గెలవలేకపోయిన దక్షిణాఫ్రికా ఖాతాలో ఎట్టకేలకు రద్దయిన మ్యాచ్‌తో ఓ పాయింట్ చేరింది.

**ప్రపంచకప్‌లో నేడు**
**శ్రీలంక X బంగ్లాదేశ్**
మధ్యాహ్నం గం.3 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

### పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ర | నె.ర.రే. | పా |
|---|---|---|---|---|---|---|
| న్యూజిలాండ్ | 3 | 3 | 0 | 0 | +2.163 | 6 |
| ఇంగ్లండ్ | 3 | 2 | 1 | 0 | +1.307 | 4 |
| భారత్ | 2 | 2 | 0 | 0 | +0.539 | 4 |
| ఆస్ట్రేలియా | 3 | 2 | 1 | 0 | +0.483 | 4 |
| వెస్టిండీస్ | 3 | 1 | 1 | 1 | +2.054 | 3 |
| శ్రీలంక | 3 | 1 | 1 | 1 | -1.517 | 3 |
| పాకిస్తాన్ | 3 | 1 | 1 | 1 | -2.412 | 3 |
| బంగ్లాదేశ్ | 3 | 1 | 2 | 0 | -0.714 | 2 |
| దక్షిణాఫ్రికా | 4 | 0 | 3 | 1 | -0.952 | 1 |
| అఫ్ఘానిస్తాన్ | 3 | 0 | 3 | 0 | -1.493 | 0 |

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, ర–రద్దు, నె.ర.రే.–నెట్ రన్‌రేట్, పా–పాయింట్లు

# సెమీస్‌లో భారత్

### 10-0తో ఉజ్బెకిస్తాన్‌పై జయభేరి

**భువనేశ్వర్:** అంతర్జాతీయ హాకీ సమాఖ్య సిరీస్ ఫైనల్స్ హాకీ టోర్నమెంట్‌లో ఆతిథ్య భారత జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఆకాశ్‌దీప్ సింగ్ హ్యాట్రిక్స్ గోల్స్‌తో భారత్ 10–0తో ఉజ్బెకిస్తాన్‌పై జయభేరి మోగించింది. భారత జట్టులో ఆకాశ్‌దీప్ అదరగొట్టాడు. ఆట 11వ, 26వ, 53వ నిమిషాల్లో మూడు గోల్స్ చేశాడు. వరుణ్ (4, 22వ ని.లో), మన్‌దీప్ (30, 60వ ని.లో) రెండేసి గోల్స్ సాధించగా, అమిత్ (15వ ని.), నీలకంఠశర్మ (27వ ని.), గుర్‌సాహిబ్జిత్ సింగ్ (45వ ని.) తలా ఒక గోల్ చేశారు. పరాజయం ఎరుగని భారత్ ఆడిన అన్ని లీగ్ మ్యాచ్‌ల్లోనూ గెలిచి పూల్ 'ఎ' టాపర్‌గా సెమీఫైనల్లోకి ప్రవేశించింది. జపాన్, పోలాండ్ జట్ల మధ్య జరిగే క్రాస్–ఓవర్ మ్యాచ్‌లో గెలిచిన జట్టుతో భారత్ సెమీస్‌లో ఆడుతుంది.



# హామిల్టన్‌ను గెలిపించిన వెటెల్



**మాంట్రియల్:** కెనడా గ్రాండ్‌ప్రి ఫార్ములావన్ రేస్‌లో అనూహ్య ఫలితం వచ్చింది. రేసులో ఫెరారీ డ్రైవర్ సెబాస్టియన్ వెటెల్ దూసుకొచ్చినా... పెనాల్టీతో వెనుకబడ్డాడు. దీంతో లూయిస్ హామిల్టన్ విజేతగా నిలిచాడు. 50వ ల్యాప్ మలుపు వద్ద చేసిన ఓవర్‌టేక్ తప్పుతో వెటెల్ మూల్యం చెల్లించుకున్నాడు. ఒక విధంగా మెర్సిడెస్ డ్రైవర్ హామిల్టన్‌ను గెలిపించాడు. 70 ల్యాప్‌ల ఈ రేసును అందరికంటే ముందుగా వెటెలే ముగించాడు. కానీ నిబంధనలకు విరుద్ధంగా 50వ ల్యాప్‌లో మలుపు వద్ద ప్రమాదకరంగా ఓవర్‌టేక్ చేసినందుకు రేస్ స్టీవార్డ్‌లు వెటెల్‌పై 5 సెకన్ల పెనాల్టీ వేశారు. దీంతో గంటా 29 నిమిషాల 07.084 సెకన్లలో రేసును పూర్తి చేసిన హామిల్టన్‌ను విజేతగా ప్రకటించారు. 5 సెకన్ల పెనాల్టీ మూల్యంతో వెటెల్ 0.03.658 సెకన్ల తేడాతో రెండో స్థానానికి పరిమితమయ్యాడు. సీజన్‌లోని తదుపరి రేసు ఫ్రెంచ్ గ్రాండ్‌ప్రి ఈనెల 23న జరుగుతుంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఏడు రేసులు జరగ్గా హామిల్టన్ ఐదింటిలో, మెర్సిడెస్‌కే చెందిన మరో డ్రైవర్ బొటాస్ రెండు రేసుల్లో గెలిచారు. ప్రస్తుతం డ్రైవర్స్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో హామిల్టన్ (162 పాయింట్లు) టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.



'కరువా' చిన్నారిపై హత్యాచారం

# ముగ్గురికి యావజ్జీవం

- మరో ముగ్గురికి ఐదేళ్ల జైలు శిక్ష • పఠాన్‌కోట్ కోర్టు తీర్పు
- ఆరుగురు దోషుల్లో నలుగురు పోలీసులే
- పై కోర్టులో అప్పీల్ చేస్తాం: బాధితుల తరపు న్యాయవాదులు

**పఠాన్‌కోట్:** ఏడాదిన్నర క్రితం తీవ్ర సంచలనం సృష్టించిన కరువా సామూహిక అత్యాచారం, హత్య కేసులో ఏడుగురు నిందితుల్లో ఆరుగురిని కోర్టు సోమవారం దోషులుగా తేల్చింది. వారిలో ముగ్గురికి యావజ్జీవ శిక్ష (జీవితఖైదు), ముగ్గురికి ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రధాన నిందితుడు సంజీరామ్ కొడుకు అయిన విశాల్‌ను కోర్టు సరైన సాక్ష్యాలు లేని కారణంగా నిర్దోషిగా విడుదల చేసిందని బాధితురాలి కుటుంబం తరపున వాదనలు వినిపించిన న్యాయవాది ఫరూఖీ ఖాన్ చెప్పారు. పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లోని సెషన్స్ కోర్టు ఈ కేసును సంవత్సరంపాటు విచారించిన అనంతరం న్యాయమూర్తి తేజ్వీందర్ సింగ్ సోమవారం తీర్పు చెప్పారు. ఈ కేసును జమ్మూ కశ్మీర్‌లో కాకుండా బయటి కోర్టు విచారించాలని గతేడాది మే 7న సుప్రీంకోర్టు ఆదేశించడంతో పఠాన్‌కోట్ కోర్టు ఈ కేసును విచారించింది. రణ్‌బీర్ పీనల్ కోడ్ (ఆర్పీసీ) కింద కోర్టు వారిని దోషులుగా తేలుస్తూ, బయట మీడియా ప్రతినిధులు భారీ సంఖ్యలో వేచి ఉండగా తీర్పు వెల్లడించింది. కోర్టులోకి విలేకరులను అనుమతించలేదు.

జమ్మూ కశ్మీర్‌లోని కరువాలో గతేడాది జనవరిలో ఎనిమిదేళ్ల బాలికపై ఓ ఆలయంలో సామూహిక అత్యాచారం, హత్య జరిగిన సంఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించడం తెలిసిందే. బాలికను అపహరించి, ఆలయంలో బంధించి, నాలుగురోజుల పాటు మత్తుమందు ఇచ్చి అత్యాచారం చేసిన అనంతరం బండరాళ్లతో మోదీ హత్య చేశారన్నది ఈ కేసులో ప్రధాన ఆరోపణ. కోర్టు ఈ కేసులో మొత్తం ఆరుగురిని దోషులుగా తేల్చగా, వారిలో నలుగురు పోలీసులే కావడం గమనార్హం.

**మరణించేవరకు జైలు జీవితమే..**

బాలికపై అఘాయిత్యానికి ఒడిగట్టినట్లుగా ఆరోపణలు ఎదుర్కొన్న ఆలయ సంరక్షకుడు సంజీరామ్, ప్రత్యేక పోలీస్ అధికారి (ఎస్పీవో) దీపక్ ఖజూరియాతోపాటు మరో వ్యక్తి ప్రవేశ్‌కుమార్‌లను కోర్టు దోషులుగా తేల్చింది. ఈ ముగ్గురూ అత్యాచారం, హత్య, నేరపూరిత కుట్రకు పాల్పడటంతో పాటు సాక్ష్యాలను నాశనం చేశారంటూ వచ్చిన ఆరోపణలు రుజువైనట్లు కోర్టు తెలిపింది. వీరిని దోషులుగా ప్రకటిస్తూ జీవిత ఖైదు విధించింది. జీవిత ఖైదు అంటే మరణించేంత వరకు జైలులో ఉండాల్సిందేనని కోర్టు స్పష్టంగా వివరించింది. అలాగే మరో ఎస్పీవో సురేంద్ర వర్మ, ఎస్సై ఆనంద్ దత్తా, హెడ్ కానిస్టేబుల్ తిలక్ రాజ్‌లు సాక్ష్యాలను నాశనం చేశారంటూ వారికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 50 వేల జరిమానా విధించింది. జరిమానా కట్టలేకపోతే మరో ఆరునెలలు ఎక్కువగా జైలు జీవితం గడపాలని ఆదేశించింది. ఆనంద్ దత్తా, తిలక్ రాజ్‌లు కేసులో సాక్ష్యాలను నాశనం చేసేందుకు సంజీరామ్ నుంచి రూ. 4 లక్షలు తీసుకున్నట్లుగా కూడా ఆరోపణలు ఉన్నాయి. బాలిక సంచార జాతికి చెందిన అమ్మాయి కాగా, వారి మైనారిటీ జాతిని పూర్తిగా లేకుండా చేసేందుకు చాలా పకడ్బందీగా కుట్ర పన్ని ఈ నేరానికి ఒడిగట్టారని చార్జిషీట్‌లో పోలీసులు పేర్కొన్నారు.



సాంజీ రామ్

**మరణశిక్ష పడుతుందనుకున్నాం..**


'నేరస్తులకు మరణశిక్ష పడుతుందని మేం ఆశించాం. నిర్దోషిగా బయటపడిన వ్యక్తి.. ప్రధాన నిందితుడేనని మేం వింటున్నాం. అలాంటప్పుడు అతణ్ని ఎందుకు విడుదల చేశారు'అని బాలిక తండ్రి అన్నారు. బాధిత కుటుంబం తరపున వాదనలు వినిపించిన న్యాయవాదులు ఓ ప్రకటన విడుదల చేస్తూ, తాము కోర్టు తీర్పును పరిశీలించిన అనంతరం పై కోర్టుకు వెళ్తామనీ, నిర్దోషిగా విడుదలైన విశాల్‌ను దోషిగా తేల్చాలని అప్పీల్ చేసే అవకాశం ఉందని తెలిపారు. ఓ బాలనేరస్థుడితో సహా మొత్తం ఎనిమిది మందిపై జమ్మూ కశ్మీర్ పోలీసులు అభియోగపత్రం దాఖలు చేయగా, ఏడుగురిపై విచారణను ఈ కోర్టు చూసుకుంది.

**తీర్పుపై మెహబూబా హర్షం..**

కోర్టు తీర్పు పట్ల జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీలు హర్షం వ్యక్తం చేశారు. 'నేరస్తులను చట్టానికి లోబడి వీలైనంత కఠినంగా శిక్షించాలి. ఇలాంటి నేరస్తులకు మద్దతు తెలిపిన రాజకీయ నేతలను ఏదైనా అనడానికి అసలు పదాలు లేవు' అని ఒమర్ అబ్దుల్లా ట్వీట్ చేశారు. బీజేపీ నాయకులు గతంలో నిందితులకు మద్దతుగా నిలవడం తెలిసిందే. దోషులకు అత్యంత కఠిన శిక్ష పడేలా చేయాలని మెహబూబా ముఫ్తీ ట్వీట్ చేశారు. దోషులందరికీ మరణశిక్ష వేయాలంటూ హైకోర్టులో జమ్మూకశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్ చేయాలని జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) చైర్మన్ రేఖా శర్మ కోరారు.



కరువా దోషులు దీపక్ ఖజూరియా, ఎస్సై ఆనంద్ దత్తా, సురేందర్ వర్మ, తిలక్ రాజ్




**ఎప్పుడేం జరిగిందంటే..**

➤ **2018 జనవరి 10:** కరువా జిల్లాలోని రసనా గ్రామంలో బకర్వాల్ సంచార జాతికి చెందిన 8 ఏళ్ల బాలిక గుర్రాలను మేపుతుండగా ఆమె ఆచూకీ గల్లంతు.
➤ **జనవరి 12:** బాలిక తండ్రి ఫిర్యాదుతో హీరానగర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు. ➤ **జనవరి 17:** బాలిక మృతదేహం లభ్యం. గ్యాంగ్‌రేప్ తర్వాత చంపేసినట్లు పోస్ట్‌మార్టం నివేదికలో వెల్లడి.
➤ **జనవరి 22:** దేశవ్యాప్త నిరసనలతో జమ్మూ కశ్మీర్ క్రైం బ్రాంచ్‌కు కేసు బదిలీ. ➤ **ఫిబ్రవరి 16:** నిందితులకు మద్దతుగా ర్యాలీ నిర్వహించిన హిందూ ఏక్తా మంచ్. ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నేతలు, మంత్రులు చంద్ర ప్రకాశ్, లాల్ సింగ్. ➤ **మార్చి 1:** ప్రధాన నిందితుడు, ఆలయ సంరక్షకుడు సంజీరామ్‌ను బంధువైన బాల నేరస్తుడి అరెస్టుకు వ్యతిరేకంగా హిందూ ఏక్తా మంచ్ నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నేతలు, మంత్రులు. ➤ **ఏప్రిల్ 9:** మొత్తం ఎనిమిది మందిని నిందితులుగా తేల్చి, వారిలో ఏడుగురిపై అభియోగపత్రాన్ని కరువా కోర్టులో దాఖలు చేసిన పోలీసులు ➤ **ఏప్రిల్ 10:** బాల నేరస్తుడినని చెప్పుకున్న ఎనిమిదో వ్యక్తి పైనా అభియోగపత్రం దాఖలు చేసిన పోలీసులు.
➤ **ఏప్రిల్ 14:** మంత్రివర్గం నుంచి తప్పుకున్న చంద్ర ప్రకాశ్, లాల్ సింగ్. బాధితులకు న్యాయం చేయాలన్న ఐరాస ప్రధాన కార్యదర్శి గ్యుటెరస్. ➤ **ఏప్రిల్ 16:** కరువాలో ప్రధాన సెసన్స్ కోర్టు జడ్జి ముందు విచారణ ప్రారంభం.
➤ **మే 7:** కరువా నుంచి పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌కు విచారణను మార్చిన సుప్రీంకోర్టు. విచారణను రహస్యంగా, వేగవంతంగా, మీడియాకు దూరంగా చేపట్టాలని ఆదేశించిన సుప్రీం కోర్టు.
➤ **2019 జూన్ 3:** విచారణను ముగించిన పఠాన్ కోట్ సెషన్స్ కోర్టు.
➤ **జూన్ 10:** దోషులుగా తేల్చుతూ తీర్పు వెల్లడించిన కోర్టు.



# గిరీష్ కర్నాడ్ కన్నుమూత

- దీర్ఘకాలంగా బాధించిన అనారోగ్యం
- నిరాడంబరంగా అంత్యక్రియలు
- రాష్ట్రపతి, ప్రధాని, ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంల సంతాపం

**సాక్షి, బెంగళూరు:** ఐదు దశాబ్దాల పాటు నాటక, సినీ, సాహితీ ప్రపంచంలో తనదైన ముద్రవేసిన బహుభాషా నటుడు, ప్రఖ్యాత నాటక రచయిత, సాహితీవేత్త, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత గిరీష్ కర్నాడ్ (81) కన్నుమూశారు. దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం ఉదయం బెంగళూరులో లావెల్లీ రోడ్డులోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సరస్వతి, జర్నలిస్టు, రచయిత అయిన కొడుకు రఘు కర్నాడ్, కుమార్తె రాధ ఉన్నారు. తన తండ్రి ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని రఘు తెలిపారు. ఆయన ఉదయం వేళలో మరణించారని, 8.30 సమయంలో ఆయన చనిపోయినట్టుగా తాము గుర్తించామని చెప్పారు. కాగా ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం గిరీష్ కర్నాడ్ భౌతిక కాయాన్ని బయ్యప్పనహళ్లి రోడ్డులోని కల్లహళ్లిలో ఉండే విద్యుత్ శ్మశాన వాటికలో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు ఉంచారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని కర్ణాటక ప్రభుత్వం భావించినా.. కర్నాడ్ కోరిక మేరకు, ఆయన కుటుంబసభ్యుల విజ్ఞప్తితో ఎలాంటి మతపరమైన కార్యక్రమాలు లేకుండా నిరాడంబరంగా అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా కర్నాడ్ మృతికి సంతాప సూచకంగా కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించింది. మరో మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. గిరీశ్ కర్నాడ్ మృతిపై దక్షిణాది చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. రాష్ట్రపతి రామనాథ్ కోవింద్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా పలువురు ప్రముఖులు, నటులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కె.చంద్రశేఖర్‌రావు, హెచ్‌డీ కుమారస్వామి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కర్ణాటక మంత్రులు డీకే శివకుమార్, ఆర్‌వీ దేశ్‌పాండే, బి.జయశ్రీ, సురేష్ హెబ్లీకార్ తదితర నాటక, సినీరంగ ప్రముఖులు తమ అంతిమ నివాళులర్పించారు. అంత్యక్రియలను తమ వ్యక్తిగత కార్యక్రమంగా నిర్వహించాలని భావిస్తున్నందున, అంతిమ నివాళుర్పించేందుకు నేరుగా స్మశానానికే రావాల్సిందిగా కర్నాడ్ కుటుంబం అంతకుముందు ఆయన అభిమానులకు, ప్రముఖులకు విజ్ఞప్తి చేసింది. భారత సాహితీ రంగానికి మరింత వన్నె తెచ్చే విధంగా తన సొంత భాష కన్నడలో చేసిన గొప్ప రచనలకు గాను 1998లో ప్రతిష్టాత్మక జ్ఞానపీఠ్ పురస్కారాన్ని ఆయన అందుకున్నారు.

**రాష్ట్రపతి, ప్రధాని సంతాపం:** రంగస్థలంలో గిరీశ్ కర్నాడ్‌ది ప్రత్యేక స్థానమని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సోమవారం తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఆయన మృతితో భారత సాంస్కృతిక ప్రపంచం చిన్నబోయిందన్నారు. 'ఆయన మృతి విచారం కలిగించింది. అన్ని మాధ్యమాల్లో తన విలక్షణ నటన కారణంగా కర్నాడ్ కలకాలం గుర్తుండి పోతారు. ఆయన రచనలకు భవిష్యత్తులోనూ ప్రజాదరణ కొనసాగుతుంది..' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కాగా తామొక సాంస్కృతిక రాయబారిని కోల్పోయామని కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి చెప్పారు.

సోమవారం బెంగళూరులో గిరీష్ కర్నాడ్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత డీకే శివకుమార్

**వైఎస్ జగన్ సంతాపం**

గిరీష్ కర్నాడ్ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కర్నాడ్ మరణం అటు సినీ రంగానికి, ఇటు సాహితీ రంగానికి తీరని లోటు అని జగన్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. కర్నాడ్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**కేసీఆర్ సంతాపం**

కర్నాడ్ మృతిపై తెలంగాణ సీఎం కేసీఆర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. దేశ నాటక, సాహిత్య, సినీ రంగానికి ఆయన చేసిన సేవ అంతర్జాతీయంగా ప్రఖ్యాతి గాంచిందని కొనియాడారు.

## ఆ వివరాలు వెల్లడించలేం




**న్యూఢిల్లీ:** ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలో నియమావళి ఉల్లంఘనలపై ప్రధాని మోదీ, ఇతర నేతలపై నమోదైన ఫిర్యాదుల వివరాలను బహిర్గతం చేయలే మని ఎన్నికల సంఘం(ఈసీ) స్పష్టం చేసింది. ఈ సమాచారం వెల్లడిస్తే ఉల్లంఘనలకు సంబంధించి తమను అప్రమత్తం చేసిన వర్గాలను నిరుత్సాహ పరిచినట్లవుతుందని, తమకు సమాచారం అందించిన వారి భద్రతకు ప్రమాదకరం గా మారుతుందని పేర్కొంది. సమాచార హక్కు చట్టం–2005లోని సెక్షన్ 7(9) ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది.

## నేతల వేధింపులతోనే ఆత్మహత్య

**వైరల్ అవుతున్న బెంగళూరు వ్యాపారవేత్త ఆడియో**


**శివాజీనగర** (బెంగళూరు): రాజకీయ నేతల వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు బెంగళూరుకు చెందిన ప్రముఖ వ్యాపార వేత్త ఒకరు ఆడియో విడుదల చేసి, కనిపించకుండా పోవడం కలకలంరేపుతోంది. ఆయన జాడ కోసం పోలీసులు గాలిస్తుండగా, ఆయన సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన పలువురు మదుపరులు ఆందోళన చెందుతున్నారు. ఐఎంఏ గ్రూప్ వ్యాపార సంస్థల అధిపతి మహమ్మద్ మన్సూర్ ఖాన్ బెంగళూరు నగర పోలీసు కమిషనర్‌ను ఉద్దేశించి సోమవారం ఒక ఆడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అందులో ఆయన.. 'రాజకీయనేతలకు, అధికారులకు ఎన్నో లంచాలిచ్చా. పదేళ్లుగా సంస్థ లావాదేవీల్లో బాధలు అనుభవిస్తున్నా. రాజకీయ నాయకుల వేధింపులతో జీవితంపై విరక్తి కలిగింది. అందుకే ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నా. మీరు ఈ ఆడియో వినేలోగా నా ప్రాణం ఉండదు' అని అందులో ఉంది.

## ప్రఫుల్ పటేల్‌పై ఈడీ ప్రశ్నల వర్షం



**న్యూఢిల్లీ:** కేంద్ర విమానయాన శాఖ మాజీ మంత్రి, ఎన్సీపీ నేత ప్రఫుల్‌పటేల్ సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణకు హాజరయ్యారు. ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్‌ఇండియా నష్టాల్లో కూరుకుపోయేలా వ్యవహరించారన్న కేసులో ఈడీ అధికారులు పటేల్‌ను 8 గంటలపాటు ప్రశ్నించారు. ఈడీ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ.. '2004–11 మధ్యకాలంలో విమానయానశాఖ మంత్రిగా ఉన్న ప్రఫుల్ పటేల్ 2008–09 మధ్యకాలంలోఅంతర్జాతీయ సంస్థలకు నిబంధనలను తుంగలో తొక్కి ఎమిరేట్స్, ఎయిర్ అరేబియా, ఖతార్ ఎయిర్‌వేస్ వంటి ఎయిర్ స్లాట్స్ కేటాయించారు. దీంతో ఎయిర్‌ఇండియా నష్టాల్లోకి జారిపోయింది. ఇందుకు ప్రతిఫలంగా పటేల్‌కు అత్యంత ఆప్తుడైన దళారి దీపక్ తల్వార్‌కు ఈ అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్ నుంచి రూ.272 కోట్ల ముడుపులు లభించాయి' అని తెలిపారు.

## ఈవీఎంల పనితీరును ప్రశ్నించిన పవార్



**ముంబై:** ఈవీఎంల కచ్చితత్వాన్ని ఎన్సీపీ చీఫ్ శరద్‌పవార్ సోమవారం ప్రశ్నించారు. ఈ విషయంపై చర్చించేందుకు ఢిల్లీలో ప్రతిపక్ష పార్టీలు సాంకేతిక నిపుణుల సమక్షంలో సమావేశమవుతున్నాయన్నారు. ఎన్సీపీ 20వ వార్షికోత్సవం సందర్భంగా ముంబైలో నిర్వహించిన ఎన్సీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఈవీఎం అంటే పోలింగ్ బూత్‌లో ఓ అధికారి వద్ద ఓ మెషీన్ ఉంటుంది. అలాగే ఓటరు బటన్ నొక్కడానికి మరో మెషీన్, దానిపక్కన వీవీప్యాట్ ఉంటుంది. ఓటర్ తనకు కేటాయించిన మెషీన్‌లో ఏదో ఓ పార్టీకి బటన్ నొక్కగానే వీవీప్యాట్‌లో ఆ పార్టీ గుర్తు కూడా ప్రింట్ అవుతుంది. ఇక్కడి వరకు అంతా బాగానే ఉంది. కానీ ఓ ఓటర్ బటన్ నొక్కిన తర్వాత అధికారి దగ్గర ఉన్న మెషీన్‌లో ఆ ఓటు నిక్షిప్తం అవుతుంది. ఆ మెషీన్‌లోని ఓట్లనే కౌంటింగ్ సమయంలో లెక్కిస్తారు తప్ప ఓటరు బటన్ నొక్కిన మెషీన్‌లోవి కావు. అయితే ఓటర్ బటన్ నొక్కి, వీవీప్యాట్‌లోనూ అది కనిపించాకా, ఆ ఓటు అధికారి దగ్గర ఉన్న మెషీన్‌లో నిక్షిప్తం అవ్వడంలోనే ఏదో గోల్‌మాల్ జరుగుతున్నట్లుగా అనిపిస్తోంది. దీనిపై మరింత పరిశీలన జరిపేందుకు నిపుణుల సమక్షంలో త్వరలోనే విపక్ష పార్టీలు ఢిల్లీలో భేటీ కానున్నాయి' అని చెప్పారు.



# ప్రజాభీష్టానికి తగ్గ ప్రణాళికలతో రండి

**ఉన్నతాధికారులకు ప్రధాని మోదీ సూచన**

**న్యూఢిల్లీ:** అన్ని మంత్రిత్వ శాఖలు వచ్చే అయిదేళ్లలో ప్రజాభీష్టం మేరకు వారి జీవితాలను మెరుగుపరిచే ప్రభావవంతమైన ప్రణాళికలను రూపొందించాలని ప్రధాని మోదీ ఉన్నతాధికారులను కోరారు. సోమవారం ఆయన అన్ని మంత్రిత్వ శాఖల కార్యదర్శులతో సమావేశమయ్యారు. ప్రభావశీల ప్రణాళికతో ముందుకు వస్తే వందరోజుల్లోనే అమలయ్యేలా అనుమతులు మంజూరు చేస్తాం' అని ప్రధాని అధికారులను కోరారని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. 'దేశంలో పని చేయగలిగే వారి సంఖ్య ఎక్కువగా మంది ఉన్నందున వారిని సమర్థంగా వాడుకోవాలి. కేంద్రంలోని ప్రతి శాఖ, రాష్ట్రంలోని ప్రతి జిల్లా కూడా 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ గల దేశంగా మార్చేందుకు కీలకమైనవి. ఎంతో కీలకమైన 'భారత్‌లో తయారీ' నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలి. చిన్న వ్యాపారాలు, సంస్థల విషయంలో సులభతర వాణిజ్య విధానం ప్రతిఫలించాలి' అని సూచించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల కార్యదర్శులు పరిపాలనపరమైన నిర్ణయాలు, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఐటీ, విద్యారంగ సంస్కరణలు, ఆరోగ్యం, పారిశ్రామిక విధానం, ఆర్థికాభివృద్ధి తదితర అంశాల్లో కొన్ని సూచనలు, సలహాలు చేశారు. 2014లోనూ ఇదేవిధంగా కార్యదర్శుల స్థాయి అధికారులతో మోదీ సమావేశమయ్యారు.

**మోదీ విమానానికి పాక్ ఓకే**

కిర్గిజిస్తాన్‌లోని బిష్కెక్‌లో జూన్ 13–14 తేదీల్లో జరిగే షాంఘై సహకార సదస్సు(ఎస్‌సీవో)కు హాజరయ్యేందుకు ప్రధాని మోదీ విమానానికి గగనతల అనుమతులు ఇవ్వాలన్న భారత్ విజ్ఞప్తికి పాకిస్తాన్ సానుకూలంగా స్పందించింది. తమ దేశం మీదుగా మోదీ విమానం కిర్గిజిస్తాన్ వెళ్లేందుకు పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ అంగీకరించినట్లు పాకిస్తాన్ ప్రభుత్వవర్గాలు తెలిపాయి. బాలాకోట్‌లోని జైషే ఉగ్రవాద స్థావరంపై ఐఏఎఫ్ ఈ ఏడాది ఫిబ్రవరి 26న వైమానికదాడులు చేపట్టడంతో పాక్ తన గగనతలాన్ని మూసివేసింది. దేశంలోని మొత్తం 11 రూట్లకుగానూ రెండు మార్గాల్లోనే రాకపోకల్ని అనుమతిస్తోంది. కాగా, జీ7 సదస్సుకు ప్రత్యేక అతిథిగా హాజరుకావాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ చేసిన విజ్ఞప్తికి మోదీ అంగీకరించారు. ఫ్రాన్స్‌లోని బియర్రిట్జ్‌లో ఆగస్టు 24 నుంచి 26 వరకూ జరిగే 45వ జీ7 సదస్సుకు హాజరుకావాలని నిర్ణయించారు.

# 12 మంది ఐటీ అధికారులపై వేటు

**కేంద్రం సంచలన నిర్ణయం**

**న్యూఢిల్లీ:** అవినీతి, విధుల్లో నిర్లక్ష్యం, మహిళా అధికారులపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న 12 మంది సీనియర్ ఆదాయ పన్ను శాఖ అధికారులపై ప్రభుత్వం వేటు వేసింది. ఉద్వాసనకు గురైన వారిలో చీఫ్ కమిషనర్, ప్రిన్సిపల్ కమిషనర్, కమిషనర్ స్థాయి అధికారులుండటం గమనార్హం. వీరిపై జనరల్ ఫైనాన్షియల్ నిబంధన 56 ప్రకారం వీరిని బాధ్యతల నుంచి తొలగించాలని కేంద్ర ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేసింది.

ఉద్యోగ బాధ్యతల నుంచి తొలగింపునకు గురైన వారిలో జాయింట్ కమిషనర్ స్థాయి అధికారి అశోక్ కుమార్ అగర్వాల్(ఐఆర్ఎస్–1985) ఉన్నారు. ఈయన తీవ్ర అవినీతికి పాల్పడటంతోపాటు ఓ వ్యాపారి నుంచి బలవంతపు వసూళ్లు, ఒకప్పటి ఆధ్యాత్మిక గురువు చంద్రస్వామికి సాయం చేసినట్లు ఆరోపణలు



వచ్చాయి. కమిషనర్ స్థాయి మహిళా అధికారులను లైంగికంగా వేధించిన నోయిడాలోని కమిషనర్(అప్పీల్) ఎస్‌కే శ్రీవాస్తవ (ఐఆర్ఎస్) అధికారిపైనా ప్రభుత్వం వేటువేసింది. అధికార దుర్వినియోగం, అక్రమ మార్గాల్లో రూ.3.17 కోట్లు కూడబెట్టిన ఐఆర్ఎస్ అధికారి హోమీ రాజ్‌వంశ్‌ను ఉద్యోగం నుంచి తొలగించింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అజోయ్ కుమార్, అలోక్ మిత్రా, చందర్ భార్తి, అందాసు రవీందర్, వివేక్ బాత్రా, శ్వేతబ్ సుమన్, రాజ్ భార్గవ, రాజేంద్ర ప్రసాద్ తదితరులను బాధ్యతల నుంచి తప్పించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. నిర్బంధ పదవీ విరమణ చేయించాల్సిన అధికారులను గుర్తించాల్సిందిగా గత కొంతకాలంగా కేబినెట్ సెక్రటేరియట్, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌లు తమ అధికారులకు మౌఖిక ఆదేశాలిచ్చినట్లు సమాచారం. సెంట్రల్ సివిల్ సర్వీసెస్–1972 చట్టంలోని నిబంధన 56(జే) ప్రకారం ఒక అధికారికి 50, 55 సంవత్సరాలు నిండిన తర్వాత లేదా 30 ఏళ్ల సర్వీసు పూర్తయిన తర్వాత అతని పనితీరుపై సమీక్ష చేపట్టేందుకు ప్రభుత్వానికి వీలుంటుంది. పనిచేయని అధికారులపై వేటువేసేందుకు ఉద్దేశించిన ఈ విధానాన్ని 2014లో మోదీ అధికారంలోకి రాగానే పునరుద్ధరించారు. ఇటీవలి కాలంలో వేటుపడిన ఉన్నతాధికారుల్లో ఎంఎస్ విజయ్‌కుమార్(ఐఏఎస్), కె.నరసింహ(ఐఏఎస్), మయాంక్ షీల్ చోహన్(ఐపీఎస్), రాజ్ కుమార్ దేవాంగన్(ఐపీఎస్) ఉన్నారు.

# పాక్ మాజీ అధ్యక్షుడు జర్దారీ అరెస్ట్

**మనీలాండరింగ్ కేసులో అదుపులోకి తీసుకున్న ఎన్ఏబీ**



**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ(63) అరెస్టయ్యారు. మనీలాండరింగ్ కేసులో ఆయన్ను నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో(ఎన్ఏబీ) బృందం సోమవారం అదుపులోకి తీసుకుంది. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) సహాధ్యక్షుడిగా ఉన్న జర్దారీ పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను ఇస్లామాబాద్ హైకోర్టు తిరస్కరించిన కొద్ది గంటల్లోనే ఆయన అరెస్టఅయ్యారు. కోర్టులో ప్రవేశపెట్టే వరకు ఎన్ఏబీ కార్యాలయంలోనే ఆయన్ను ఉంచుతారని సమాచారం. ఈ కేసులో జర్దారీతోపాటు ఆయన సోదరి ఫర్యాల్ తల్పూర్ ప్రధాన నిందితులుగా ఉన్నారు. అధికారంలో ఉండగా అక్రమంగా సంపాదించిన రూ.6.80 కోట్లను విదేశాలకు తరలించేందుకు వేలాది నకిలీ అకౌంట్లను సృష్టించారని వీరిపై ఆరోపణలున్నాయి. అధికారులు తల్పూర్‌ను అరెస్ట్ చేయలేదు. జర్దారీ అరెస్టుపై ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని భావిస్తున్నారు. పాక్ ప్రధానిగా బేనజీర్ భుట్టో 1988–90, 1993–96 సంవత్సరాల్లో పనిచేయగా, ఆమె భర్త జర్దారీ అధ్యక్షుడిగా 2008–13 సంవత్సరాల మధ్య పనిచేశారు. గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో ఆయన జాతీయ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ప్రతిపక్షాలను అణచివేసే కుట్రలో భాగంగానే ప్రభుత్వం అరెస్టు చేసిందని, నకిలీ బ్యాంకు అకౌంట్లతో తనకు సంబంధంలేదని జర్దారీ పేర్కొన్నారు.

# బెంగాల్లో వేడెక్కిన రాజకీయం



**కోల్‌కతా/బశీర్‌హట్/న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్లో రాజకీయం వేడెక్కింది. తృణమూల్ కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. రాష్ట్రంలో హింసను ప్రేరేపించేందుకు కేంద్ర ప్రభుత్వం, బీజేపీ ప్రయత్నిస్తున్నాయని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. దేశంలో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడేది, వ్యతిరేక గళం విన్పించేది ఒక్క తానేనని, ఈ నేపథ్యంలో తన గొంతు నొక్కాలని ఆ పార్టీ భావిస్తోందని అన్నారు. తన ప్రభుత్వాన్ని కూలదోసే కుట్ర విజయవంతం కాదని చెప్పారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. బెంగాల్లో హింసను ప్రేరేపించేందుకు కేంద్రం, అక్కడ అధికారంలో ఉన్న బీజేపీ కార్యకర్తలు ప్రయత్నిస్తున్నారని అన్నారు. వివిధ సామాజిక మాధ్యమ వెబ్‌సైట్ల ద్వారా తప్పుడు వార్తలు వ్యాపింపజేసేందుకు కోట్లకు కోట్ల డబ్బును వ్యయం చేస్తున్నారని చెప్పారు. ఏ రాష్ట్రంలో హింస ప్రజ్వరిల్లినా, దాడులు జరిగినా రాష్ట్ర ప్రభుత్వాలకు ఎంత బాధ్యత ఉంటుందో కేంద్రానికి కూడా అంతే సమాన బాధ్యత ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించాలంటూ కేంద్ర హోం శాఖ సలహా ఇవ్వడం.. అప్రజాస్వామిక, అనైతిక, రాజ్యాంగ వ్యతిరేక పద్ధతుల్లో బీజేపీ చేస్తున్న పకడ్బందీ కుట్రగా టీఎంసీ సెక్రటరీ జనరల్, బెంగాల్ మంత్రి పార్థ చటర్జీ అభివర్ణించారు. ఈ మేరకు మంత్రి అమిత్ షాకు సోమవారం లేఖ రాశారు. నిజానిజాలేమిటో పరిశీలించకుండానే, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నివేదిక తీసుకోకుండానే కేంద్ర హోంశాఖ ఓ నిర్ధారణకు రావడాన్ని ఆయన తప్పుబట్టారు. దీనిపై తాము తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని, హోం శాఖ తన సలహాను తక్షణం ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా టీఎంసీ ఆరోపణలు ఆధార రహితమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ ఘోష్ అన్నారు.

**బీజేపీ నిరసన ర్యాలీలు**

శనివారం ఘర్షణలు జరిగిన బశీర్‌హట్ (సందేశ్‌ఖలి) ప్రాంతంలో ఉద్రిక్తత కొనసాగుతోంది. తమ కార్యకర్తల హత్యను, రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతల పరిస్థితికి నిరసనగా బీజేపీ 24 పరగణాల జిల్లాల బశీర్‌హట్ సబ్ డివిజన్‌లో బ్లాక్ డేతో పాటు 12 గంటల షట్‌డౌన్ పాటించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కూడా బీజేపీ కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.



**మోదీతో గవర్నర్ భేటీ**

రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితిని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాలకు వివరించినట్లు బెంగాల్ గవర్నర్ కేసరినాథ్ త్రిపాఠి తెలిపారు. భేటీ వివరాలు వెల్లడించలేనని ఆయన ఢిల్లీలో మీడియాతో అన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడంపై తన సమావేశాల్లో చర్చించలేదని స్పష్టం చేశారు.



సాక్షి బిజినెస్
మంగళవారం
11-6-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 169 ▲ | 52 ▲ |
| 39,785 | 11,923 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 7,864 | ▲ | 122 |
| డోజోన్స్ | 26,125 | ▲ | 142 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,376 | ▲ | 44 |
| డాక్స్ | 12,045 | ▲ | 92 |
| షాంఘై | 2,852 | ▲ | 24 |
| నికాయ్ | 21,134 | ▲ | 250 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 68.64 | 70.28 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 86.80 | 89.92 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.12 | 80.05 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 62.84 | 65.26 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.43 | 49.58 |
| SS | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 49.97 | 51.75 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.80 | 19.56 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.23 | 19.78 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.43 | 10.78 |

# ఏపీలో అల్ట్రాటెక్ సిమెంట్ భారీ ప్రాజెక్టు

### మొత్తం పెట్టుబడి రూ.2,500 కోట్లు ● కేంద్ర పర్యావరణ శాఖ గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** సిమెంటు తయారీ సంస్థ అల్ట్రాటెక్... ఆంధ్రప్రదేశ్‌లో భారీ ప్లాంటును ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి సంస్థకు గ్రీన్ సిగ్నల్ లభించింది. కర్నూలు జిల్లా పెట్నికోట వద్ద రానున్న ఈ ప్రాజెక్టుకై అల్ట్రాటెక్ సుమారు రూ.2,500 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఇప్పటికే కంపెనీ 431.92 హెక్టార్ల స్థలాన్ని ప్లాంటు కోసం కొనుగోలు చేసింది. ప్రతిపాదిత ప్రాజెక్టులో భాగంగా 40 లక్షల టన్నుల వార్షిక సామర్థ్యంతో క్లింకర్ యూనిట్, 60 లక్షల టన్నుల సామర్థ్యంతో సిమెంటు తయారీ కేంద్రాలు ఏర్పాటవుతాయి. అలాగే ప్లాంటు అవసరాల కోసం 60 మెగావాట్ల విద్యుత్ ప్లాంటుతోపాటు తయారీ ప్రక్రియలో జనించే వేడి నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే 15 మెగావాట్ల పవర్ ప్రాజెక్టు కూడా రానుంది. 900 మందికి ఈ ప్రాజెక్టు ద్వారా ఉపాధి లభించనుందని సమాచారం. ప్రాజెక్టు ఏర్పాటు, నిర్వహణకై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నుంచి అల్ట్రాటెక్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. విభిన్న రంగాల్లో ఉన్న ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీయే అల్ట్రాటెక్ సిమెంట్. సామర్థ్యం పరంగా భారత్‌లో అతిపెద్ద సిమెంటు ఉత్పత్తిదారుగా నిలిచింది. అయిదు దేశాల్లో విస్తరించిన ఈ సంస్థకు ఏటా 6.8 కోట్ల టన్నుల సిమెంటు తయారీ సామర్థ్యం ఉంది.




# ఏఆర్ఎల్ టైర్స్ కొత్త ప్లాంటు

### రూ.225 కోట్లతో సదాశివపేట వద్ద ఏర్పాటు ● కంపెనీ సీఎండీ అమిత్ కుమార్ అగర్వాల్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఏఆర్ఎల్ బ్రాండ్ పేరుతో టైర్లు, ట్యూబుల తయారీలో ఉన్న హైదరాబాద్ కంపెనీ అగర్వాల్ రబ్బర్ మరో ప్లాంటును ఏర్పాటు చేస్తోంది. హైదరాబాద్ సమీపంలోని సదాశివపేట వద్ద 40 ఎకరాల్లో రూ.225 కోట్లతో దీనిని నెలకొల్పుతోంది. 2020 ఏప్రిల్ నాటికి ఈ ప్లాంటు సిద్ధమవుతుందని అగర్వాల్ రబ్బర్ సీఎండీ అమిత్ కుమార్ అగర్వాల్ సోమవారమిక్కడ మీడియాకు తెలిపారు. తొలుత 80 టన్నుల రోజువారీ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రారంభించి, 300 టన్నుల స్థాయికి తీసుకు వెళతామన్నారు. అంతర్గత వనరుల ద్వారా రూ.100 కోట్ల పెట్టుబడిని సమకూరుస్తున్నామని, కొత్త యూనిట్ ద్వారా 500 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారాయన. ప్రస్తుతం కంపెనీ ఉద్యోగుల సంఖ్య 1,700.


సినీ నటి నిధి అగర్వాల్‌తో అమిత్, మార్కెటింగ్ డైరెక్టర్ కోమల్ అగర్వాల్ (కుడి)

**మూడేళ్లలో రూ.1,000 కోట్లు..:** కంపెనీకి పటాన్‌చెరు, బొల్లారం, సదాశివపేట వద్ద ప్లాంట్లున్నాయి. 1986లో ప్రారంభమైన ఈ సంస్థ టూవీలర్లు, త్రీవీలర్లు, తేలికపాటి ట్రక్కులు, వ్యవసాయ యంత్రాల టైర్లు, ట్యూబులను ఉత్పత్తి చేస్తోంది. 2000 ఏడాది నుంచి ఏఆర్ఎల్ బ్రాండ్‌తో మార్కెట్లోకి వచ్చింది. భారత్‌లో మిలిటరీ విమానాలు, హెలికాప్టర్లకు ట్యూబులను సరఫరా చేస్తున్న ఏకైక కంపెనీ ఇదే. రోజువారీ తయారీ సామర్థ్యం 70 టన్నులు. టర్నోవర్ రూ.300 కోట్లు. ఇది మూడేళ్లలో రూ.1,000 కోట్లకు చేరుతుందని అమిత్ ధీమా వ్యక్తం చేశారు. 'ప్రస్తుతం 50 దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. కొత్త ప్లాంటుతో నూతన మార్కెట్లకు విస్తరిస్తాం. విదేశాల నుంచి 50% ఆదాయం వస్తోంది' అని వివరించారు.

## 'బేసిక్ సేవింగ్స్' ఖాతాలకు మరిన్ని ఉచిత సేవలు

### నిబంధనలను సడలించిన ఆర్‌బీఐ




**ముంబై:** బేసిక్ సేవింగ్స్ ఖాతాదారులు కనీస సదుపాయాలకు తోడు ఇకపై చెక్‌బుక్‌తో పాటు ఇతర సేవలను కూడా ఉచితంగా పొందే అవకాశం వచ్చింది. ఈ సదుపాయాలు కల్పిస్తున్నందుకు కనీస బ్యాలన్స్ ఉంచాలని బ్యాంకులు ఇకపై నిర్దేశించకూడదు. ఎటువంటి కనీస బ్యాలన్స్ అవసరం లేకుండా నిర్వహించేందుకు వీలున్నవే బేసిక్ సేవింగ్స్ ఖాతాలు. చెక్‌బుక్‌తోపాటు ఇతర సదుపాయాలు కోరుకుంటే, బ్యాంకులు కనీస బ్యాలన్స్ ఉంచాలని ప్రస్తుతం కోరుతున్నాయి. అయితే, అందరికీ ఆర్థిక సేవలను చేరువ చేసే లక్ష్యంలో భాగంగా, బ్యాంకులు బీఎస్‌బీడీఏను సేవింగ్స్ ఖాతాగా కొన్ని రకాల సదుపాయాలను, ఎటువంటి చార్జీల్లేకుండానే అందించాలని ఆర్‌బీఐ ఆదేశించింది. కనీస సదుపాయాలకు అదనంగా బ్యాంకులు చెక్‌బుక్ వంటి విలువ ఆధారిత సేవలను ఉచితంగానే అందించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు బీఎస్‌బీడీఏ నిబంధనలను ఆర్‌బీఐ సడలించింది. ఏటీఎంల నుంచి నెలలో నాలుగు సార్లు ఉచితంగా నగదు ఉపసంహరణ, బ్యాంకు శాఖల్లో డిపాజిట్ల జమ, ఏటీఎం కమ్ డెబిట్ కార్డు వంటివి బీఎస్‌బీడీఏలకు కనీస సదుపాయాల్లో భాగంగా ఉన్నాయి.

## ఈడీ విచారణకు కొచర్ గైర్హాజరు



**న్యూఢిల్లీ:** వీడియోకాన్ గ్రూప్‌నకు రుణాలిచ్చిన వ్యవహారంలో ముడుపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈవో చందా కొచర్ సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు విచారణకు హాజరు కాలేదు. అనారోగ్యం రీత్యా హాజరు కాలేకపోతున్నానని ఆమె అధికారులకు తెలియజేసినట్లు సమాచారం. గత వారం కూడా ఇదే కారణంతో ఆమె విచారణకు గైర్హాజరయ్యారు. దీంతో వచ్చే వారం విచారణకు జరవ్వాల్సిందేనని ఆదేశించనున్నట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. ఈడీ గత నెల చందా కొచర్, ఆమె భర్త దీపక్ కొచర్‌లను ప్రశ్నించి, వారి నుంచి స్టేట్‌మెంట్స్ తీసుకుంది. అవసరమైతే మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద అటాచ్ చేసేందుకు వీలుగా వారి ఆస్తుల వివరాలన్నింటినీ మదింపు చేస్తోంది. వీడియోకాన్ గ్రూప్‌నకు ఐసీఐసీఐ బ్యాంక్ రూ.1,875 కోట్ల రుణాలివ్వడంలో చందా కొచర్ పాత్ర ఉందని అభియోగాలున్నాయి.

# కస్టమర్లకూ 'రెపో' లాభం!

**సాక్షి, బిజినెస్ బ్యూరో ప్రతినిధి**

*తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ పరంగా అనేక అడుగులు వేస్తోందని, అందుకే తాము పలు కార్యక్రమాల్లో భాగం కాగలిగామని ప్రైవేటు బ్యాంకింగ్ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ తెలియజేసింది. తెలంగాణలో ప్రస్తుతం తమకు 135 బ్రాంచీలుండగా... ఈ ఏడాది డిసెంబరు ఆఖరునాటికి మరో 30 ఏర్పాటు చేస్తామని తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే 150 బ్రాంచీలున్నాయని... డిసెంబరు ఆఖరికల్లా రెండు రాష్ట్రాల్లోనూ ఇంచుమించు సమాన సంఖ్యలో బ్రాంచీలుంటాయని యాక్సిస్ బ్యాంక్ బ్రాంచ్ బ్యాంకింగ్ హెడ్ రవి నారాయణన్ చెప్పారు. సోమవారమిక్కడకు వచ్చిన సందర్భంగా సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ఏపీ, తెలంగాణ సర్కిల్ మధుసూదన రావుతో కలిసి ఆయన 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇంటర్వ్యూ ముఖ్యాంశాలివీ...*

### యాక్సిస్ బ్యాంక్ బ్రాంచ్ బ్యాంకింగ్ హెడ్ రవి నారాయణన్

- తగ్గింపు ప్రయోజనం త్వరలోనే బదలాయింపు
- సంప్రదాయక వర్గీకరణ వల్లే ఎన్‌పీఏలు అలా...
- బ్యాంకులకు ఏమాత్రం నగదు కొరత లేదు
- ప్రతి బ్రాంచిలోనూ కొత్త ఏటీఎం ఏర్పాటు
- బ్రోకింగ్ కస్టమర్ల కోసం 'ట్రేడ్ – 20'
- తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పలు కార్యక్రమాలు
- చాలా పథకాలకు అధికారిక బ్యాంకర్లం మేమే



సాక్షి ఇంటర్వ్యూ

**తెలంగాణ ప్రభుత్వం అనేకరకాలుగా ముందుకొస్తున్నట్లు మీరు చెబుతున్నారు. ఏ రకంగానో చెప్పగలరా?**

సిద్ధిపేటను నగదు రహితంగా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా మేం 10 గ్రామాలను దత్తత తీసుకుని అందరికీ ఖాతాలు తెరిచాం. అన్ని దుకాణాలకూ ఈడీసీ మెషీన్లు అందజేశాం. ఇక ప్రభుత్వ ఈ–ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌కు, గనులు–భూగర్భ వనరుల శాఖ లావాదేవీలకు, ఇసుక నిర్వహణ వ్యవస్థకు, ఫాస్టాగ్ సొల్యూషన్స్‌కు, ఫిషరీస్ విభాగ బ్లూ రివొల్యూషన్ పథకానికి, పశు సంవర్థక శాఖ గొర్రెలు–మేకల పథకానికి ఇలా అన్నిటికీ మేం అధికారిక బ్యాంకరుగా వ్యవహరిస్తున్నాం. తెలంగాణ ప్రభుత్వ డెయిరీకి కూడా నగదు నిర్వహణ సేవలందిస్తున్నాం.

**ఇలాంటి ఒప్పందాలు మిగతా ఏ రాష్ట్రంతోనైనా ఉన్నాయా?**

గుజరాత్, ఉత్తరాఖండ్, కర్ణాటక... ఇలా చాలా రాష్ట్రాలతో రకరకాల అంశాలకు సంబంధించి ఒప్పందాలున్నాయి. పలు సేవలందిస్తున్నాం. ఇలాంటివన్నీ మా నుంచి కాకుండా స్థానికంగా ఉండే ప్రభుత్వాన్ని బట్టే ఉంటాయి. ప్రభుత్వం ముందుకొచ్చి పారదర్శకంగా, వేగవంతమైన సేవలందిస్తామంటే ఇలాంటివి ఎన్నయినా సాధ్యమవుతాయి.

**సరే! ఆర్‌బీఐ గడిచిన ఆరు నెలల్లో రెపోరేటు ముప్పావు శాతం... అంటే 75 బేసిస్ పాయింట్లు తగ్గించింది. కానీ ఏ బ్యాంకూ దీన్ని పూర్తిగా వినియోగదారుకు అందించలేదు. ఎందుకని?**

నిజం! ఆర్‌బీఐ మూడు దఫాలుగా రెపో రేటు తగ్గించినా అదింకా పూర్తిగా వినియోగదారు స్థాయికి చేరలేదు. కాకపోతే మా బ్యాంకయినా, ఏ బ్యాంకయినా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవటానికి కొంత సమయం పడుతుంది. గతంలో ఇలాంటివి వినియోగదారు స్థాయికి బదిలీ కావటానికి చాలా సమయం పట్టేది. ఇప్పుడు ఆ ప్రక్రియ మెరుగుపడి, వేగవంతమయింది. మొదట డిపాజిట్లపై వడ్డీ రేట్లు తగ్గించటంతో మొదలై.. మెల్లగా రుణాలపై రేట్లు కూడా తగ్గుతాయి. త్వరలోనే ఈ ప్రయోజనాన్ని కస్టమర్లకు బదిలీ చేస్తాం. కాకపోతే ఎంత సమయం పడుతుందన్నది ఇప్పుడు చెప్పలేం.

**మిగతా ప్రయివేటు బ్యాంకులతో పోలిస్తే యాక్సిస్ బ్యాంకు నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) చాలా ఎక్కువ. ఎప్పటికప్పుడు తగ్గుతాయని చెబుతున్నా కావటం లేదు. ఎందుకని?**

మిగతా ప్రయివేటు బ్యాంకులతో పోలిస్తే ఎన్‌పీఏలకు కేటాయింపుల విషయంలో మేం చాలా సంప్రదాయకంగా వ్యవహరిస్తున్నాం. అంటే ఎక్కువ కేటాయింపులు చేస్తున్నాం. ఏ కొంచెం అవకాశమున్న ఖాతాలనైనా దాచకుండా ఎన్‌పీఏలుగా వర్గీకరిస్తున్నాం. ఈ కారణాల వల్లే మా ఎన్‌పీఏలు కొంచెం ఎక్కువ ఉండొచ్చు. కానీ ఇలా వ్యవహరించటం బ్యాంకు ఆరోగ్య రీత్యా మంచిదే.

**ఎన్‌బీఎఫ్‌సీ, హెచ్‌ఎఫ్‌సీల సంక్షోభం మాటేంటి? ఇందులో మీ బ్యాంకు వాటా ఎంత?**

సంక్షోభం కొలిక్కి వస్తుందనే నేను భావిస్తున్నాం. చర్చల ప్రక్రియతో ఇలాంటి సంక్షోభాలను మరింత ముదరకుండా నివారించవచ్చన్నది నా నమ్మకం. మాకు వీటిలో ఎంత వాటా ఉందనేది ఇప్పుడు చెప్పటం సాధ్యం కాదు.

**బ్రోకింగ్ సేవల విషయానికొస్తే మీరెందుకు చాలా వెనకబడ్డారు?**

నిజమే! ఇప్పుడొచ్చిన డిస్కౌంట్ స్టాక్ బ్రోకరేజీ సంస్థలు, ఇతరులతో పోలిస్తే యాక్సిస్ డైరెక్ట్ కొంత వెనకబడినట్టే. కాకపోతే మేం కస్టమర్ల సంఖ్యపై కాకుండా మా కస్టమర్లకు ఈ సేవల్ని ఎంత మెరుగ్గా అందించగలమనే అంశంపైనే దృష్టి పెడుతున్నాం. ఇటీవలే ట్రేడ్–20ని అమల్లోకి తెచ్చాం. దీనిద్వారా షేర్లకు సంబంధించి ఏ లావాదేవీకైనా రూ.20 మాత్రమే వసూలు చేస్తాం. కాకపోతే కస్టమర్లు తమ ఖాతాల్లో రూ.75వేల సగటు బ్యాలెన్స్ నిర్వహించాలనే షరతు ఉంది. బ్రోకింగ్ సేవల్ని ఇపుడు బాగా విస్తరిస్తున్నాం. మా మొబైల్ బ్యాంకింగ్, బ్రోకింగ్ యాప్‌లు చాలా మెరుగ్గా పనిచేస్తున్నాయి.

**మీకింకా నగదు కొరత ఉందా? ఏటీఎంలు తగ్గిస్తున్నారా?**

అలాంటిదేమీ లేదు. ఇపుడు రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) అందరికీ పుష్కలంగా నగదు అందుబాటులో ఉంచుతోంది. కొత్త వాటితో సహా ప్రతి బ్రాంచిలోనూ ఏటీఎంను ఏర్పాటు చేస్తున్నాం. దేశవ్యాప్తంగా ఈ ఏడాది మార్చి 31 నాటికి మాకు 4,050 బ్రాంచీలు, 11,801 ఏటీఎంలు ఉన్నాయి. ముందుముందు బ్యాంకింగ్ కార్యకలాపాలన్నీ జరుపుకోవటానికి వీలయ్యే సెల్ఫ్ సర్వీస్ ఏటీఎంల ఏర్పాటుపై దృష్టి సారిస్తున్నాం.

# ఆదిత్య బిర్లా ఫ్యాషన్ చేతికి జేపోర్ బ్రాండ్

### డీల్ విలువ రూ.110 కోట్లు

**ముంబై:** ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ (ఏబీఎఫ్ఆర్ఎల్) కంపెనీ ఎథ్నిక్ వేర్ బ్రాండ్స్– జేపోర్, టీజీ అప్పారెల్ అండ్ డెకార్‌లను కొనుగోలు చేస్తోంది. జేపోర్ బ్రాండ్‌ను రూ.110 కోట్లకు, టీజీ అప్పారెల్ అండ్ డెకార్ బ్రాండ్‌ను రూ.25 కోట్లకు కొనుగోలు చేయనున్నామని ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ తెలిపింది. ఈ డీల్ 30– 45 రోజుల్లో పూర్తవ్వగలదని పేర్కొంది. ఎథ్నిక్ అప్పారెల్, యాక్సెసరీల విభాగంలో మరింత పటిష్టవంతం కావడానికి ఈ బ్రాండ్స్‌ను కొనుగోలు చేస్తున్నామని వివరించింది. 2012లో ఆరంభమైన జేపోర్ బ్రాండ్... చేతితో తయారు చేసిన దుస్తులను, ఆభరణాలను, హోమ్ టెక్స్‌టైల్స్‌ను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విక్రయిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీ రూ.39 కోట్ల ఆదాయం ఆర్జించింది. టీజీ అప్పారెల్ అండ్ డెకోర్ గత ఆర్థిక సంవత్సరంలో రూ.34 కోట్ల టర్నోవర్‌ను సాధించింది.

**దేశవ్యాప్తంగా 2,714 బ్రాండ్ స్టోర్స్.....**

ఈ రెండు బ్రాండ్ల కొనుగోళ్లతో బ్రాండెడ్ ఫ్యాషన్ స్పేస్‌లో తమ స్థానం మరింత పటిష్టమవుతుందని ఏబీఎఫ్ఆర్ఎల్ ఎమ్‌డీ,, అశీష్ దీక్షిత్ పేర్కొన్నారు. ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన ఏబీఎఫ్ఆర్ఎల్ దేశవ్యాప్తంగా 750 నగరాల్లో 2,714 బ్రాండ్ స్టోర్స్‌ను నిర్వహిస్తోంది. లూయీ ఫిలిప్, వాన్ హ్యూసెన్, అలెన్ సోలే, పీటర్ ఇంగ్లాండ్ వంటి బ్రాండ్ల దుస్తులను విక్రయిస్తోంది. పాంటలూన్స్ పేరుతో వేల్యూ ఫ్యాషన్ స్టోర్ బ్రాండ్‌ను కూడా నిర్వహిస్తోంది. ద కలెక్టివ్, టెడ్ బేకర్, రాల్ఫ్ లారెన్, అమెరికన్ ఈగిల్, సిమన్ కార్టర్ వంటి ఇంటర్నేషనల్ బ్రాండ్లను కూడా విక్రయిస్తోంది. బ్రాండ్ల కొనుగోళ్ల వార్తల నేపథ్యంలో బీఎస్ఈలో ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ షేర్ 0.3 శాతం లాభంతో రూ.219 వద్ద ముగిసింది.




# నాలుగో నెల్లోనూ మారుతీ కోత

### 18 శాతం తగ్గిన వాహన తయారీ ● డిమాండ్ మందగమనమే కారణం

**న్యూఢిల్లీ:** వాహన దిగ్గజం, మారుతీ సుజుకీ ఇండియా గత నెలలో వాహన ఉత్పత్తిని 18 శాతం తగ్గించింది. ఈ కంపెనీ వాహనాల ఉత్పత్తిలో కోత విధించడం ఇదివరుసగా నాలుగో నెల. మారుతీ సుజుకీ ఇండియా ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు నివేదించింది. వివరాలివీ...

- గత ఏడాది మేలో ఈ కంపెనీ 1,84,612 వాహనాలను తయారు చేసింది.
- ఈ ఏడాది మేలో మాత్రం వాహనాల ఉత్పత్తి 18% తగ్గి 1,51,188కు పరిమితమైంది
- తేలిక రకం వాణిజ్య వాహనం సూపర్ క్యారీ మినహా అన్ని సెగ్మెంట్లలలో అన్ని మోడళ్ల వాహన తయారీ తగ్గిపోయింది.
- ఆల్టో, స్విఫ్ట్, డిజైర్‌లతో కూడిన ప్రయాణికుల వాహన ఉత్పత్తి 1,82,571 నుంచి 19 శాతం తగ్గి 1,48,095కు తగ్గిపోయింది.
- మినీ సెగ్మెంట్ వాహన తయారీ 42 శాతం తగ్గి 23,874కు పరిమితమైంది.
- కాంపాక్ట్ సెగ్మెంట్ కార్లతయారీనీమారుతీ తగ్గించింది. గత ఏడాది మేలో 93,641గా ఉన్న ఈ విభాగం కార్ల తయారీ ఈ ఏడాది మేలో 10% తగ్గి 84,705కు చేరింది.
- యుటిలిటి వెహికల్స్ ఉత్పత్తి 25,571 నుంచి 3 శాతం తగ్గి 24,748కు పడిపోయింది.
- వ్యాన్‌ల తయారీ 16,819 నుంచి 35 శాతం క్షీణించి 10,934కు పరిమితమైంది.
- మే నెలలోనే కాకుండా ఈ ఏడాది ఏప్రిల్, మార్చి నెలల్లో కూడా మారుతీ కంపెనీ తన అన్ని ప్లాంట్లలో వాహన తయారీలో 10 శాతం కోత విధించింది. ఇక ఈ ఏడాది ఫిబ్రవరిలో వాహనాల తయారీని 8 శాతం మేర తగ్గించింది.



**విక్రయాలపై ప్రభావం ఉండబట్టే...**

ఇటీవల కాలంలో వాహన విక్రయాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. డిమాండ్ మందగించటంతో పలు కంపెనీలు ఉత్పత్తిలో కోత విధిస్తున్నాయి. మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ అయితే ఏకంగా తన ప్లాంట్లన్నింటినీ 13 రోజుల పాటు మూసేసింది. మార్కెట్ డిమాండ్ సర్దుబాటు నిమిత్తం ప్లాంట్లన్నింటినీ కొన్ని రోజులు మూసేయక తప్పలేదని ఈ కంపెనీ పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రయాణికుల వాహన విక్రయాలు 17 శాతం తగ్గాయి. ఇది దాదాపు ఎనిమిదేళ్ల కనిష్ట స్థాయి. నిధుల కొరత సమస్యకు తోడు సెంటిమెంట్ బలహీనంగా ఉండటంతో వాహన విక్రయాలు తగ్గుతున్నాయి. పండుగల సీజన్ వరకూ ఇదే ధోరణి కొనసాగుతుందని, పండుగల సీజన్‌లో అమ్మకాలు పుంజుకునే అవకాశాలున్నాయని వాహన కంపెనీలు ఆశిస్తున్నాయి.

# అలాగైతే 'షాక్' తప్పదు!

- ఎలక్ట్రిక్ వాహనాలను బలవంతంగా రుద్దకూడదు
- వినియోగదారుల సహకారం అవసరం
- చార్జింగ్ వంటి మౌలిక సదుపాయాలుండాలి
- వాహన పరిశ్రమ స్పందన




**న్యూఢిల్లీ:** దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి సంబంధించి తగిన ప్రణాళికను రూపొందించాలని ప్రభుత్వానికి సియామ్ (సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్) సూచించింది. ఈ ప్రణాళిక అదరాబాదరగా కాకుండా, వాస్తవిక పరిస్థితులను ప్రతిబింబించేలా ఉండాలని పేర్కొంది.

**ఐసీఈ అమ్మకాలపై నిషేధం...**

టూ, త్రీ వీలర్లలో ఉపయోగించే ఇంటర్నల్ కంబశ్చన్ ఇంజిన్‌ల (ఐసీఈ) అమ్మకాలను 2025 కల్లా నిషేధించాలని ప్రభుత్వం యోచిస్తోందన్న వార్తలు వచ్చాయి. ఈ వార్తల ప్రకారం 2023 కల్లా త్రీ వీలర్లలో ఉపయోగించే ఐసీఈలను, 2025 కల్లా టూ వీలర్లలో ఉపయోగించే ఐసీఈలను ప్రభుత్వం నిషేధించనుంది. అయితే ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఐసీఈల అమ్మకాలను ఇంత త్వరితంగా నిషేధించడం సరైన చర్య కాదని టూ వీలర్ దిగ్గజ కంపెనీలు వ్యాఖ్యానించాయి. ఇలాంటి చర్య వాహన పరిశ్రమనే అతలాకుతలం చేసే అవకాశాలున్నాయని హెచ్చరించాయి.

**ఆచరణ యోగ్యం కాదు: రాజీవ్ బజాజ్**

ఐసీఈల అమ్మకాలను నిషేధించాలన్న ప్రభుత్వ ప్రతిపాదన ఆచరణ యోగ్యం కాదని బజాజ్ ఆటో ఎమ్‌డీ రాజీవ్ బజాజ్ పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం ఏ కంపెనీ కూడా సరైన స్థాయిలో ఎలక్ట్రిక్ వాహనాలను తయారు చేయడం లేదన్నారు. బీఎస్ సిక్స్ ప్రమాణాల అమలు త్వరలోనే ప్రారంభం కానున్నదని, అప్పుడే దానికి గడువును నిర్దేశించడం సరైనది కాదని పేర్కొన్నారు. కార్లకు మినహాయింపు ఇచ్చి, టూ, త్రీవీలర్లను టార్గెట్ చేయడం ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రోత్సాహమివ్వాలనే చర్య అసంపూర్తిగా ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. భారత్‌లో కాలుష్యం అధికంగా ఉన్న నగరాల్లో 2023 నుంచి లేదా 2025 నుంచి ఎలక్ట్రిక్ వాహనాలనే అనుమతించేలా మధ్యే మార్గాన్ని అనుసరించాలని ఆయన సూచించారు. ఈ నగరాల్లో వచ్చిన అనుభవాల ఆధారంగా సమగ్రమైన ప్రణాళికను రూపొందించడం సముచితంగా ఉంటుందని పేర్కొన్నారు.

### వాహన పరిశ్రమపై ప్రభావం

ప్రజలంతా ఎలక్ట్రిక్ టూ, త్రీ వీలర్లను వాడాల్సిందిగా బలవంతంగా అవాస్తవిక గడువును రుద్దడం సరైన చర్య కాదని టీవీఎస్ మోటార్ కంపెనీ చైర్మన్ వేణు శ్రీనివాసన్ వ్యాఖ్యానించారు. ఇది వినియోగదారుల్లో అసంతృప్తిని పెంచుతుందని, అంతేకాకుండా 40 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్న వాహన పరిశ్రమనే అతలాకుతలం చేస్తుందని హెచ్చరించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేలా దశలవారీగా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. వినియోగదారుల సహకారంతోనే ఇలాంటివి సాకారమవుతాయని పేర్కొన్నారు. వాహనాల చార్జింగ్‌కు చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, బ్యాటరీల లభ్యత తదితర అవసరాలను తీర్చేలా మౌలిక సదుపాయాలను కల్పించాల్సి ఉందని వివరించారు. కాగా, ఎలక్ట్రిక్ వాహనాల వాడకానికి సంబంధించిన లక్ష్యాలను, గడువు తేదీలపై అందర్నీ సంప్రదించిన తర్వాతనే తుది నిర్ణయం తీసుకోవాలని పరిశ్రమల సమాఖ్య, సీఐఐ కూడా సూచించింది.

# ఈ ఏడాదే రియల్‌మీ 5జీ స్మార్ట్‌ఫోన్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** త్వరలోనే మార్కెట్లోకి 5 జీ స్మార్ట్‌ఫోన్లు రానున్నాయి. ఈ ఏడాది ఆఖర్లోగా ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ రియల్‌మీ.. 5జీ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేయనుంది. తొలుత ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తామని.. ఆ తర్వాత ఇండియన్ మార్కెట్లోకి తెస్తామని రియల్‌మీ ఇండియా సీఈఓ మాధవ్ సేథ్ చెప్పారు. త్వరలోనే ఇండియన్ మార్కెట్లో రియల్‌మీ ఎక్స్ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేయనుంది. ఒప్పో సబ్ బ్రాండ్‌గా ఇండియన్ స్మార్ట్‌ఫోన్ విపణిలోకి ఎంట్రీ ఇచ్చిన రియల్‌మీ.. తక్కువ కాలంలోనే ప్రత్యేక బ్రాండ్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఇండియాతో పాటూ చైనా, తైవాన్‌లో ఉత్పత్తులను విక్రయిస్తోంది.



**ఆఫ్‌లైన్‌లోకి రియల్‌మీ..:** ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో మాత్రమే దొరికే రియల్‌మీ స్మార్ట్‌ఫోన్లు ఇక ఆఫ్‌లైన్ స్టోర్లలోనూ లభ్యంకానున్నాయి. ఈ ఏడాది ముగింపు నాటికి 150 నగరాల్లో ఆఫ్‌లైన్ స్టోర్లలోకి విస్తరిస్తామని సోమవారమిక్కడ మాధవ్ సేథ్ మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆఫ్‌లైన్ మార్కెట్లోకి రియల్‌మీ సీ2 స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేశారు. ఈ నెల 15 నుంచి దేశంలోని 8 వేల స్టోర్లలో ఈ ఫోన్లు లభ్యమవుతాయని, తెలంగాణలో 158 స్టోర్లలో అందుబాటులో ఉంటాయని చెప్పారాయన. మూడు వేరియంట్లలో అందుబాటులో ఉండే ఈ ఫోన్ల ధర రూ.5,999. దేశవ్యాప్తంగా రియల్‌మీకి 283 సర్వీసెంటర్లు ఉండగా.. తెలంగాణలో 5 ఉన్నాయి. ఈ ఏడాది హైదరాబాద్‌లో ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌ను ప్రారంభిస్తామని మాధవ్ చెప్పారు.



అబ్దుల్లా బాసిత్



అసియా ఆంద్రాబీ

# బాసిత్ కోణంలోనూ ఆంద్రాబీ విచారణ?

- ఎన్‌ఐఏ కస్టడీలో కశ్మీర్ వేర్పాటువాద నాయకురాలు
- గతంలో రెండుసార్లు హైదరాబాద్‌కు వచ్చి వెళ్లిన వైనం

**సాక్షి, హైదరాబాద్:** కశ్మీర్ వేర్పాటువాద సంస్థ దుఖ్తరాన్–ఏ–మిల్లత్ వ్యవస్థాపక అధ్యక్షురాలు అసియా ఆంద్రాబీని నగరవాసి అబ్దుల్లా బాసిత్ కోణంలోనూ జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) అధికారులు విచారించనున్నారని తెలిసింది. ఆమె ఉగ్రవాద కార్యకలాపాలకు అవసరమైన నిధుల సమీకరణ కేసులో అరెస్టు అయి, ప్రస్తుతం ఎన్‌ఐఏ ఢిల్లీ యూనిట్ అదుపులో ఉన్నది. ఈమెకు నగరంతోనూ కొన్నిలింకులు ఉన్నాయి. 2015లో నగరంలో చిక్కిన బాసిత్ నేతృత్వంలోని 'ఐసిస్ త్రయం'సైతం కశ్మీర్ వెళ్లి ఈమెను కలవడానికి ప్రయత్నాలు చేసినట్లు ఎన్‌ఐఏ అధికారులు కనుగొన్నారు. ఉగ్ర నిధుల కేసులో ఎన్‌ఐఏ అధికారులు ఈ నెల 4న అసియా ఆంద్రాబీతో పాటు ముసరత్ ఆలం, షాబీర్ షాలను అరెస్టు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం పది రోజుల పాటు వీరిని ఎన్‌ఐఏ కస్టడీలోకి తీసుకుని విచారిస్తోంది. అప్పట్లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నిషిద్ధ స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా(సిమి) జాతీయ మాజీ అధ్యక్షుడు సయ్యద్ సలావుద్దీన్ కుటుంబాన్ని 2014లో నగరంలో ఆమె పరామర్శించి వెళ్లినట్లు నిఘా వర్గాలు చెప్తున్నాయి. ఐసిస్‌లో చేరేందుకు సిరియా వెళ్లే ప్రయత్నాల్లో ఉన్న అబ్దుల్లా బాసిత్(గత ఏడాది మళ్లీ అరెస్టు అయ్యాడు) సయ్యద్ ఒమర్ ఫారూఖ్ హుస్సేనీ, మాజ్ హసన్ ఫారూఖ్‌లను 2015 డిసెంబర్‌లో సిట్ పోలీసులు నాగ్‌పూర్ విమానాశ్రయంలో పట్టుకున్నారు. 'సిమి'సలావుద్దీన్‌కు బంధువులైన వీరు నాగ్‌పూర్ నుంచి విమానంలో శ్రీనగర్ వెళ్లి అసియాను కలవాలనే ఉద్దేశంతో బయలుదేరారనే విషయం వెలుగులోకి వచ్చింది. ఈమె కుమారుడు సైతం నగరంలోని ఓ విద్యా సంస్థలో విద్యనభ్యసించాడు. ఈ నేపథ్యంలోనే 2012లోనూ ఆంద్రాబీ ఓసారి హైదరాబాద్‌కు వచ్చి వెళ్లారని సమాచారం. పాక్ అనుకూలవాదిగా ముద్రపడ్డ ఆంద్రాబీ 2015 సెప్టెంబర్‌లో కశ్మీర్‌లో పాకిస్తాన్ జాతీయ జెండాలను ప్రదర్శించి వివాదాస్పదమయ్యారు. దీనిపై కేసు నమోదు చేసిన శ్రీనగర్ పోలీసులు ఆమెను అరెస్టు కూడా చేశారు. 2016లో ఓ సందర్భంలో జాతీయ మీడియాతో మాట్లాడిన అసియా హైదరాబాద్ వచ్చి సలావుద్దీన్ కుటుంబాన్ని పరామర్శించినట్లు అంగీకరించారు. తాజాగా 'అబుదాబి మాడ్యుల్' కేసులో గత ఏడాది బాసిత్ అరెస్టు కావడం, ఇప్పుడు ఆంద్రాబీ సైతం ఎన్‌ఐఏ కస్టడీలో ఉండటంతో ఆమెను బాసిత్‌కు సంబంధించిన వివరాలపై ప్రశ్నించే అవకాశం ఉందని తెలిసింది.

# సాక్షుల్ని ప్రభావితం చేస్తారు

- రవిప్రకాశ్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు
- ప్రభుత్వం తరఫున హరేన్ రావల్ వాదన
- విచారణ నేటికి వాయిదా





**సాక్షి, హైదరాబాద్:** టీవీ9 యాజమాన్యం దాఖలు చేసిన కేసులో నిందితుడైన ఆ చానల్ మాజీ సీఈవో రవిప్రకాశ్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేయవద్దని తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో గట్టిగా వాదించింది. బెయిల్ మంజూరు చేస్తే రవిప్రకాశ్ సాక్షులను, ఆధారాలను ప్రభావితం చేస్తారని, పైగా మరో నిందితుడు నటుడు శివాజీ పరారీలో ఉన్నారని, ఈ నేపథ్యంలో రవిప్రకాశ్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే కేసు దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశాలు బాగా ఉన్నాయని పేర్కొంది. కింది కోర్టే కాకుండా సుప్రీంకోర్టు సైతం రవిప్రకాశ్‌కు బెయిల్ ఇవ్వలేదని తెలంగాణ పోలీసుల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది హరేన్ రావల్ వాదించారు. తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రవిప్రకాశ్ దాఖలు చేసిన వ్యాజ్యంపై సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గండికోట శ్రీదేవి ఎదుట వాదప్రతివాదనలు జరిగాయి. ఇప్పటికే కింది కోర్టు రవిప్రకాశ్ బెయిల్ దరఖాస్తును కొట్టివేసిందని, సుప్రీంకోర్టుకు వెళితే అరెస్ట్ నోటీసుకు 48 గంటల గడువు ఇవ్వాలని పేర్కొందని హరేన్ రావల్ చెప్పారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ 'కింది కోర్టు ఉత్తర్వులకు ఇక్కడ సంబంధం లేదు. సుప్రీంకోర్టు రవిప్రకాశ్‌ను అరెస్ట్ చేయాలని ఆర్డర్ ఏమీ ఇవ్వలేదు'అని వ్యాఖ్యానించారు. రవిప్రకాశ్‌ను అరెస్ట్ చేయకూడదని కూడా సుప్రీంకోర్టు పేర్కొనలేదని, 48 గంటల ముందు నోటీసు ఇవ్వాలని మాత్రమే చెప్పిందని న్యాయవాది బదులిచ్చారు. ఏబీసీఎల్‌లో రవిప్రకాశ్‌కు పది శాతమే వాటా ఉందని, 40 వేల షేర్లను రూ.20 లక్షలకు నటుడు శివాజీకి అమ్మినట్లుగా గత ఏడాది తప్పుడు పత్రాలు సృష్టించారని హరేన్ రావల్ చెప్పారు. గత ఏడాది ఫిబ్రవరిలోనే వాటాల్ని విక్రయించడం నిజమైతే ఆ విషయాల్ని ఆదాయపు పన్ను శాఖకు అందజేసిన రిటర్న్‌లో ఎందుకు పేర్కొనలేదన్నారు. షేర్ల అమ్మకాల గురించిగానీ, తద్వారా వచ్చిన రూ.20 లక్షల సొమ్ము గురించిగానీ రవిప్రకాశ్ లేదా శివాజీ ఆదాయపు పన్ను పత్రాల్లోనే కాకుండా రికార్డుల్లో కూడా ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. రూ.140 కోట్లతో 90 శాతం టీవీ9 వాటాల కొనుగోలుకు ఏబీసీఎల్, అలందాల మధ్య ఒప్పందం కుదిరిందని తెలిపారు. అయితే, ఫోర్జరీ ద్వారా తప్పుడు పత్రాల్ని సృష్టించి అమ్మకాలను అడ్డుకునేందుకు రవిప్రకాశ్ కుట్ర పన్నారని ఆరోపించారు. టీవీ9, బ్రాండ్ పేరును రవిప్రకాశ్ రూ.99 వేలకు చట్ట వ్యతిరేకంగా అమ్మేయడమే కాకుండా మరో మీడియా సంస్థకు అక్రమంగా నిధులు మళ్లించారని పేర్కొన్నారు. తప్పు చేశారు కాబట్టే రవిప్రకాశ్ తప్పించుకు తిరిగారని, ఇప్పటికీ శివాజీ పరారీలో ఉన్నారని హరేన్ రావల్ వాదించారు. కేసు విచారణకు హాజరు కాకుండా కోర్టుల చుట్టూ తిరిగి బెయిల్ మంజూరు కోసం చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాక పోలీసుల దర్యాప్తునకు రావడం ప్రారంభించారని పేర్కొన్నారు. దర్యాప్తులో కూడా పొంతనలేని జవాబులు చెబుతున్నారని, మీడియా రంగంలో ఉన్న నేపథ్యంలో ఆయనకు ఉన్న పరిచయాల దృష్ట్యా సాక్షుల్ని ప్రభావితం చేయవచ్చని, ఈ దశలో రవిప్రకాశ్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని రావల్ వాదించారు.

### మౌనంగా ఉండటమూ హక్కే..

రవిప్రకాశ్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దిల్‌జిత్ సింగ్ అహ్లూవాలియా వాదిస్తూ.. బెయిల్ మంజూరుకు ఎలాంటి షరతులు విధించినా అభ్యంతరం లేదన్నారు. పోలీసులు 40 గంటలపాటు విచారించారని, పోలీసులు తాము కోరుకున్న జవాబులు రాబట్టాలని ప్రయత్నిస్తున్నారని చెప్పారు. కొన్ని సందర్భాల్లో మౌనంగా ఉండటం కూడా హక్కేనని చెప్పారు. టీవీ9లో శ్రీనిరాజుకు ఉన్న 90 శాతం వాటాను కొనుగోలుకు సైఫ్ మారిషస్‌తో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించారని, జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ నుంచి సైఫ్ మారిషస్ స్టే ఉత్తర్వులు ఉన్నా వేరే వారికి రూ.500 కోట్లకు విక్రయించారని తెలిపారు. ఒక్కసారిగా సైఫ్ మారిషస్ ఆ కేసును వెనక్కి తీసుకుందని, దీని వెనుక రహస్య ఒప్పందం ఉందని ఆరోపించారు. ఫెమా చట్టాన్ని ఉల్లంఘించి లావాదేవీలు నిర్వహించారని, రూ.294 కోట్లు టెర్రరిస్టుల్లాంటి వారికి అందే హవాలా తరహాలో బదిలీలు జరిగాయని, దీనిపై రవిప్రకాశ్ సీబీఐ, ఈడీలకు ఫిర్యాదు చేశాక రాష్ట్ర ప్రభుత్వం ఆయన వెంటపడిందని చెప్పారు. ఈ కేసుల వెనుక కుట్ర ఉందని, ఒక కేసులో స్టేషన్ హౌస్ ఆఫీసర్ కాకుండా ఏసీపీ స్థాయి అధికారి విచారిస్తున్నారని చెప్పగా, హరేన్ రావల్ కల్పించుకుని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఈ విధంగా విచారించే వీలుందన్నారు. విచారణ మంగళవారానికి వాయిదా పడింది.

# 'పోడు' సమస్యపై 'సుప్రీం'లో ఇంప్లీడ్ అవుతాం

## టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం

**సాక్షి, హైదరాబాద్:** పోడు వ్యవసాయ సమస్య పరిష్కారం కోసం సుప్రీంకోర్టులో ఉన్న కేసులో తాము ఇంప్లీడ్ అవుతామని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం తెలిపారు. పోడు వ్యవసాయ భూముల సమస్య పరిష్కారమయ్యే వరకు తాము అండగా నిలుస్తామని చెప్పారు. 'చలో ఏటూరు నాగారం– పోడు రైతుల హక్కుల రక్షణ సభ'పోస్టర్‌ను సోమవారం ఇక్కడి టీజేఎస్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అటవీహక్కుల చట్టం, అటవీ, రెవెన్యూ భూముల సర్వే ద్వారా పోడు భూముల సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. అటవీ రక్షణ, హరితహారం పేరుతో పోడు వ్యవసాయ భూముల్లో అటవీ అధికారులు కందకాలు తవ్వుతున్నారని, అడ్డు చెబితే కేసులు పెడతామని బెదిరిస్తున్నారని విమర్శించారు. 'పాతవి వదలం.. కొత్తవి కొట్టం.. మావి మాకు కావాలి..'అని ఆదివాసులు అడుగుతున్నారని పేర్కొన్నారు. ఆదివాసీ, గిరిజన, పోడు రైతుల హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 11న ఏటూరునాగారంలో జరగనున్న బహిరంగసభను జయప్రదం చేయాలని కోరారు.

### ఫిరాయింపులపై కేంద్రం మీలాగే చేస్తే ఏం చేస్తారు?

పార్టీ ఫిరాయింపులపై కేంద్రం టీఆర్‌ఎస్‌పట్ల అలాగే వ్యవహరిస్తే ఏం చేస్తారని కోదండరాం ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో టీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలను చేర్చుకుంటే అంతా ముక్తకంఠంతో ఖండించారని, సూత్రాలు, సిద్ధాంతాల గురించి మాట్లాడిన టీఆర్‌ఎస్ ఇప్పుడు అధికారంలోకి రాగానే వాటిని ప్రోత్సహించడం సరికాదన్నారు. గోదావరి తీర ప్రాంత ఆదివాసులు ఓటు ద్వారా అధికార టీఆర్‌ఎస్‌పై నిరసనను వ్యక్తం చేసి ప్రతిపక్ష ఎమ్మెల్యేలను గెలిపిస్తే వారు అక్కడి ప్రజలను పట్టించుకోకుండా అధికార టీఆర్‌ఎస్‌లోకి వలస వెళ్లారన్నారు.




# 'ఐటీ గ్రిడ్స్' నిందితులకు బెయిల్

## షరతులతో ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు

**సాక్షి, హైదరాబాద్:** ఓటర్ల డేటా, ఆధార్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని చోరీ చేశారనే ఆరోపణలున్న కేసులో ఐటీ గ్రిడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండి డి.అశోక్, ఆ సంస్థ డైరెక్టరైన ఆయన భార్య శ్రీలక్ష్మికి షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. అత్యంత కీలకమైన ఓటర్, ఆధార్, వ్యక్తిగత సమాచారాన్ని చోరీ చేశారని ఐటీ గ్రిడ్స్‌పై డేటా విశ్లేషకులు టి.లోకేశ్వర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై హైదరాబాద్‌లోని ఎస్సార్‌నగర్, మాదాపూర్ పోలీస్ స్టేషన్లల్లో కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో పోలీసుల దర్యాప్తునకు సహకరిస్తామని, తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని వారిద్దరూ దాఖలు చేసిన వ్యాజ్యాలను సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గండికోట శ్రీదేవి విచారించారు. ఇద్దరికీ షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. రూ.25 వేల విలువైన పూచీకత్తులను ఇద్దరూ సమర్పించాలని, సంబంధిత పోలీస్‌స్టేషన్లలో రోజూ హాజరుకావాలని, ఏదైనా కోర్టులో పాస్‌పోర్టులు సరెండర్ చేయాలని, కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని హైకోర్టు షరతులు విధించింది. ఐటీ గ్రిడ్స్‌తో తెలుగుదేశం పార్టీ చేతులు కలిపి కీలకమైన ఓటర్ల వివరాలను అందజేసిందని, అందులో తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా ఉన్న వారి ఓట్లను తొలగించే ప్రయత్నం చేశారని లోకేశ్వర్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసులో గత నెల 25న రంగారెడ్డి జిల్లా కోర్టు బెయిల్ దరఖాస్తులను తిరస్కరించగా ఇప్పుడు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

# జయరాం హత్య కేసులో మొదలైన విచారణ

- ప్రధాన నిందితుడు రాకేశ్‌రెడ్డి
- చార్జిషీట్‌లో ముగ్గురు పోలీసు అధికారులు, మాజీ టీడీపీ నేత



రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్: పారిశ్రామికవేత్త, ప్రవాసాంధ్రుడు చిగురుపాటి జయరాం హత్యకేసుకు సంబంధించి కోర్టులో విచారణ ప్రారంభమైంది. 23 పేజీల చార్జిషీట్‌ను దాఖలు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు అందులో 12 మందిని నిందితులుగా చేర్చారు. చార్జిషీట్‌లో ముగ్గురు పోలీసు అధికారులను సైతం నిందితులుగా పేర్కొన్నారు. జయరాంను దారుణంగా హత్య చేసిన రాకేశ్‌రెడ్డిని ఏ–1గా చార్జిషీట్‌లో చూపించారు. ఇక ఏ–2 గా విశాల్, ఏ–3గా వాచ్‌మెన్ శ్రీనివాస్, ఏ–4గా రౌడీషీటర్ నగేశ్, ఏ–5గా సినీ నటుడు సూర్యప్రసాద్, ఏ–6గా సూర్య స్నేహితుడు కిషోర్, ఏ–7గా రియల్ ఎస్టేట్ వ్యాపారి సుభాష్‌రెడ్డి, ఏ–8గా మాజీ టీడీపీ నేత బీఎన్ రెడ్డి, ఏ–9గా రియల్ ఎస్టేట్ వ్యాపారి అంజిరెడ్డి, ఏ–10గా నల్లకుంట మాజీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఏ–11గా రాయదుర్గం మాజీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఏ–12గా ఇబ్రహీంపట్నం మాజీ ఏసీపీ మల్లారెడ్డిని చేర్చారు. మొత్తం 73 మంది సాక్షులను విచారించగా.. 11వ సాక్షిగా శిఖా చౌదరి, 13వ సాక్షిగా ఆమె సన్నిహితుడు సంతోష్‌రావులు ఉన్నారు. హనీట్రాప్‌తో జయరాం హత్యకు కుట్రపన్నిన రాకేశ్‌రెడ్డి జనవరి 31న పిడిగుద్దులు గుద్ది ముఖంపై దిండుతో అదిమిపెట్టి ఊపిరాడకుండా చేసి దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు పక్కా ఆధారాలను చార్జిషీట్‌లో జతపర్చారు.

### ఆ పోలీసుల సూచనలతోనే..

ఈ కేసులో నిందితులుగా ఉన్న పోలీసుల సూచనతోనే మృతదేహాన్ని నందిగామకు తరలించాడని, జయరాంను చిత్రహింసలు పెట్టి చంపిన రాకేశ్.. ఆ మొత్తం దృశ్యాలను వీడియోలో చిత్రీకరించాడని పేర్కొన్నారు. 11 వీడియోలు, 13 ఫొటోలు తీసినట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. ఆస్పత్రికి తీసుకువెళ్లు.. ప్లీజ్ అంటూ జయరాం ప్రాధేయపడ్డా రాకేశ్ వినిపించుకోలేదు. ప్రతినెలా 50 లక్షలు ఇస్తా నన్ను చంపకుండా వదిలేయ్ అని మొరపెట్టుకున్నట్లు కూడా తేలింది. పాస్‌పోర్ట్ మీ దగ్గరే పెట్టుకో నన్ను ప్రాణాలతో వదిలేయ్ అంటూ కాళ్లావేళ్లా పడ్డ దృశ్యాలు కూడా సమర్పించారు. వీణ అనే పేరుతో తన ఇంటికి జయరాంను రాకేశ్ లంచ్‌కు ఆహ్వానించారు. అయితే జయరాం శరీరంలో ఎటువంటి విషపదార్థాలు లేవని పోస్టుమార్టం నివేదిక స్పష్టం చేసింది. శిఖా చౌదరి బీఎండబ్ల్యూ కారును రాకేశ్ ఎత్తుకెళ్లడమే కాకుండా ఆమె కోసం ఖర్చు చేసిన డబ్బును వెనక్కివ్వాలంటూ డిమాండ్ చేసినట్లు కూడా తేలింది. శిఖా చౌదరి కోసం రాకేశ్ పెద్ద ఎత్తున ఖర్చు చేశాడని తేలింది. కిడ్నాప్ చేసి స్కెచ్ విఫలమయ్యాక రాయదుర్గం సీఐ రాంబాబును రాకేశ్ కలిసాడని స్పష్టం చేశారు. ఖాళీ స్టాంప్ పేపర్ల మీద జయరాం సంతకాలు తీసుకున్నట్లు కూడా స్పష్టమైంది. 4.5 కోట్లు జయరాంకు అప్పు ఇచ్చినట్లు అందులో సంతకాలు పెట్టించుకున్నట్లు కూడా తేలింది. మాజీ టీడీపీ నేత బీఎన్.రెడ్డి సమక్షంలో ఈ అగ్రిమెంట్ జరిగిందని స్పష్టమైంది. హత్య చేసిన విషయాన్ని రాయదుర్గం మాజీ సీఐ రాంబాబుకు ఫోన్‌లో చెప్పడం, కారులో మృతదేహంతో నల్లకుంట పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం ఇవన్నీ పోలీసుల దృష్టికి వచ్చాయి.







Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792